# లోకల్ గైడ్

జాతీయ దినపత్రిక

LOCAL NEWS GOBAL FOCUS

LGTV

తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్

ప్రచురణ : , తెలంగాణ | సంపుటి 14, | సంచిక ,169 | పేజీలు -12 | శనివారం - 18 - ఏప్రిల్ - 2026 | వెల రూ.2/-



లోకల్ గైడ్ www.localguidenews.com తెలంగాణ

విలేకరులు కావలెను

సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.

ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి

8977761499/9110308094




## తేజస్వి సూర్యపై చర్యలు తీసుకోవాలంటూ పొన్నం లేఖ..

### డీజీపీ స్పందన ఏమిటంటే..!

- తెలంగాణలో దుమారం రేపుతున్న తేజస్వి సూర్య వ్యాఖ్యలు
- క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ డీజీపీకి పొన్నం లేఖ

2లో

## దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో

# తెలంగాణ అగ్రగామిగా ఉంది

- ★ వానాకాలం యాసంగి పంటకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలి
- ★ కేంద్రమంత్రి జోషితో రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ
- ★ 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలి
- ★ యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుంది
- ★ రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులపై చర్చ



హైదరాబాద్: యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ధాన్యం యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు తెలంగాణ అనుకూలమని మిగతా..2లో

## 20 ఏళ్లలో నేను చేయలేనిది.. ప్రియాంక 5 నిమిషాల్లో చేసింది

- హోంమంత్రి అమిత్ షాను తన ప్రసంగంతో ప్రియాంక నవ్వించారని ప్రశంస
- తనకు, ప్రధానికి కుటుంబ సమస్యలు లేవంటూ చమత్కారం
- రాజకీయాల్లో తన సోదరి నుంచి ఎంతో నేర్చుకోవాలని వ్యాఖ్య



ఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన సోదరి ప్రియాంక గాంధీ వాద్రాపై ప్రశంసల వర్షం కురిపించారు. తాను 20 ఏళ్లలో సాధించలేనిది, ప్రియాంక కేవలం ఐదు నిమిషాల్లో మిగతా..2లో

## మహిళా రిజర్వేషన్ చట్టం, డీలిమిటేషన్ బిల్లుకు బ్రేక్..

### లోక్ సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి లోక్‌సభలో అనూహ్యమైన ఎదురుదెబ్బ తగిలింది. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు శుక్రవారం జరిగిన ఓటింగ్‌లో వీగిపోయింది. బిల్లుకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో ఓడిపోయినట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఈ కీలక బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో హాజరైన వారిలో మూడింట రెండొంతుల మంది, అంటే 352 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే, ప్రభుత్వం ఈ మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోవడంలో విఫలమైంది. రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయిన వెంటనే, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ




మంత్రి కిరణ్ రిజిజు కీలక ప్రకటన చేశారు. ఈ బిల్లుతో అనుబంధంగా ఉన్న 'డీలిమిటేషన్ బిల్లు, 2026', 'కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026'లను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటున్నట్లు సభకు తెలిపారు. ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను శనివారం ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు.



## ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సంధుపై ట్రంప్ ప్రశంసలు

- మోదీ తనకు అత్యంత ఆప్తుడు అన్న ట్రంప్
- దేశం కోసం మోదీ అద్భుతంగా పని చేస్తున్నారని కితాబు
- సంధు నేతృత్వంలో ఢిల్లీ మరింత అభివృద్ధి చెందుతుందని వ్యాఖ్య

2లో



## మమతా బెనర్జీ పాదయాత్రలో అనూహ్య ఘటన..

దూసుకొచ్చిన యువకుడు

భద్రతా వలయాన్ని ఛేదించుకుని వచ్చిన యువకుడు

మమత కాళ్లు మొక్కే ప్రయత్నం చేసిన వైనం

దిగ్భ్రాంతికి గురైన మమతా బెనర్జీ

యువకుడిని పక్కకు లాగేసిన సెక్యూరిటీ సిబ్బంది

2లో




## దక్షిణాదికి అన్యాయం జరగదు..

## రేవంత్ ఫార్ములా వెనుక అసదుద్దీన్

- డీలిమిటేషన్ విషయంపై ప్రజలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయన్న కిషన్ రెడ్డి
- అన్ని రాష్ట్రాలకు మోదీ సమన్యాయం చేస్తారని వ్యాఖ్య
- జనాభా ప్రాతిపదికన సీట్ల విభజన జరిగినా దక్షిణాది ప్రాధాన్యత తగ్గబోదని వెల్లడి
- హైబ్రిడ్ ఫార్ములాను రేవంత్ చేత ఒవైసీ చెప్పించారని విమర్శ

హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణలో సాగుతున్న ప్రచారాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మిగతా..2లో

## మహిళా బిల్లుతో నవశకం.. ఏపీలో మాత్రం 'రెడ్‌బుక్' రాజ్యమేలుతోంది



- మహిళా శక్తితో భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టవచ్చు
- మహిళల అభివృద్ధి కోసం సామాజికి సంస్కర్తలా ఆలోచించిన ఏకైక నాయకుడు జగన్ అని కితాబు

2లో



## యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్ సిగ్నల్

- ❖ 25 రోజుల విదేశీ యాత్రకు సీబీఐ కోర్టు అనుమతి
- ❖ యూకేతో పాటు యూరప్ దేశాల్లో పర్యటించనున్న జగన్
- ❖ కుటుంబంతో కలిసి 25 రోజుల పాటు విదేశీ పర్యటన
- ❖ పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు సీబీఐకి ఇవ్వాలని కోర్టు ఆదేశం

అమరావతి: వైసీపీ అధినేత జగన్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. తన కుటుంబ సభ్యులతో కలిసి యూకేతో పాటు యూరప్‌లోని పలు దేశాలను సందర్శించేందుకు అనుమతి కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. మిగతా..2లో

## మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజనకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి

### జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు గౌడ్

లోకల్ గైడ్ : న్యూఢిల్లీ/హైదరాబాద్: జాతీయ ప్రయోజనాల దృష్ట్యా మహిళా రిజర్వేషన్ బిల్లు మరియు నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్)కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత ఆశయాలను మోదీ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు.

### అంబేద్కర్ ఆశయాలకు గౌరవం

డాక్టర్ అంబేద్కర్ 1950లలో మహిళల హక్కుల కోసం 'హిందూ కోడ్ బిల్లు'ను ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే అప్పటి పరిస్థితుల వల్ల ఆ బిల్లుకు మద్దతు లేకపోవడంతో ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నారీ శక్తి వందన్ చట్టం ద్వారా మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు.



### డిలిమిటేషన్ అవసరం

దేశ జనాభా భారీగా పెరిగిన నేపథ్యంలో లోక్‌సభ స్థానాలను పెంచడం అవసరమని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా సమాన ప్రాతినిధ్యం సాధ్యమవుతుందని తెలిపారు. దక్షిణ రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే ప్రచారం సరైంది కాదని, "దేశం ఒక కుటుంబంలాంటిదిడ అందరి అభివృద్ధి కోసం నిర్ణయాలు తీసుకోవాలి" అని ఆయన అన్నారు. దేశ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు ఘనత తీసుకోవచ్చని ప్రధాని చెప్పడం ఆయన రాజకీయ పరిపక్వతకు నిదర్శనమని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా అన్ని పార్టీలు ఈ కీలక బిల్లులకు మద్దతు ఇవ్వాలని కోరారు. దేశీయ ఐక్యత భారతదేశ ప్రతిష్టను ప్రపంచ స్థాయిలో పెంచుతుందని ఆయన నొక్కిచెప్పారు.




## ఏపీకి మరో భారీ పెట్టుబడి..

## రూ.8,175 కోట్లతో లిథియం బ్యాటరీ ఫ్యాక్టరీ

రాంబిల్లిలో లిథియం అయాన్ బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటు

రూ.8,175 కోట్ల పెట్టుబడితో వారీ ఎనర్జీ ఫ్యాక్టరీ


పరిశ్రమ కోసం 300 ఎకరాల భూమిని కేటాయించిన ప్రభుత్వం

ఈ పరిశ్రమ ద్వారా 3,000 మందికి ఉపాధి అవకాశం

2027 జులై నాటికి తొలి దశ పూర్తి చేయడమే లక్ష్యం

అమరావతి: ఏపీకి మరో భారీ పెట్టుబడి వచ్చింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ. 8,175 కోట్ల వ్యయంతో లిథియం అయాన్ బ్యాటరీల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ప్రముఖ సంస్థ వారీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఫ్యాక్టరీని నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ పరిశ్రమ కోసం ఏపీ ప్రభుత్వం మిగతా..2లో

## ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలను ప్రభుత్వం నట్టేట ముంచింది: కవిత



- ఆరు నెలల్లోగా పీఆర్సీ అమలుచేస్తామన్న హామీ ఏమైందని ప్రభుత్వానికి కవిత ప్రశ్న
- పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న వాగ్దానాన్ని గాలికి వదిలేశారని విమర్శ

2లో

## నాసిక్ టీసీఎస్‌లో బలవంతపు మతమార్పిడి..



మహారాష్ట్ర: నాసిక్‌లోని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) యూనిట్‌లో జరిగిన లైంగిక వేధింపులు, బలవంతపు మత మార్పిడి ఆరోపణలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తొలిసారిగా స్పందించారు. ఈ ఘటన 'కార్పొరేట్ జిహాద్' చర్య అని తేలితే, దాని మూలాలను గుర్తించేందుకు

2లో

## మహిళా రిజర్వేషన్ బిల్లును
# ఏకగ్రీవంగా ఆమోదించాలి

ఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ చరిత్రాత్మక బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి చరిత్ర సృష్టించాలని ఆయన పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. చరిత్ర సృష్టించాలని ఆయన పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఇది దేశంలోని సగం జనాభా అయిన మహిళలకు దక్కాల్సిన హక్కు అని, వారి శక్తికి కొత్త అవకాశాలు కల్పించాలని కోరారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలు కోసం ప్రభుత్వం ఈ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ బిల్లును 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి అమలు చేయడమే లక్ష్యంగా అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. భవిష్యత్తులో జనాభా గణన, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తర్వాత ఈ రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, "దయచేసి మీ మనస్సాక్షి చెప్పినట్టు నడుచుకోండి. మీ కుటుంబంలోని మహిళలను గుర్తుచేసుకోండి. ఇది మహిళలకు మనం ఇస్తున్నాం అనుకోకండి... యుగాలుగా వారికి నిరాకరించబడిన హక్కును తిరిగి ఇవ్వడం మన బాధ్యత అని గుర్తించండి" అని పేర్కొన్నారు. ఈ బిల్లు ఆమోదం ఘనతను ప్రతిపక్షాలే తీసుకోవచ్చని, తనకు క్రెడిట్ అవసరం లేదని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని ప్రధాని స్పష్టమైన హామీ ఇచ్చారు. ప్రస్తుతం లోక్‌సభలో ఈ బిల్లులపై చర్చ కొనసాగుతుండగా, శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. ఈ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందితే దేశ ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని పేర్కొన్నారు.

# 20 ఏళ్లలో నేను చేయలేనిది.. ప్రియాంక 5 నిమిషాల్లో చేసింది

మొదటి పేజి తరువాయి

ప్రియాంక కేవలం ఐదు నిమిషాల్లో సాధించిందని సరదాగా వ్యాఖ్యానించారు. రాజకీయ జీవితంలో ఆమె నుంచి తాను చాలా నేర్చుకోవాల్సి ఉందని బహిరంగంగా అంగీకరించారు. రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలతో సభలో నవ్వులు విరిశాయి. "నేను 20 ఏళ్లలో చేయలేని పనిని మా సోదరి 5 నిమిషాల్లో చేసి చూపించింది. ఆమె ప్రసంగం చూసి చాలా గర్వపడ్డాను. ఆమె హోంమంత్రి అమిత్ షాను నవ్వించారు" అని రాహుల్ అన్నారు. నేడు మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరిగిన చర్చలో ప్రియాంక గాంధీ ప్రభుత్వంపై గట్టిగా విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశిస్తూ.. "ఈనాటి రాజకీయ చాణక్యాన్ని చూసి చాణక్యుడు బతికుంటే ఆశ్చర్యపోయేవారు" అని చురకలు అంటించగా, అమిత్ షా నవ్వారు. లోక్‌సభలో మూడు కీలక బిల్లులపై జరిగిన చర్చలో పాల్గొన్న రాహుల్, తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... తనకు, ప్రధానమంత్రికి కుటుంబ సమస్యలు లేవంటూ మరో చమత్కారం విసిరారు. దీంతో సభ్యులంతా మరోసారి పగలబడి నవ్వారు. ఈ సందర్భంగా 'నారీశక్తి'ని ప్రశంసించిన రాహుల్, ప్రతి ఒక్కరి జీవితంలో మహిళలు ముందుండి నడిపే శక్తిగా ఉంటారని కొనియాడారు. తన చిన్నతనంలో చీకటంటే భయపడినప్పుడు, తన నాయనమ్మ జీవిత సత్యాలు నేర్పి ధైర్యం చెప్పిన విషయాన్ని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు.

# నాసిక్ టీసీఎస్‌లో బలవంతపు మతమార్పిడి..

మొదటి పేజి తరువాయి

మూలాలను గుర్తించేందుకు దర్యాప్తు సంస్థలను రంగంలోకి దింపుతామని హెచ్చరించారు. ఈ ఘటన అత్యంత తీవ్రమైనదని, దీని వెనుక పెద్ద ముఠా ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా వెల్లడైందని అన్నారు. సంస్థలో జరిగిన ఈ ఘటనను గుర్తించినందుకు ఆయన టీసీఎస్‌ను అభినందించారు. కంపెనీ యాజమాన్యం కూడా ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిందని, పోలీసులకు దర్యాప్తులో సహకరిస్తోందని తెలిపారు. ఈ ఘటనకు మూల కారణాలు తెలుసుకోవడానికి పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారని తెలిపారు. ఈ ఘటనకు కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలి పెట్టబోమని హెచ్చరించారు. పోలీసులు ఇప్పటి వరకు ఎనిమిది మందిని అరెస్టు చేసి, విచారణ జరుపుతున్నారని అన్నారు.

బాధితురాలు పలుమార్లు ఫిర్యాదు చేసింది: నాసిక్ పోలీస్ కమిషనర్

ఈ ఘటనకు సంబంధించి నాసిక్ పోలీస్ కమిషనర్ సందీప్ కార్నిక్ మాట్లాడుతూ, బాధితురాలు తన సమస్యపై పలుమార్లు హెచ్ఆర్ విభాగానికి ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదని అన్నారు. పైగా పని ప్రదేశాల్లో ఇలాంటివి సహజమని చెప్పి ఆమెను పోలీసులకు ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నారని తెలిపారు. నిందితులకు అతివాద భావజాల గ్రూపులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు.

# తేజస్వి సూర్యపై చర్యలు తీసుకోవాలంటూ పొన్నం లేఖ..
## డీజీపీ స్పందన ఏమిటంటే..!

హైదరాబాద్: తెలంగాణ అస్తిత్వంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యల దుమారం ఇప్పుడు న్యాయపరమైన మలుపు తిరిగింది. పార్లమెంట్ వేదికగా తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చిన తేజస్విపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డికి లేఖ రాశారు. అయితే, ఈ లేఖపై స్పందించిన డీజీపీ, చట్టసభల పరిధిలో జరిగే చర్చలపై పోలీసులకు ఉండే పరిమితులను స్పష్టం చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం చట్టసభల్లో సభ్యులు మాట్లాడిన అంశాలపై చర్యలు తీసుకునే అధికారం పోలీసు విభాగానికి ఉండదని ఆయన తేల్చిచెప్పారు. మరోవైపు, మంత్రి పొన్నం ప్రభాకర్ మాత్రం తన పోరాటాన్ని ఆపడం లేదు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఇంతలా కించపరుస్తుంటే రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు నోరు మెదపకపోవడం శోచనీయమని ఆయన మండిపడ్డారు. డీలిమిటేషన్‌పై జరిగిన చర్చలో తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు కోట్లాది మంది తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచాయని, ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, ఒక ప్రాంత చరిత్రను కించపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజి తరువాయి

పిటిషన్‌పై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. ఈ నెల 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు, అంటే మొత్తం 25 రోజుల పాటు విదేశాల్లో గడిపేందుకు కోర్టు ఆయనకు అనుమతి మంజూరు చేసింది. అక్రమాస్తుల కేసు విచారణలో ఉన్న నేపథ్యంలో, విదేశీ ప్రయాణాలకు కోర్టు అనుమతి తప్పనిసరి కావడంతో జగన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈ విదేశీ పర్యటనకు సంబంధించి న్యాయస్థానం కొన్ని కఠినమైన షరతులను విధించింది. ప్రయాణానికి ముందే తన పూర్తి పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు, ఈ-మెయిల్ ఐడీ, అవసరమైన ష్యూరిటీ వివరాలను సీబీఐ అధికారులకు సమర్పించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఏపీలో రాజకీయ సమీకరణాలు మారుతున్న తరుణంలో, జగన్ సుమారు మూడు వారాల పాటు విదేశీ పర్యటనకు వెళుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పర్యటన ముగించుకున్నాక, మే మధ్యలో ఆయన తిరిగి రాష్ట్రానికి చేరుకోనున్నారు.

## మహిళా బిల్లుతో నవశకం..
# ఏపీలో మాత్రం 'రెడ్‌బుక్' రాజ్యమేలుతోంది

అమరావతి: దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు కార్యరూపం దాల్చిన ఈరోజు దేశ చరిత్రలో ఒక గొప్ప రోజని వైసీపీ నేత, మాజీ మంత్రి విడదల రజని కొనియాడారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, ఈ బిల్లుతో దేశ భవిష్యత్తు మారబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా శక్తితో భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టవచ్చని, ఇప్పటికే వైసీపీ ఈ బిల్లుకు తన సంపూర్ణ మద్దతు ప్రకటించిందని గుర్తుచేశారు. మహిళల అభివృద్ధి కోసం సామాజిక సంస్కర్తలా ఆలోచించిన ఏకైక నాయకుడు జగన్ అని, ఆయన హయాంలో అమలైన 90 శాతం పథకాలు మహిళా సాధికారత కోసమే రూపొందించబడ్డాయని ఆమె పేర్కొన్నారు. అయితే, ఇదే సమయంలో ఏపీలోని కూటమి ప్రభుత్వంపై విడదల రజని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దిగజారిపోయిందని, మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. "జగనన్న హయాంలో దిశ యాప్, మహిళా పోలీస్ స్టేషన్లు, జీరో ఎఫ్ఐఆర్ వంటి వినూత్న కార్యక్రమాలతో మహిళలకు భద్రత కల్పిస్తే... నేడు చంద్రబాబు హయాంలో కేవలం 'రెడ్‌బుక్' పాలన మాత్రమే సాగుతోంది" అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారంటూ ఆరోపణలు చేసిన పవన్ కల్యాణ్, చంద్రబాబులు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వారిని వెనక్కి తెచ్చారా? అని నిలదీశారు. మహిళల పట్ల అఘాయిత్యాలకు పాల్పడుతున్న కూటమి ఎమ్మెల్యేలు, నేతలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రజని ప్రశ్నించారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు వస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయిలో వారి రక్షణను గాలికి వదిలేయడం శోచనీయమన్నారు.

## దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో
# తెలంగాణ అగ్రగామిగా ఉంది

మొదటి పేజి తరువాయి

తెలంగాణ అనుకూలమని వారు కేంద్ర మంత్రికి తెలియజేశారు. వానాకాలం యాసంగి పంటకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని వారు కేంద్రమంత్రిని కోరారు. 2025-26 సీజన్ కు గాను యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ధాన్యం సేకరణ, కేంద్ర ప్రభుత్వం వాటా సంబంధిత అంశాలపై కేంద్రమంత్రితో వారు చర్చించారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులను మంజూరు చేయాలని వారు కోరారు. గత ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో 90 ఎల్ఎంటీ ధాన్యం ఉత్పత్తి అవుతుందని వివరించారు. యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, అందువల్ల యాసంగి పంటకు సంబంధించి మొత్తం 30 ఎల్ఎంటీ బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), 5 ఎల్ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రికి చెప్పారు. బాయిల్డ్ రైస్ సరఫరాకు సంబంధించి ముఖ్యమంత్రి గారి ప్రతిపాదనకు కేంద్ర మంత్రి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. 201415 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన రూ. 1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని శ్రీ ప్రహ్లాద్ జోషి గారికి విజ్ఞప్తి చేశారు. దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు తాము చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే పాత బకాయిలు విడుదల చేయాలని కోరారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గాను పోషకాహార బియ్యాన్ని పాఠశాలలు, వసతిగృహాలు, ఐసీడీఎస్ పరిధిలో పంపిణీ చేసేవారని, ఇటీవల దానిని నిలిపివేశారని పేర్కొంటూ వెంటనే పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో జరిగిన సమావేశంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి గారు, సెక్రటరీ కో-ఆర్డినేషన్ అద్వైత్ సింగ్ గారితో పాటు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## దక్షిణాదికి అన్యాయం జరగదు..
# రేవంత్ ఫార్ములా వెనుక అసదుద్దీన్: కిషన్ రెడ్డి

హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణలో సాగుతున్న ప్రచారాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో మీడియా ముఖంగా మాట్లాడిన ఆయన... ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ 'నార్త్ వర్సెస్ సౌత్' వివాదాన్ని సృష్టించేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ప్రధాని మోదీ సమన్యాయం చేస్తారని, జనాభా ప్రాతిపదికన సీట్ల విభజన జరిగినా దక్షిణాది ప్రాధాన్యత తగ్గబోదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏపీలో సీట్లు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కు, తమిళనాడులో 39 నుంచి 59కి పెరిగే అవకాశం ఉందని ఆయన గణాంకాలను వివరించారు. మరోవైపు, మహిళా రిజర్వేషన్ బిల్లుపై కూడా కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మజ్లిస్ పార్టీ తన సీట్లు ఎక్కడ పోతాయో అన్న భయంతో మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోందని, ఆ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ ఫార్ములా అసలు ఆయనది కాదని, అది అసదుద్దీన్ ఓవైసీ వెనుక ఉండి చెప్పించిన ఫార్ములా అని ఆయన ఆరోపించారు. కేవలం హైదరాబాద్‌లో ఎక్కువ ఆదాయం వస్తుందని అక్కడ సీట్లు పెంచమంటారా? అని ప్రశ్నించిన ఆయన... డబ్బున్న చోట ఓటు విలువ ఎక్కువగా ఉండాలని కోరుకోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యం అని నిలదీశారు. మహిళలను అణగదొక్కే రాజకీయాలకు ఎంఐఎం కేంద్ర బిందువుగా మారిందని, విపక్షాలన్నీ కలిసి మహిళా నాయకత్వాన్ని అడ్డుకుంటున్నాయని ధ్వజమెత్తారు.

# ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సంధుపై ట్రంప్ ప్రశంసలు

ఢిల్లీ: అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందనడానికి అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ తనకు అత్యంత ఆప్తమిత్రుడని, ఆయన దేశం కోసం అద్భుతంగా పనిచేస్తున్నారని ట్రంప్ కొనియాడారు. ఇటీవల వీరిద్దరి మధ్య జరిగిన 40 నిమిషాల సుదీర్ఘ ఫోన్ సంభాషణలో పశ్చిమాసియా ఉద్రిక్తతలు, హర్మూజ్ జలసంధి పునరుద్ధరణ వంటి కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ఇదే క్రమంలో ఢిల్లీ నూతన లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జీత్ సింగ్ సంధుపై కూడా ట్రంప్ ప్రశంసలు కురిపించారు. అమెరికాలో భారత రాయబారిగా సంధు అందించిన సేవలు ఇరుదేశాల బంధాన్ని బలోపేతం చేశాయని, ఆయన నేతృత్వంలో ఢిల్లీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.

## ఏపీకి మరో భారీ పెట్టుబడి..
# రూ.8,175 కోట్లతో లిథియం బ్యాటరీ ఫ్యాక్టరీ

అమరావతి: ఏపీకి మరో భారీ పెట్టుబడి వచ్చింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.8,175 కోట్ల వ్యయంతో లిథియం అయాన్ బ్యాటరీల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ప్రముఖ సంస్థ వారీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఫ్యాక్టరీని నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ పరిశ్రమ కోసం ఏపీ ప్రభుత్వం 300 ఎకరాల భూమిని కేటాయించింది. మొత్తం 16 గిగావాట్ అవర్ సామర్థ్యంతో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీలో సెల్, ప్యాక్, స్టోరేజ్‌కు అవసరమైన బ్యాటరీలను తయారు చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 3,000 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. మొదటి దశ పనులను 2027 జులై నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ భారీ పరిశ్రమ రాబోతోంది. ఇటీవల కాలంలో విశాఖకు ఐటీ, అనకాపల్లికి పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు వస్తున్నాయి. ఇక ఈ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్న వారీ సంస్థకు గుజరాత్, అమెరికాలోని టెక్సాస్‌లో సోలార్ మాడ్యూల్స్ తయారీ యూనిట్లు ఉన్నాయి. సుమారు 30 దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తూ అంతర్జాతీయంగా మంచి గుర్తింపు పొందింది. భవిష్యత్తులో ఈ ప్లాంట్‌ను మరింత విస్తరించాలని వారీ సంస్థ ప్రణాళికలు రచిస్తోంది. అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) లిథియం అయాన్ సెల్స్, బ్యాటరీ ప్యాక్‌ల తయారీ సామర్థ్యాన్ని 20 గిగావాట్ అవర్ వరకు పెంచాలని భావిస్తోంది. విద్యుత్ నిల్వకు కీలకమైన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) తయారీపై దృష్టి సారించనుంది. దేశంలోనే ఇటువంటి ప్రాజెక్టులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో అనకాపల్లి జిల్లా పారిశ్రామిక చిత్రపటంలో ఈ ఫ్యాక్టరీ కీలకపాత్ర పోషించనుంది.

## మమతా బెనర్జీ పాదయాత్రలో అనూహ్య ఘటన..
# దూసుకొచ్చిన యువకుడు

పశ్చిమ బెంగాల్: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఎన్నికల వేడి తారాస్థాయికి చేరిన వేళ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పర్యటనలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. పటిష్ఠమైన భద్రతా వలయం మధ్య ఆమె ఎన్నికల ప్రచార పాదయాత్ర నిర్వహిస్తుండగా, ఊహించని విధంగా ఒక యువకుడు రక్షణ కవచాన్ని ఛేదించుకుని నేరుగా ఆమె వద్దకు దూసుకురావడంతో తీవ్ర కలకలం రేగింది. అభిమానులకు అభివాదం చేస్తూ దీదీ ముందుకు సాగుతున్న సమయంలో, జనం మధ్య నుంచి మెరుపు వేగంతో వచ్చిన ఆ యువకుడు ఒక్కసారిగా ఆమె కాళ్లు మొక్కే ప్రయత్నం చేశాడు. అకస్మాత్తుగా జరిగిన ఈ పరిణామంతో మమతా బెనర్జీ దిగ్భ్రాంతికి లోనయ్యారు. భద్రతా సిబ్బంది తేరుకునేలోపే ఆ యువకుడు ముఖ్యమంత్రికి అత్యంత సమీపంలోకి వచ్చేయడంతో అక్కడ ఉన్న వారంతా భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది అతడిని అడ్డుకుని పక్కకు లాగేశారు. గతంలో ఎన్నికల ప్రచార సమయంలో మమతా బెనర్జీ పలుమార్లు గాయపడిన చేదు అనుభవాలు ఉండటంతో, తాజా భద్రతా లోపం తృణమూల్ కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన నింపింది.

# జగన్ దెబ్బకు భయపడిపోయిన సింగపూర్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ అంటే సింగపూర్‌కు మొదటి నుంచీ సానుకూల దృక్పథం ఉండేదని, వైకాపా ప్రభుత్వం దాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో స్టార్టప్ ఏరియా అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టిన సింగపూర్ సంస్థల్ని అప్పటి సీఎం జగన్ తీవ్ర వేధింపులకు గురిచేసి వెళ్లగొట్టారని, దాంతో వాళ్లు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా ఆంధ్రప్రదేశ్‌కి రావాలంటే భయపడిపోయారని చెప్పారు. వారికి నచ్చజెప్పి మళ్లీ నచ్చజెప్పి రాష్ట్రానికి రప్పించేందుకు చాలా శ్రమపడాల్సి వచ్చిందన్నారు. సింగపూర్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉత్తమ పరిపాలనా విధానాలపై శిక్షణ కోసం ఈ నెల 21 నుంచి 27 వరకు ఆ దేశంలో పర్యటించనున్న రాష్ట్ర మంత్రులతో చంద్రబాబు గురువారం మధ్యాహ్నం విందు సమావేశం నిర్వహించారు. ఉత్తమ పరిపాలనా విధానాలు, అభివృద్ధిలో సింగపూర్ ప్రపంచానికి ఒక నమూనాగా నిలిచిందని సీఎం అన్నారు. ప్రజలకు ఇంకా వేగంగా, మెరుగ్గా, అవినీతికి తావులేకుండా ప్రభుత్వ సేవల్ని అందించేందుకు అమలు చేయాల్సిన విధానాల్ని సింగపూర్ పర్యటనలో అధ్యయనం చేయాలని మంత్రులకు సూచించారు. సింగపూర్‌లో తగినంత స్థలం లేకపోవడం వల్ల ప్రభుత్వం మలేషియాలో ఎకనమిక్ జోన్ అభివృద్ధి చేస్తోందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. వైకాపా హయాంలో జగన్ రాజధానిపై కక్షకట్టకుండా, సింగపూర్ సంస్థల్ని తరిమికొట్టకుండా ఉంటే.. ఆ ఎకనమిక్ జోన్ అమరావతిలోనే అభివృద్ధి చేసేవారని ఆయన పేర్కొన్నారు.

సార్.. వాళ్లు మీ స్ఫూర్తితోనే షెడ్యూల్ రూపొందించినట్టున్నారు!

సింగపూర్‌లో శిక్షణ తరగతుల్ని ఉదయం 8 గంటలకే మొదలుపెట్టి రాత్రి 7 గంటలకు ముగించేలా షెడ్యూల్ రూపొందించడంపై మంత్రులు ఛలోక్తులు విసురుకున్నారు. 'సార్.. మీ నుంచి స్ఫూర్తి పొందే వారు అంత సుదీర్ఘంగా షెడ్యూల్ తయారు చేసినట్టున్నారు' అని ఒకరిద్దరు మంత్రులు సీఎంతో అన్నారు. పర్యటన తొలిరోజు ఉదయం 6.30 గంటలకు సింగపూర్‌లో విమానం దిగితే, ఉదయం 8.30 గంటలకే క్లాస్‌లు మొదలు పెట్టేస్తున్నారని వారు తెలిపారు. సీఎం స్పందిస్తూ.. కష్టపడాలని, ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయితేనే సమర్థంగా పనిచేయగలమని పేర్కొన్నారు.

## పాంపీలో పురాతన 'మెషిన్ గన్'..
## వెలుగులోకి 2000 ఏళ్ల నాటి యుద్ధ రహస్యం!

ఢిల్లీ: పాంపీ నగరం అనగానే క్రీ.శ. 79లో వెసువియస్ అగ్నిపర్వతం బద్దలై బూడిద కింద సమాధి కావడం గుర్తుకొస్తుంది. కానీ, ఆ వినాశనానికి సుమారు 170 సంవత్సరాల ముందే అక్కడ జరిగిన ఓ భీకర యుద్ధానికి సంబంధించిన కీలక ఆధారాలు ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. పురాతన కాలం నాటి 'మెషిన్ గన్'గా పిలిచే 'పాలిబోలోస్' అనే శక్తిమంతమైన ఆయుధాన్ని అక్కడ వాడినట్లు పరిశోధకులు గుర్తించారు. ఇటలీకి చెందిన కాంపానియా, బోలోగ్నా యూనివర్సిటీల పరిశోధకులు అధునాతన లేజర్ స్కానింగ్ , 3ఐ డిజిటల్ ఇమేజింగ్ టెక్నాలజీ సహాయంతో ఈ ఆవిష్కరణ చేశారు. పాంపీ ఉత్తర ప్రాంతంలోని కోట గోడలపై బాణాల దాడికి సంబంధించిన ప్రత్యేకమైన గుర్తులను గుర్తించారు. సాధారణ కాటపల్ట్ దాడుల్లా కాకుండా, ఈ గుర్తులు చిన్నవిగా, గుంపులుగా ఉన్నాయి. ఒకే చోటు నుంచి వేగంగా బాణాలను ప్రయోగించడం వల్లే ఇలాంటి గుర్తులు ఏర్పడతాయని పరిశోధకులు విశ్లేషిస్తున్నారు. ఈ దాడి క్రీ.పూ. 89లో రోమన్ జనరల్ లూసియస్ కార్నెలియస్ సూలా పాంపీని ముట్టడించినప్పుడు జరిగిందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. తన తూర్పు మధ్యధరా సైనిక చర్యల సమయంలో సూలా ఈ అధునాతన ఆయుధాన్ని, దాని టెక్నాలజీని పొంది ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. పాలిబోలోస్ అనేది ఒకేసారి అనేక బాణాలను వేగంగా సంధించగల రిపీటింగ్ కాటపల్ట్. గ్రావిటీ ఫీడ్ మ్యాగజైన్ సహాయంతో బాణాలను ఆటోమేటిక్‌గా లోడ్ చేసుకుని నిరంతరాయంగా దాడి చేయగల సామర్థ్యం దీనికి ఉంది. ఈ ఆయుధానికి సంబంధించిన భౌతిక అవశేషాలు ఏవీ లభించనప్పటికీ, గోడలపై ఉన్న ఈ బాలిస్టిక్ గుర్తులే దాని వాడకానికి బలమైన సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇప్పటివరకు కేవలం గ్రంథాల్లో మాత్రమే ప్రస్తావన ఉన్న పాలిబోలోస్ ఆయుధం వాస్తవంగానే ఉనికిలో ఉండేదని ఈ పరిశోధన నిరూపించింది. ఈ వివరాలు ఎండీపీఐ (ఎండీపీఐ) జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

# క్షిపణి పరీక్షల కోసం ఒకేసారి 'నోటమ్' జారీ చేసిన భారత్, పాకిస్థాన్

ఢిల్లీ: అరేబియా సముద్రంలో క్షిపణి విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు భారత, పాకిస్థాన్ దేశాలు ఒకేసారి నోటమ్ (నోటీసెస్ టు ఎయిర్‌మెన్) జారీ చేశాయి. క్షిపణి ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇరుదేశాలు తెలిపాయి. సముద్రంపై సైనిక విన్యాసాల సమయంలో నిర్దేశించిన జోన్‌లకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని ఆయా దేశాలు నోటమ్, మారిటైమ్ అడ్వైజరీ వంటివి జారీ చేయడం సహజమే. అయితే ఇప్పుడు రెండు దేశాలు ఒకేసారి నోటమ్ జారీ చేయడం ఆసక్తికరంగా మారింది. ఏప్రిల్ 20 తెల్లవారుజామున 3 గంటల నుంచి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 3 గంటల వరకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నోటమ్ జారీ చేసింది. 200 కిలోమీటర్ల మేర క్షిపణి విన్యాసాల జోన్‌గా పాకిస్థాన్ ప్రకటించింది. అలాగే భారత్ కూడా ఏప్రిల్ 22వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి ఏప్రిల్ 25న రాత్రి 9.30 గంటల వరకు సుదీర్ఘ విన్యాసాలకు హెచ్చరికలు జారీ చేసింది. భారత్ 400 కిలోమీటర్ల మేర క్షిపణుల విన్యాసం కోసం జోన్‌గా ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ జరిగిన సంవత్సరం తర్వాత ఇరుదేశాలు ఆయుధ పరీక్షలపై ప్రకటన చేయడం గమనార్హం.

## చిన్న గెలాక్సీలలోనూ బ్లాక్ హోల్స్..
# భారత శాస్త్రవేత్తల పరిశోధనలో కొత్త కోణం

ఈ పరిశోధన భవిష్యత్ టెలిస్కోపుల ద్వారా చేసే అధ్యయనాలకు ఒక ఫ్రేమ్‌వర్క్‌ను అందిస్తుందని వ్యాఖ్య

ఢిల్లీ: విశ్వంలో అతిపెద్ద గెలాక్సీల కేంద్రాల్లోనే కాకుండా అతి చిన్న గెలాక్సీలలోనూ కృష్ణబిలాలు (బ్లాక్ హోల్స్) ఉండే అవకాశం ఉందని భారత శాస్త్రవేత్తల తాజా అధ్యయనం వెల్లడించింది. మన పాలపుంత గెలాక్సీ చుట్టూ పరిభ్రమించే మరుగుజ్జు గోళాకార గెలాక్సీలలో మధ్యస్థ పరిమాణ కృష్ణబిలాలు ఉండేందుకు బలమైన ఆధారాలు ఉన్నాయని తమ డేటా సూచిస్తోందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ వివరాలను సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ)కు చెందిన కె. ఆదిత్య, అరుణ్ మంగళం ఈ కీలక అధ్యయనం చేపట్టారు. వీరు నక్షత్రాలు, డార్క్ మ్యాటర్ హేలో, కేంద్రంలోని కృష్ణబిలం అనే మూడు గురుత్వాకర్షణ భాగాలతో కూడిన డైనమిక్ మోడళ్లను రూపొందించారు. అత్యంత నాణ్యమైన స్టెల్లార్ కైనమాటిక్ డేటాను ఉపయోగించి, ఈ గెలాక్సీలలో నక్షత్రాలు ఎలా కదులుతున్నాయో విశ్లేషించారు. ఒకవేళ ఆ గెలాక్సీల కేంద్రంలో కృష్ణబిలం ఉంటే, దాని ద్రవ్యరాశిని అంచనా వేయడానికి ఈ సమాచారాన్ని ఉపయోగించారు. ఈ పరిశోధనపై అరుణ్ మంగళం మాట్లాడుతూ.. "మా మోడళ్లు, డేటాను పరిశీలించినప్పుడు ఈ మరుగుజ్జు గెలాక్సీలలోని కేంద్ర కృష్ణబిలాల ద్రవ్యరాశిపై కచ్చితమైన పరిమితులు విధించగలిగాం. సాధారణంగా వీటి ద్రవ్యరాశి పది లక్షల సౌర ద్రవ్యరాశుల కంటే తక్కువగా ఉంటుంది. కొన్ని గెలాక్సీలలో ఇంకా తక్కువ విలువలు ఉండే అవకాశం ఉంది. ఈ గెలాక్సీలలో కచ్చితంగా భారీ కృష్ణబిలాలు ఉండాలని మా డేటా చెప్పడం లేదు. కానీ, మధ్యస్థ పరిమాణ కృష్ణబిలాలు ఉండేందుకు మాత్రం మా డేటా పూర్తిగా అనుకూలంగా ఉంది" అని వివరించారు. పెద్ద గెలాక్సీల కేంద్రాలలో సూపర్‌మాసివ్ కృష్ణబిలాలను గుర్తించడం సాధారణమే. కానీ, పాలపుంత చుట్టూ ఉండే మరుగుజ్జు గెలాక్సీలు చాలా కాంతిహీనంగా, వాయువులు లేకుండా, డార్క్ మ్యాటర్‌తో నిండి ఉంటాయి. దీంతో వీటిలో కృష్ణబిలాలను నేరుగా గుర్తించడం అత్యంత కష్టతరం. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం గెలాక్సీలు, కృష్ణబిలాల పరిణామ సిద్ధాంతాలకు, భవిష్యత్ పరిశీలనలకు చాలా ముఖ్యమైందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భవిష్యత్తులో ఐఐఏ ప్రతిపాదించిన నేషనల్ లార్జ్ ఆప్టికల్ టెలిస్కోప్ , ఎక్స్‌ట్రీమ్లీ లార్జ్ టెలిస్కోప్ వంటి అత్యాధునిక పరిశీలనా సౌకర్యాలు రాబోతున్నాయి. ఇవి అతి తక్కువ కాంతివంతమైన, చిన్న గెలాక్సీలలోని నక్షత్ర కదలికలను కూడా కచ్చితంగా కొలవగలవు. అలాంటి పరిస్థితుల్లో ఈ అధ్యయనంలో ప్రతిపాదించిన ఏకీకృత సంబంధం ఆ డేటాను విశ్లేషించడానికి ఒక బలమైన ఫ్రేమ్‌వర్క్‌గా ఉపయోగపడుతుందని అరుణ్ మంగళం తెలిపారు.

## సభికులను నవ్విస్తూనే
# ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రియాంకా గాంధీ

ఢిల్లీ: వయనాడ్ ఎంపీగా లోక్‌సభలో అడుగుపెట్టిన ప్రియాంక గాంధీ వాద్రా తన తొలి ప్రసంగంతో పార్లమెంటును ఆకట్టుకున్నారు. శుక్రవారం 21 నిమిషాల పాటు సాగిన ఆమె ప్రసంగంలో వాగ్ధాటి, వ్యంగ్యం, రాజకీయ చతురత కలగలిసి కనిపించాయి. అధికార పక్షాన్ని ఇరుకునపెట్టేలా చమత్కారాలు విసురుతూనే, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను సైతం నవ్వించి తనదైన ముద్ర కనబరిచారు. మహిళా రిజర్వేషన్లపై జరిగిన చర్చలో ప్రియాంక మాట్లాడుతూ.. తరచూ బీజేపీ విమర్శించే నెహ్రూ ప్రస్తావనను తెలివిగా వాడుకున్నారు. 'మహిళా హక్కులకు పునాది వేసింది నెహ్రూ అనే వ్యక్తి. కంగారుపడకండి.. మీరు భయపడే జవహర్‌లాల్ నెహ్రూ గురించి నేను చెప్పడం లేదు, ఇది చరిత్ర' అంటూ మోతీలాల్ నెహ్రూ రిపోర్ట్‌ను ప్రస్తావించారు. 1928లోనే మహిళలకు సమాన హక్కుల ప్రతిపాదన జరిగిందని, 1931లో సర్దార్ పటేల్ అధ్యక్షతన కరాచీ సెషన్‌లో తీర్మానం నెగ్గిందని ప్రియాంక గుర్తుచేశారు. ప్రసంగం మధ్యలో హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. 'మీ వ్యూహాలు, ప్రణాళికలు చూస్తుంటే, ఒకవేళ ఈ రోజు చాణక్యుడు బతికి ఉంటే ఆయనే షాక్‌కు గురయ్యేవారు' అని ప్రియాంక అనగానే, అమిత్ షా గట్టిగా నవ్వడం అందరి దృష్టిని ఆకర్షించింది. అదే సమయంలో, మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై ప్రియాంక తీవ్రంగా విరుచుకుపడ్డారు. డీలిమిటేషన్ పేరుతో ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఈ బిల్లును ప్రస్తుత రూపంలో ఆమోదిస్తే దేశంలో ప్రజాస్వామ్యమే మిగలదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రసంగం ముగిసే సమయానికి సభలోకి వచ్చిన సోదరుడు రాహుల్ గాంధీ, ప్రియాంకను అభినందిస్తూ 'ఇదే వేగాన్ని కొనసాగించు' అని ప్రోత్సహించారు. మొత్తంమీద, తన తొలి ప్రసంగంతోనే ప్రియాంక గాంధీ లోక్‌సభలో ఒక బలమైన గొంతుకగా నిలవనున్నారనే సంకేతాలు స్పష్టంగా ఇచ్చారు.

# డీలిమిటేషన్‌తో అన్యాయం జరిగితే ఊరుకోం: లోక్‌సభలో మిథున్ రెడ్డి

అమరావతి: నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై పార్లమెంట్ సాక్షిగా వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. గతంలో విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు 'ప్రత్యేక హోదా' ఇస్తామని హామీ ఇచ్చి, ఆ తర్వాత చట్టంలో లేదంటూ తప్పించుకున్నారంటూ మండిపడ్డారు. ఇప్పుడు డీలిమిటేషన్ విషయంలో కూడా అదే తీరు పునరావృతమైతే సహించేది లేదని ఆయన తెగేసి చెప్పారు. డీలిమిటేషన్ అనేది దేశ నిర్మాణానికి ఉపయోగపడాలి తప్ప, ప్రతిపక్షాలను అణగదొక్కే సాధనంగా మారకూడదని ఆయన హితవు పలికారు. ముఖ్యంగా ఏపీలో లోక్‌సభ స్థానాల విషయంలో ఒక్క సీటు తగ్గినా, లేదా రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగేలా ఏ చిన్న అన్యాయం జరిగినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి సైతం ఇదే అంశంపై స్పందిస్తూ.. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య సీట్ల కేటాయింపులో సమానత్వం ఉండాలని, అప్పుడే డీలిమిటేషన్‌కు అసలైన సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. సీట్ల పంపకాల్లో తేడాలు వస్తే పోరాటం తప్పదని పార్టీ ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షించేలా ఈ ప్రక్రియ ఉండకూడదన్నదే వైసీపీ ప్రధాన డిమాండ్‌గా కనిపిస్తోంది.

## ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలను
# ప్రభుత్వం నట్టేట ముంచింది: కవిత

హైదరాబాద్: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల దాడిని కల్వకుంట్ల కవిత మరింత ఉద్ధృతం చేశారు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలను ప్రస్తుత ప్రభుత్వం నట్టేట ముంచిందని ఆమె ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన కవిత, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. ఆరు నెలల్లోగా పీఆర్సీ అమలు చేస్తామన్న మాట ఏమైందని ప్రశ్నించిన ఆమె, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న వాగ్దానాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రాథమిక అవసరాలైన హెల్త్ స్కీం, వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ వంటి అంశాల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతోందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రిటైర్మెంట్ బకాయిల కోసం వృద్ధాప్యంలో ఉద్యోగులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఐదు వాయిదాల కరవు భత్యం ఊసే లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని ఆమె ధ్వజమెత్తారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నేడు రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు చేపట్టే నిరసన ప్రదర్శనలకు తెలంగాణ జాగృతి తరపున తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆమె ప్రకటించారు. న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు తాము అండగా ఉంటామని స్పష్టం చేస్తూ, ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## హన్మకొండ జిల్లా అక్రిడేషన్ కమిటీ ఏర్పాటు

తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి,ఏప్రిల్(లోకల్ గైడ్ న్యూస్):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి సంబం ధించిన మీడియా అక్రిడేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు హన్మకొండ జిల్లా అక్రిడేషన్ కమిటీని ప్రకటించిందని అన్నారు. జిల్లాలో జర్నలిస్టుల అక్రిడేషన్ వ్యవస్థను పార దర్శకంగా, క్రమబద్ధంగా అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్గా వ్యవహరిస్తారు. జిల్లా పబ్లిక్ రిలేషన్స్ అధికారి (డి.పి.ఆర్.ఓ) కన్వీనర్గా కొనసాగుతారని తెలిపారు. అలాగే పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా రం గాలకు చెందిన అనుభవజ్ఞులైన పలువురు జర్నలిస్టులను కమిటీ సభ్యులుగా నియమించారు. కమిటీ సభ్యులుగా గడ్డం కేశవమూర్తి (వరంగల్ వాయిస్), వి.ఆర్. లెనిన్ (టీవీ ఫైవ్),వల్లాల జగన్ (స్కైలైన్), కే. సంతోష్ (సాక్షి),ఎం.ఏ. నయీమ్ (సియాసత్), ఎన్. బుచ్చిరెడ్డి (ప్రజాతంత్ర), జి.మధు (న్యూస్ బూమ్), ఎం.సుధాకర్ (మహా న్యూస్), గోకారపు శ్యామ్ (ది ఆన్స్ ఇండియా), బొల్ల అమర్ (పి.టి.ఐ)లను నియమించారు. అక్రిడేషన్ కమిటీలో సభ్యులుగా ఆర్టీసీ రీజినల్ మేనేజర్, సౌత్ సెంట్రల్ రైల్వే ప్రతినిధి కూడా ఉంటారు. ఈ కమిటీ జర్నలిస్టుల అక్రిడేషన్ దర ఖాస్తులను పరిశీలించి, అర్హత ప్రమాణాల ప్రకారం నిర్ణయాలు తీసుకోనుంది. జిల్లాలో మీడియా ప్రతినిధుల గుర్తింపు ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించడంలో ఈ కమిటీ కీలక పాత్ర పోషించనుంది. కమిటీ ఏర్పాటు పట్ల జిల్లా జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల భాగస్వమ్యంతో బస్తీ ధవాఖానాలు అభివృద్ధి చెందుతాయి -బిజెపి నాయకులు గుడిసె యాదయ్య.



రాజేంద్రనగర్, ( లోకల్ గైడ్ ): ప్రజల భాగస్వామ్యంతో బస్తీ దవఖానాలు అభివృద్ధి చెందుతాయని బిజెపి నాయకులు గుడిసె యాదయ్య అన్నారు. శుక్రవారం రాజేంద్ర నగర్ లోని బస్తీ దావఖానా ను అయన సందర్శించారు. దావాఖనలో నిరుపయోగంలో ఉన్న ఫ్యాన్లను చూసి వేసవి ఫ్యాన్ లేకుండా ఎలా విధులు నిర్వహిస్తున్నారని అడిగారు. తనవంతుగా ఒక ఫ్యాన్ ని బస్తీ దౌఖానాకు ప్రధానం చేశారు. ఈ సందర్బంగా గుడిసె యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వ బస్తీ దౌఖానాలో ప్రజలు భాగ్యస్యములై , సమస్యలు పరిష్కరించుకుంటే, అన్ని విధాల సహకారం ఉంటుందని బరోసా ఇచ్చారు. అందుకోసం ప్రతి ఒక్కరు సహకారాలు అందించాలి నా ,వంతుగా ఈ చిన్న సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ద నేషనల్ అంబేద్కర్ సేన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పంబల రాజు, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు గొడుగు సంజీవ, మాణిక్యమ్మ కాలనీవాసులు వేణు, బచ్చల రాజు ,తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్లు ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయాలి.

కొనుగోలు కేంద్రాలకు పెద్ద మొత్తంలో వస్తున్న ధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని యుద్ధ ప్రాతిపదికన ధాన్యం దించుకోవాలి.

రబీ ధాన్యం సేకరణలో మిల్లర్లు రైతుల పక్షాన నిలబడి పూర్తి సహకారం అందించాలి.

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. ఏప్రిల్ 17. (లోకల్ గైడ్).రబీ ధాన్యం అన్ లోడ్ ను రైస్ మిల్లర్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం అయన తన ఛాంబర్ లో జిల్లాలోని రైస్ మిల్లర్లు, ధాన్యం సేకరణ కు సంబంధించిన సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలకు రబీ ధాన్యం పెద్ద ఎత్తున వస్తున్నందున రైస్ మిల్లర్లు జాప్యం చేయకుండా మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెనువెంటనే అన్లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. వివిధ కారణాలతో మిల్లుల వద్ద లారీలు అన్లోడ్ కాకుండా నిలిచిపోకూడదన్నారు. రబీ ధాన్యం సేకరణలో మిల్లర్లు రైతుల పక్షాన నిలబడి వారికున్న పూర్తి సామర్థ్యంతో వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లు అన్లోడ్ చేసుకోవాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలలో సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని, మరో 15 రోజుల్లో మరో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున మిల్లర్లు పూర్తి సామర్థ్యంతో పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. తాలు, లారీలు తదితర కారణాలతో ఎలాంటి కొర్రీలు విధించకుండా ధాన్యాన్ని దించుకోవాలని, ఈ విషయంలో రైతులకు పూర్తి సహకారం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి నోటిఫైడ్ లారీలను ఏర్పాటు చేయమని పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ను ఆదేశించారు. ఈ విషయంలో మిల్లర్లతో పాటు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సహకరించాలన్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు పంపించేందుకు పూర్తిస్థాయిలో లారీలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిల్లర్ల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, బ్యాంకు గ్యారెంటీ, మిల్లర్ అగ్రిమెంటు సమర్పించని మిల్లర్లు తక్షణమే ఇవ్వాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో ఎట్టి పరిస్థితులలో రైతులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించవద్దని ఆయన తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు, వర్ష సూచనలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలకు వచ్చిన దాన్యం తడవకుండా, పాడవకుండా ముందుగానే కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ధాన్యం లోడింగ్ లో ఒకే వెరైటీని మాత్రమే లోడ్ చేసి పంపించాలని, "ఏ" గ్రేడ్ ధాన్యంతో కామన్ వెరైటీలు కలిపి పంపించకూడదని చెప్పారు. ఇప్పటివరకు ఆయా మిల్లుల వారిగా దిగుమతి చేసుకున్న ధాన్యం వివరాలపై నివేదిక ఇవ్వాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని కలెక్టర్ ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన వారం రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ధాన్యం అన్లోడింగ్ వేగవంతం చేయాలని చెప్పారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, రబీ ధాన్యం సేకరణ పై మిల్లర్లకు పలు సూచనలు చేశారు. పౌరసరఫరాల జిల్లా అధికారులు వెంకటేశం, రామ్ పతి నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డి సి ఓ పత్యా నాయక్ ,జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధి నమూనాకు అంతర్జాతీయ గుర్తింపు.

ఎల్ వి రమణ ముదిరాజ్.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .ఏప్రిల్ 17. (లోకల్ గైడ్). ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం మత్స్య, సహకార రంగాల్లో సాధిస్తున్న ప్రగతి నేడు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని బిజెపి రాష్ట్ర నాయకులు ఎల్ వి రమణ ముదిరాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఇటీవల ఫిలిప్పీన్స్లో జరిగిన అంతర్జాతీయ సమావేశంలో భారత ప్రతినిధులు మన దేశపు మత్స్యకార సహకార నమూనాలను వివరించడం గర్వకారణమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన వెల్లడించిన ముఖ్య అంశాలు,గ్లోబల్ మోడల్: మన దేశంలోని మత్స్యకార సొసైటీలు, ఎఫ్ పి ఓ ల పనితీరును చూసి ఫిలిప్పీన్స్ వంటి దేశాలు భారత నమూనాను అనుసరించడానికి ఆసక్తి చూపుతున్నాయి.సంక్షేమ పథకాలు: కేంద్రం అందిస్తున్న బీమా, వడ్డీ రాయితీ, మౌలిక సదుపాయాల కల్పన వల్ల మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి.నీలి విప్లవం: 'బ్లూ ఎకానమీ' ద్వారా మత్స్యకారులను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం కృషి చేస్తోంది.అంతర్జాతీయ స్థాయిలో భారత అభివృద్ధి నమూనాకు గుర్తింపు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రతి మత్స్యకారునికి చేరేలా తాము నిరంతరం కృషి చేస్తామని ఎల్ వి రమణ ముదిరాజ్ పునరుద్ఘాటించారు.

## తిప్పర్తి మండలం లో దాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ప్రతిపక్ష పార్టీల నేతలు.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. ఏప్రిల్ 17.(లోకల్ గైడ్). తిప్పర్తి మండల కేంద్రంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతిపక్ష పార్టీలకు చెందిన సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి , టిఆర్ఎస్ పార్టీ నాయకులు తండు సైదులు గౌడ్,పల్రెరెడ్డి రవీందర్ రెడ్డి, కందుల లక్ష్మయ్య గారు సందర్శించి రైతులకు సంఘీభావంగా మాట్లాడినారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు మార్కెట్కు ధాన్యం తీసుకొచ్చి నెల రోజులు అవుతున్న అధికారులు సమన్వయ లోపం కారణంగా ఇక్కడ సరైన విధంగా కాంటాలు కావడం లేదు అయినా కూడా మిల్లర్లు రకరకాల కొర్రీలతోటి ధాన్యం దిగుమతి చేసుకోవడం లేదని అన్నారు ఈరోజు నల్లగొండ నియోజకవర్గంలో ఉన్నటువంటి మిల్లులను మొత్తం బ్లాక్ లిస్టులో పెట్టి ఇతర ప్రాంతాల్లో ఉన్నటువంటి మిల్లులకు ధాన్యాన్ని తరలించడంలో ఈ ప్రాంత రైతాంగానికి తీవ్రమైనటువంటి నష్టం జరుగుతుంది అని అన్నారు ఇప్పటికైనా తిప్పర్తి మండల పరిధిలో ఉన్నటువంటి మిల్లులకు ట్యాగింగ్ ఇచ్చి ఈ ప్రాంతంలో ఉన్నటువంటి ధాన్యాన్ని ఇక్కడే దిగుమతి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. తాలు ఎక్కువగా ఉన్నది అనేటువంటి సాగు తోటి రైతులను మిల్లర్లు ఇబ్బంది పెడుతున్న స్థానిక శాసనసభ్యులు మంత్రి అధికార పార్టీ నాయకులు కనీసం మిల్లర్లతోని మాట్లాడే విధంగా ఎక్కడ కూడా చొరవ చూపడం లేదు కనీసం రైతుల బాధలు పట్టించుకున్న పరిస్థితి కనబడడం లేదు. మిల్లర్లకు సివిల్ సప్లై అధికారులకు మధ్యన జరిగిన ఒప్పందాలను బయటపెట్టాలి ఆ ఒప్పందం ప్రకారం 64% బియ్యం వస్తే ఒక కిలో కూడా కటింగ్ చేయకుండా బేషరతుగా ధాన్యం దిగుమతి చేసుకోవాలని ఉన్నప్పటికీ మిల్లర్లు ఆ రకంగా ధాన్యాన్ని దిగుమతి చేసుకోకపోను రైతులకు సుమారు నాలుగు ఐదు కిలోలు ఒక కింటాకు కట్ చేస్తున్నారు ఇది పద్ధతి కాదు అని అన్నారు. మిల్లర్లు అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై రైతుల దగ్గర కట్ చేసినటువంటి దాంట్లో చరిసగం వాటాలు పంచుకునే విధంగా ఒప్పందాలు చేసుకున్నారు రైతులను మోసం చేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతున్నాం. వ్యవసాయ శాఖ అధికారులు మ్యాచర్ చూసే సమయంలో మీరు తాలు పట్టుకుంటేనే మీకు మ్యాచ్ చూస్తామని రైతులను ఇబ్బంది పెడుతున్నారు. ధాన్యం కొనుగోలు సమయములో రైతులను ఇబ్బంది పెట్టే వ్యవసాయ శాఖ అధికారులు అదే డీలర్ల నుండి రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులకు నాణ్యమైనటువంటి వరి విత్తనాలు అందించే విషయంలో చొరవ తీసుకుంటే ఈరోజు ఇలాంటి నాసిరకమైనటువంటి పంట వచ్చి రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఉండేది కాదు ఆరోజు అధికారులు ఫెర్టిలైజర్ షాపు యజమాన్యంతో చేసుకున్న ఒప్పందాలు వారి యొక్క లావాదేవీలే ఈరోజు రైతులకు జరుగుతున్న నష్టం తప్ప ఇంకొకటి కాదు. ఈ ప్రాంతంలో ఉన్నటువంటి నాయకులు కొంతమంది రైతులకు మద్దతుగా మాట్లాడే బదులు మిల్లర్లకు వత్తాసు పలుకుతూ మాట్లాడడం అనేది రైతాంగాన్ని చులకన చూడడం తప్ప ఇంకొకటి కాదు అని అన్నారు ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు మార్కెట్ కేంద్రాలను సందర్శించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం దిగుమతి చేసుకునే విధంగా మిల్లర్లతో, అధికారులతోటి మాట్లాడి ఈ ప్రాంత రైతాంగానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాము. రేపు ఉదయం వరకు ధాన్యం కొనుగోలు చేయకపోతే రేపు అద్దంకి నార్కట్పల్లి హైవే దిగ్బంధన కార్యక్రమాన్ని రైతాంగంతో కలిసి అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తామని ఈ సందర్భంగా వారు అధికారులకు హెచ్చరిక జారీ చేసినారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మన్నెం బిక్షం దొంగరి వెంకన్న ఆకిటి లింగయ్య బీఆర్ఎస్ పార్టీ నాయకులు వల్లపు రెడ్డి యాదగిరి రెడ్డి వల్లపురెడ్డి వెంకటరెడ్డి పాల్వాయి సంజీవరెడ్డి గుర్రం శ్రీనివాస్ రెడ్డి కాసాని సత్తయ్య పోలగోని సత్తయ్య గుండు వెంకన్న గుండు రవి శరత్ బాబు కాటపల్లి జానాయ్ గౌడ్ జూలకంటి నర్సిరెడ్డి జూ లకంటి రంగారెడ్డి ఆలకుంట్ల రమేష్ దుప్పలపల్లి సైదులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## గ్యార శ్రీనివాస్ కు దళిత రత్న అవార్డు ప్రదానం



కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 17 లోకల్ గైడ్ (ప్రతినిధి)డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మినిస్టర్ డాక్టర్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఉత్సవాల కమిటీ చైర్మన్ కో చైర్మన్ ల సమక్షంలో రవీంద్ర భారతిలో ఏర్పాటుచేసిన దళిత రత్న అవార్డు ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో వివిధ రంగాలలో సేవలందించిన ప్రముఖులకు దళిత రత్న అవార్డును ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్యార శ్రీనివాస్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు సమాజ సేవకుడు గత 30 సంవత్సరాలుగా ఆయన సమాజానికి దళిత సమాజానికి చేసినటువంటి సేవలను గుర్తించి ఆయనకు దళిత రత్న అవార్డుతో ఘన సన్మానం చేయడం జరిగింది గ్యార శ్రీనివాస్ కు అవార్డుకుఎంపిక చేసినటువంటి కమిటీ సభ్యులు మరి ముఖ్యంగా బాబాయ్ అయినటువంటి సంగీతపు రాజలింగం కృషి చేశారు. ఈ సందర్భంగా గ్యార శ్రీనివాస్ మాట్లాడుతూ దళిత రత్న అవార్డు తనకు రావడానికి కృషి చేసిన అందరికీ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు బంధువులు స్నేహితులు దళిత బాంధవులు గ్యార శ్రీనివాస్ కు శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంగీతపు రాజలింగం ఉత్సవ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించండి -ఉద్యోగ జే ఏ సీ నాయకుల వినతి



కొందుర్గు ఏప్రిల్ 17, ( లోకల్ గైడ్ ): తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపుతో పాటు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల జే ఏ సీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఉద్యోగ జే ఏ సీ నాయకులు శుక్రవారం కొందుర్గు మండలం తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రధానంగా ఉద్యోగుల పెండింగ్ డిఎ, ఇతర బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా జూన్ రెండు లోపు కొత్త పిఆర్సి అమలు చేయడంతో పాటు ఎంప్లాయి హెల్త్ స్కీం మే 1 నుంచి అమలు చేయాలని కోరారు. పెండింగ్ బిల్లుల కోసం ఎన్నాళ్ళు ఎదురు చూడాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమం లో కొందర్గు మండల పిఆర్టియు అధ్యక్షులు నాజర్ అలీ, ప్రధాన కార్యదర్శి వంశీధర్ రెడ్డి ,రాష్ట్ర నాయకులు బాలరాజ్, వెంకట్రావు, మహిళా నాయకురాళ్లు అఖిల, సురేఖ, అనురాధ యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## మాదారం లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

-మాదారం రైతన్నల కళ నెరవేర్చిన సర్పంచ్

-ఎమ్మెల్యే , సర్పంచ్ కు మండల ప్రజలు కృతజ్ఞతలు



ఖమ్మం జిల్లా, కారేపల్లి : లోకల్ గైడ్, ఏప్రిల్ 17 : సింగరేణి(కారేపల్లి) మండల పరిధిలోని మాదారం గ్రామంలో కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. మొదటిసారిగా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను నెలకొల్పడం అందరూ హర్షించదగ్గ విషయమన్నారు. రైతులు పండించిన పంటకు సరైన ధరలు అందించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మధ్యవర్తుల బాధలు లేకుండా రైతులకు నేరుగా లాభం చేకూరే విధంగా ఈ కేంద్రం పని చేస్తుందని తెలిపారు. మొక్కజొన్న క్వింటాలుకు మద్దతు ధర రూ.2,400 ప్రభుత్వం ప్రకటించిందని వెల్లడించారు.ఈ కొనుగోలు కేంద్రం ద్వారా మాదారంతో పాటు పరిసర ప్రాంతాల రైతులు ఇక్కడ మొక్కజొన్నలు అమ్ముకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు , ఎంపీడీఓ శ్రీనివాసరావు , వ్యవసాయ శాఖ అధికారి బట్టు అశోక్ కుమార్ , సీఐ నూనావత్ సాగర్, ఎస్ఐ బైరు గోపి , విద్యుత్ ఏఈ వెంకన్న , కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల మంజుల , ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు , సొసైటీ మాజీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు , మాదారం , కొత్తతండా సర్పంచ్ అజ్మీరా ఉమానరేష్ , ధారావత్ మంగీలాల్ తో పాటు వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు , మండల , స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రతిభా ప్రదర్శన వేదికగా 'సాధన-2026'



పఠాన్ చేరు, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): లలిత, ప్రదర్శన కళల విభాగం విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించే 'సాధన-2026'ను శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం డ్యాన్స్ స్టూడియోలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. హైదరాబాదు లోని స్కూల్ ఆఫ్ హ్యూమాని టీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని లలిత, ప్రదర్శన కళల విభాగం అధ్యాపకులు కర్ణాటక సంగీతం, భరతనాట్యం, కూచిపూడి, థియేటర్, లలిత కళలలోని మైనర్, ఓపెన్ ఎలెక్టివ్ కోర్సులలో చేరిన విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. సెమిస్టర్ చివరి ప్రాక్టికల్ పరీక్షలలో భాగంగా, విద్యార్థులు తమ అభ్యాసాన్ని, కళాత్మక ఎదుగుదలను ప్రతిబింబించేలా ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, కూచిపూడి, భరతనాట్యం, థియేటర్ ఆర్ట్స్ విభాగాల నుంచి పాల్గొన్నవారు తమ అకడమిక్ మూల్యాంకనం లో భాగంగా అద్భుతమైన వేదిక ప్రదర్శనలు ఇచ్చారు. కూచిపూడి విభాగానికి డాక్టర్ వై.లలిత సింధూరి, వైష్ణవి ప్రతివాది మార్గదర్శకత్వం వహించగా, భరతనాట్యం ప్రదర్శనలకు అంజు అరవింద్ మార్గదర్శకత్వం వహించారు. నాటక కళల ప్రదర్శనలకు డాక్టర్ శ్యామ్ ప్రకాష్ నాయకత్వం వహించగా, కర్ణాటక సంగీత విద్యార్థులకు మృదురవళి దర్భ మార్గదర్శకత్వంలో శిక్షణ ఇచ్చారు. మృదంగంపై చంద్రకాంత్, వయోలిన్ పై వాసు అందించిన ప్రత్యక్ష సంగీత సహకారంతో ఈ ప్రదర్శనలు మరింత సుసంపన్న మయ్యాయి. ఈ కార్యక్రమానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ప్రతి ప్రదర్శన దాని కళాత్మక నైపుణ్యానికి, భావ గాఢతకు విస్తృత ప్రశంసలను అందుకుంది.

## తెలంగాణపై అనుచిత వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుంచి

:ఖమ్మం' : తొలగించండి- లోక్‌సభ స్పీకర్‌కు ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి, తదితర ఎంపీల బృందం ఫిర్యాదు



న్యూ ఢిల్లీ:'లోకల్ గైడ్':తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై భారతీయ జనతా పార్టీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ విభజన ప్రక్రియ భారత్–పాకిస్థాన్ విభజన కంటే దారుణంగా జరిగిందని ఆయన పోల్చడం పట్ల నిరసనగా.. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, కాంగ్రెస్ తెలంగాణ ఎంపీల బృందం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను శుక్రవారం కలిసింది. పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించాల్సిందే..తేజస్వి సూర్య చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను పార్లమెంటు రికార్డుల నుంచి వెంటనేతొలగించాలని,తెలంగాణ గౌరవానికి భంగం కలిగించినందుకు గాను కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీలు కోరారు. ఈ ఎంపీల బృందంలో మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కడియం కావ్య, సురేష్ షెట్కర్, మరియు గడ్డం వంశీ ఉన్నారు.

## కొందుర్గులో సంబురంగా ముగిసిన పీఎం సంసద్ ఖేల్ మహోత్సవ్



లోకల్ గైడ్ న్యూస్ కొందుర్గు 17:క్రీడాకారులకు బహుమతుల ప్రధానం చేసిన పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి క్రీడాకారులలో స్ఫూర్తిని నింపిన కందూరి మనోహర్ రెడ్డి కొందుర్గు మండల కేంద్రంలో చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, ఎదిర రాజు ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా అట్టహాసంగా కొనసాగిన ప్రధానమంత్రి పాలమూరు పార్లమెంట్ మండల స్థాయి క్రీడా ఉత్సవాలు నిన్న ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కొందుర్గు మండల స్థాయి క్రికెట్లో విన్నర్స్ కొందుర్గు, రన్నర్స్ శ్రీరంగాపూర్. చౌదరిగూడ మండల స్థాయిలో విన్నర్స్ రావిర్యాల, రన్నర్స్ కాస్లాబాద్ తండ క్రీడాకారులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని, క్రీడలు ఆనందము, ఆరోగ్యముతోపాటు శారీరక దృఢత్వం, మానసిక బలాన్ని చేకూరుస్తాయని, ప్రధానమంత్రి గారు దృఢమైన యువతను దేశానికి అందించాలనే సంకల్పంతో క్రీడలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. పాలమూరు ఎంపీ డీకే అరుణ ప్రోత్సాహంతో నియోజకవర్గస్థాయిలో వందలాది మంది క్రీడాకారులు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, కోకో వంటి క్రీడలలో పాల్గొనడం ఆనందదాయకం అన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కందూరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, పిల్లలు తల్లిదండ్రులు కన్న కలల్ని నిజం చేయడానికి కృషి చేయాలని, ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు విజయభాస్కర్, షాద్నగర్ కోఆర్డినేటర్ వంశీకృష్ణ, సీనియర్ నాయకులు కొమరబండ శ్రీశైలం, ఈసరి సత్యనారాయణ, శ్యాంసుందర్ రెడ్డి, కుడుముల బాలరాజ్, కార్తీక్, చందు, కాటంరాజు గౌడ్, మల్లేష్, గోపాల్, ఎర్ర రవి, రఘునాథ్ రెడ్డి, సందీప్,



క్రీడాకారులు రమేష్, గిరితేజ, వినోద్, విజయ్, శివ, మల్లికార్జున్ రెడ్డి, మోహన్, నరసింహా, మధుకర్ రెడ్డి, అన్వర్ తదితరులు పాల్గొన్నారు..

## మామిడి రైతుల వద్దకే కొనుగోలుదారులు వచ్చే విధంగా అవకాశం కల్పిస్తాం .

--- మామిడి రైతుల, కొనుగోలుదారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ..



వనపర్తి లోకల్ గైడ్ :ఎప్రిల్ 17(అంబటి స్వామి ప్రతినిధి )జిల్లాలోని మామిడి రైతుల వద్దకే కొనుగోలుదారులు వచ్చి, మంచి ధరకు మామిడి పండ్లను కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్లో వనపర్తి జిల్లాలో మామిడి పంటకు సంబంధించి కొనుగోలుదారులు--అమ్మకందారుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమాన్ని క్లస్టర్ డెవలప్ మెం ట్ ప్రోగ్రాం కింద హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో, ఆంధ్ర ప్రదేశ్ ఎగుమతుల అభివృద్ధి సంస్థ, ఎన్ హెచ్ బీ, ప్రసాద్ సీడ్స్ సంస్థల సమన్వయంతో ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ మామిడి రైతులు ఏర్పాటు చేసిన, వివిధ రకాల మామిడి పండ్ల వంగడాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి, వివిధ రకాల మామిడి పండ్ల ప్రత్యేకతను తెలుసుకోవడంతోపాటు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ లో ని ఐదు జిల్లాల నుండి వచ్చిన 140 మంది రైతులు పాల్గొని తమ మామిడి ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మామిడి రైతుల వద్దకే కొనుగోలుదారులు వచ్చి, మంచి ధరకు మామిడి పండ్లను కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోందని, ఈ అవకాశాలను మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అమ్మకందారులు, కొనుగోలు దారుల సమావేశం ద్వారా మామిడి రైతులకు తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి ఇది ఒక చక్కటి అవకాశమన్నారు. రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, నాణ్యమైన ఉత్పత్తుల ప్రోత్సాహం ఈ సమావేశం లక్ష్యమని తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడానికి కలెక్టర్ అభినందించారు. జిల్లాలోని అన్ని మామిడి తోటల రైతులకు కవర్లను అందజేయడం గొప్ప విషయమని, ఇంకా ఎవరికైనా మామిడి కవర్లు ఇవ్వకపోతే వెంటనే అందజేయాలని సూచించారు. ఈ మీటింగ్ ద్వారా ఉమ్మడి మహబూబ్ నగర్ లోని ఐదు జిల్లాల 140 మంది మామిడి రైతులు ఇక్కడికి వచ్చి తమ వద్ద ఉత్పత్తి అయ్యే వివిధ రకాల మామిడిపండ్ల వెరైటీలను కొనుగోలుదారుల ముందు ప్రదర్శించారని అధికారులు తెలిపారు. మొత్తం 12 మంది కొనుగోలుదారులు( ఎక్స్ పా ర్టర్స్ ) ఇందులో పాల్గొన్నట్లు వారు తెలిపారు. 40 మంది రైతులు 250 టన్నుల మామిడిపండ్ల ఎగుమతులకు ఎక్స్ పా ర్టర్లతో ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా, మామిడి పంట అమ్మకందారులు కొనుగోలుదారుల మార్కెటింగ్ సమావేశానికి సంబంధించిన బ్రోచర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఉద్యాన శాఖ జేడి బాబు, డిహెచ్ఎస్ఓ విజయభాస్కర్, ఏపీ ఎగుమతిదారుల అభివృద్ధి సంస్థ ఏపిఎం ఆర్బీ నాయుడు, ప్రసాద్ సీడ్స్ సీఈవో విజయభాస్కర్, శాస్త్రవేత్త వెంకటలక్ష్మి, రవి లక్ష్మి, ఏడీలు పద్మనాభం, జయరాజ్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ,ఉపాధ్యాయుల నిరసన



నారాయణపేట ఏప్రిల్ 17లోకల్ గైడ్ ::ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించక పోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం టి జీ ఈ జే ఏ సి ఆధ్వర్యంలో ఉద్యోగులు ,ఉపాధ్యాయులు భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2వ పి ఆర్ సి, పాత పెన్షన్ విధానం, డి ఏ ల క్లియరెన్స్, పెండింగ్ బకాయిల ఒకే దఫాలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాల్గొన్న ఉపాధ్యాయులు,ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదుర్కొం టున్న సమస్యలపై తహాశీల్దార్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమం లో పి ఆర్ టి యు నాయకులు సభ్యులు, ఉపాధ్యాయులు, ఉద్యోగు లు తదితరులుపాల్గొన్నారు

## ఎవరీ చైల్డ్ రీడ్స్" విలువైన ఇంగ్లీష్ మెటీరియల్ను అందించిన డా.పారా ఉష



ఖమ్మం:లోకల్ గైడ్ :ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కార్యక్రమం" ఎవరీ చైల్డ్ రీడ్స్" కు సంబంధించిన పదివేల రూపాయల విలువైన ఇంగ్లీష్ మెటీరియల్ను డాక్టర్ పారా ఉష పాఠశాలకు అందించారు.ఖమ్మం నగరంలోని జిపిఎస్ బికే బజార్ పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మంఅర్బన్ ఎంఈఓ శైలజ లక్ష్మి , శ్రీహవిష హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ పారా ఉష , వారి తండ్రి ప్రముఖ గ్రానైట్ యజమాని పారా నాగేశ్వరరావు హాజరైనారు. ఈ సందర్భంగా వారికి చిరు సత్కారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంబటి రవికుమార్, నాగప్రసన్న , అంగన్వాడీ టీచర్ నాగమణి , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### వివో ఏ ల డిమాండ్ ల సాధనకు కలిసి నడుద్దాం

### ఐకెపి వివో ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షు రాలు మాధవి



నారాయణపేట ఏప్రిల్ 17:లోకల్ గైడ్ : వి ఓ ఏ ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అందరం ఏకతాటిపైకి వచ్చి కలిసి నడుద్దామని వి ఓ ఏ ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాధవి పిలుపు నిచ్చారు.శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో వివోఏ ల ఉద్యోగుల సంఘం జిల్లా కమిటి తో రాష్ట్ర కమిటీ ముఖాముఖి సమావేశం జిల్లా అధ్యక్షులు కృష్ణ అధ్యకతన ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో ముఖ్య అతిథులు గా రాష్ట్ర అధ్యక్షురాలు మారిపెల్లి మాధవి పాల్గొని వారు మాట్లాడుతూ వివో ఏ ల రాష్ట్ర కమిటీ గత ప్రభుత్వం లో సాధించిన విషయాలు వివో ఏ లతో చర్చించడం జరిగింది. వివో ఏ లతో ముఖాముఖి వారి సమ స్యలు , అడిగి తెలుసుకు న్నారూ. నారాయణపేట లో అన్ని మండలాల కమిటీలు ఏర్పాటు చేయాలి అన్నారు.జిల్లా కమిటీని పటిష్టం చేయాలి అన్నారు.ఇప్పుడు ఎస్ ఆర్ ఈ పి సీఈవో పరిధిలో పరిష్కరించిన అంశాలు ప్రభుత్వం నుండి ఇంకా సాధించాల్సిన అంశా లు చెబుతూ నూతనో తేజం నింపారు.వేతనాలు ప్రభు త్వం పెంచకుండా జాప్యం జరిగినచో రాష్ట్ర కమిటీ ఏ కార్యక్రమం చేసినా ఎలాంటి ఉద్యమం చేయడానికి అయినా సిద్ధంగా ఉండాలి అన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తిరుపతి, రాష్ట్ర కోశాధికారి నరసిం హ , వర్కింగ్ ప్రెసిడెంట్ మొయినొద్దీన్ , జిల్లా కార్యదర్శి గోపాల్, గౌరవ అధ్యక్షులు నర్సిములు, కోశాధికారి నరేష్, 5 మండ లాల అధ్యక్షులు, కార్యద ర్శులు నాయకులు దాదాపు 150 మంది వివో ఏ లు పాల్గొన్నారు.

## రిటైర్డ్ టీచర్ సువర్ణ కు ఘన సన్మానం



ఖమ్మం జిల్లా, కారేపల్లి : లోకల్ గైడ్,ఏప్రిల్ 17 : కారేపల్లి మండల పరిధిలోని బీక్యాతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేసి పదవీ విరమణ పొందిన కర్నాటి సువర్ణను పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. రైల్వే గేట్ వద్దకు చేరుకున్న ఉపాధ్యాయురాలు సువర్ణ- మాధవరావు దంపతులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల వరకు విద్యార్థులు పూలు చల్లుతూ ర్యాలీగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలం పాటు సింగరేణి మండలంలో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న సువర్ణ- మాధవరావు దంపతులు ఎంతోమంది పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, గ్రామ పెద్దలు అజ్మీర బిచ్చ నాయక్, అజ్మీర వీరన్న, ఉపాధ్యాయ సంఘ నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హనుమాన్ నగర్ లో పోషన్ పక్వాడ కార్యక్రమం.



చిన్నారులకు దుస్తుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. రాజేంద్ర నగర్, లోకల్ గైడ్ : రాజేంద్ర నగర్ హనుమాన్ నగర్ అంగన్వాడీ స్కూల్ ల్లో ఐ సి డి ఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం హనుమాన్ నగర్ లోని ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని సూపర్ వైజర్లతో పాటు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే చేతుల మీదుగా అంగన్వాడీ లో చదివే చిన్నారులకు దుస్తులను (యూనిఫామ్ )ను టీచర్ల కు అందజేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ప్రాజెక్టు అధికారిణి కవిత సూపర్ వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు

## పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మం..




ఖమ్మం' లోకల్ గైడ్ :గోల్డెన్ అవర్"లో వైద్య సహాయం అందించి ప్రాణాలు కాపాడుదాం : అడిషనల్ డీసీపీ అడ్మిన్రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి "గోల్డెన్ అవర్"లో సరైన వైద్య సహాయం అందిస్తే బాధితుడి ప్రాణాన్ని కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామానుజం అన్నారు. 'అరైవ్ అలైవ్' ప్రచార కార్యక్రమంలో భాగంగా "గోల్డెన్ అవర్ రెస్పాన్స్" శిక్షణా కార్యక్రమాన్ని వైరా మండలం, తాటిపుడి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికిముఖ్యఅతిగా హాజరైన అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం వంటి అత్యవసర సమయాల్లో



బాధితుడికి దగ్గరగా ఉన్నవారు వెంటనే స్పందించి వైద్య సహాయం అందిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చని అన్నారు. అలా ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు నిలిపిన వారిని "రాహ్ వీర్లు'గా గుర్తించి 25 వేల రూపాయ నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తోందన్నారు.అదేవిదంగా ప్రమాదాలు జరిగిన చోటుకురక్షించేందుకు వెళ్లే రహావీర్లకు కేసులు ఎదుర్కోవాల్సిన భయం లేదని స్పష్టం చేశారు. రహావీర్లకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందన్నారు. పోలీసు, ఇతర శాఖలు నుంచి ఎలాంటి కేసులు ఉండవన్నారు.ప్రమాద సమయాల్లో ఆకస్మికంగా వచ్చే గుండెపోటు వచ్చినప్పుడు, గుండె కొట్టుకోవడం ఆగిపోతే, సకాలంలో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చుని, ఇది ఛాతీపై ఒత్తిడి కలిగించడం ద్వారా రక్త ప్రసరణను కృత్రిమంగా పునరుద్ధరించే అత్యవసర ప్రక్రియని, సకాలంలో సీపీఆర్ చేస్తే ప్రాణాలు నిలిచే అవకాశాలు పెరుగుతాయన్నారు.ఈ సందర్భంగా సీపీఆర్ ప్రథమ చికిత్స, అత్యవసర కాల్స్, పీఎం రహత్, నగదు ప్రోత్సాహం, సామాజిక బాధ్యత, గోల్డెన్ అవర్ రెస్పాన్స్ సమయం గురించి శిక్షణ, అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటప్రసాద్, ఎస్సై రామారావు, పీహెచ్సీ డాక్టర్ పాల్గొన్నారు.

## బీజేపీ ఎంపీ తేజస్వి తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి




లోకల్ గైడ్' ఖమ్మం:పార్లమెంట్ వద్ద ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి నిరసనరాష్ట్ర విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి చేసిన వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరంప్లకార్డులు చేతబట్టి కాంగ్రెస్ ఎంపీలతో కలిసి నినాదాలు చేసిన రామసహాయంన్యూఢిల్లీ:పార్లమెంట్ లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య రాష్ట్ర విభజనపై ద్వేషపూరితంగా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం పార్లమెంట్ వద్ద తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడటాన్ని భారత్- పాకిస్తాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ బలిదానాలకు కాంగ్రెస్సే కారణమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా వెనక్కు తీసుకోవాలని, ఇది తెలంగాణ అమరవీరుల త్యాగాలను అవమానపరచడమే అని అన్నారు. బిజెపి ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ పట్ల ద్వేషాన్ని వెళ్ళగక్కారని, పార్లమెంటు రికార్డుల్లో ఈ వ్యాఖ్యలను శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేస్తూ.. " బిజెపి క్షమాపణలు చెప్పాలి", " తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించాలి" అంటూ..నినాదాలతో హోరెత్తించారు.

## (బిఆర్ఎస్) పార్టీ నేతలు, ముస్లిం మైనార్టీ పెద్దలు, ప్రజా ప్రతినిధులు..కరపత్రాలు ఆవిష్కరణ..



ఖమ్మం: లోకల్ గైడ్ఈనెల 19 న ఆదివారం రోజున సాయంత్రం 5 గంటలకు మమత హాస్పిటల్ గ్రౌండ్ లో జరిగే ఖమ్మం జిల్లా పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేసేందుకు మాజీ మంత్రి వర్యులు గౌరవనీయులు శ్రీ పువ్వాడ అజయ్ కుమార్ గారు ముస్లిం సమాజానికి. చేసిన అభివృద్ధి, సంక్షేమం పట్ల కరపత్రాలను ముస్లిం మైనారిటీ పార్టీ సీనియర్ నేతలు, పెద్దలు ప్రజా ప్రతినిధులు ఆవిష్కరించారు.కరపత్రాల పంపిణీ లో భాగంగా ఖమ్మం జిల్లా దీ=ూపార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం సమావేశం విజయవంతం కోసం, ముస్లిం మైనార్టీల అభివృద్ధికై మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్ ఖాన్ గారు చేసిన ప్రగతి, సంక్షేమశీ కు చెందిన కరపత్రాలను గడప గడపకు దీ=ూ పార్టీ పేరుతో కరపత్రాల పంపిణీ కార్యక్రమంకలదు.. ఈ నేపథ్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు..ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు గారు మాజీ గ్రంథాలయం చైర్మన్ ఖమ్మర్ గారు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూల్ గారు, జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ తాజుద్దీన్ గారు,దీ=ుఖ జిల్లా నాయకులు ఎండి పాషా గారు ప్రచార కార్యదర్శి సకిన,నగర మైనార్టీ అధ్యక్షుడు శంషొద్దీన్, ఉద్యమకారులు ఆసిఫ్, బురాన్ ,దీ=ూ మైనార్టీ నాయకులు, హకీమ్ భాయ్ మహబూబ్ భాయ్ షేక్ ఉస్మాన్, ఫిరోజ్, ఇజహర్, షారుక్, మొహసిన్,సాజిద్, చోటు, చంటి,మున్నా,,షరీఫ్, ఫయాజ్,జాకీర్,నన్నే పఠాన్, జవీద్, ఫక్రు, ముబిన్ మైనార్టీ నాయకులు చాలామంది పాల్గొన్నారు..

## జూన్ 2 లోపు పి ఆర్ సి ని ప్రకటించాలి

## రంగారెడ్డి జిల్లా జేఏసీ కన్వీనర్ డాక్టర్ కే. రామారావు



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలపై రంగారెడ్డి జిల్లా ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ సమరశంఖం పూరించింది. జిల్లాలోని అన్ని మండల, డివిజన్, జిల్లా కేంద్రాలలో శుక్రవారంనాడు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ , కార్మిక పెన్షనర్లు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. 2వ పి.ఆర్.సి కమిటీ వేసి 30 నెలలు గడుస్తున్నా నివేదిక రాకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తూ, వెంటనే నివేదికను తెప్పించి 51% ఫిట్మెంట్తో




జూన్ 2వ తేదీలోపు 2వ పి.ఆర్.సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న సుమారు రూ. 13,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కొత్త ఈ ఎచ్ ఎస్ విధానాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం నగదు రహిత చికిత్సను తక్షణమే అందుబాటులోకి తేవాలన్నారు. ప్రస్తుతం ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ సి పి ఎస్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ఓ పి ఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా 01/09/2004 కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా నియామకమైన వారికి వెంటనే పాత పెన్షన్ వర్తింపజేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15.25 లక్షల ఉద్యోగుల, పెన్షనర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ 4 ప్రధాన డిమాండ్లతో పాటు ఇతర 64 పెండింగ్ అంశాలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా ఉద్యోగుల జే ఏ సి విజ్ఞప్తి చేసింది. లేని పక్షంలో తదుపరి కార్యాచరణ ప్రకటించబడుతుందని తెలియజేశారు. తదనంతరం టి జీ ఏ జే ఏ సి నాయకులు జిల్లా కలెక్టర్ ను కలిసి మెమోరాండం సమర్పించి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డా కే రామారావు,శ్రీనేష్ కుమార్ నోరి, మహేందర్ రెడ్డి,ప్రవీణ్, గోపాల్ నాయక్, పూర్ణచందర్, శాంతి శ్రీ, సైదమ్మ, రాకేష్,యశ్వంత్,అనిత, అలివేలు, రమేష్, వెంకటస్వామి, రంగయ్య, మసూద్ అలీ, నరసింహ, విశ్వనాథం, సుధాకర్, నరసయ్య, గాలయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్, జీవన్, కృష్ణారెడ్డి,, జగన్మోహన్, రాఘవేందర్, శేఖర్ రెడ్డి, పాండు, యాదగిరి, రాములు, రాజు, బాలకృష్ణ, గోవర్ధనాచారి, చంద్రయ్య, లక్ష్మయ్య, డేవిడ్, మునీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## అలైవ్ అలైవ్ రవాణా శాఖ, పోలీస్, ఆర్టీసీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు..,..



నిర్మల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 17 లోకల్ గైడ్:రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపోలో అరైవ్, అలై వ్ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను ఘననీయంగా తగ్గించి ప్రజల ప్రాణ భద్రతను కాపాడాలనే లక్ష్యంతో రవాణా శాఖ , ఆర్టీసీ, పోలీస్ శాఖలు సంయుక్తంగా అరైవ్ అలైవ్ పేరిట ఎప్రిల్ 13 నుండి 18 వరకు రోడ్డు భద్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే .దానిలో భాగంగా ఈ రోజు ఆర్టీసీ నిర్మల్ డిపోలో ఏర్పాటు చేసిన. గోల్డెన్ అవర్ ఎవర్నెస్ అరైవ్ అలైవ్ రోడ్ సెప్టీ అవగాహనా సదస్సులో నిర్మల్ జిల్లా ట్రాన్స్ పోర్ట్ అధికారి దుర్గాప్రసాద్ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని సదస్సుకు హాజరైనా స్కూల్ బస్ డ్రైవర్లకు, ట్యాక్సీ డ్రైవర్లకు వివిధ వాహనాల పైన డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్లకు వివరించారు.ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాముఖ్యత మద్యం సేవించి వాహనాలు నడుపొద్దు అని, మోటారు సైకిల్ పై వెళ్లే వారు ట్రైబుల్ రైడింగ్ చెయ్యకండి,మొబైల్ మాట్లాడుతూ వాహనాన్ని నడుపొద్దని ఆయన డ్రైవర్లకు విస్రుత అవగాహనా కలిపించారు.కార్యక్రమములో ముఖ్య అతితీగా డి. ఎం.అండ్ ఎచ్.ఓ.రాజేందర్, మరియు జిల్లా అదికారులు డి. ఈ. ఓ.భోజన్న, ఈ. ఈ. ఆర్.అండ్.బి.సుభాష్.ఆర్టీసీ డిపోమేనేజర్ కే పండరి, ఎం.వి.ఐ.మహేందర్, డి. ఎం.ఓ.రవీందర్, పోలీస్ టౌన్ సి.ఐ.సమ్మయ్య, ఆర్టో పెడిక్ డాక్టర్ సృజన్ ఏ. ఈ ( ఎం) ఆర్టీసీ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## త్రివేణి విద్యార్థులను అభినందించిన కలెక్టర్



'లోకల్ గైడ్': ఖమ్మం':ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, రోడ్డు భద్రత వారోత్సవాల కి సంబంధించి నిర్వహించిన వ్యాసరచన పోటీలలో త్రివేణి విద్యార్థులు వనీషా రెడ్డి, మెహక్ ముస్కాన్, సాకేత్ రామ్, లాస్య, చంద్ర సిద్ధార్థ్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు, ఈ సందర్భంగా స్థానిక ఆర్టీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, మరియు నగర మేయర్ పునుకొల్లు నీరజ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసి వారిని అభినందించారు.విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి శుభాకాంక్షలు తెలియజేశారు . పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో ఎప్పుడు అత్యుత్తమ ప్రతిభ ని కనబరుస్తారనీ తెలియజేశారు. విజేతలైన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, తదితరులు అభినందించారు.

# కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యను వెంటనే తీర్చాలి.

### నిర్మల్ జిల్లా కేంద్రాల్లో టీజీ ఈజేఏసీ ఆధ్వర్యంలో నల్లబాడ్జీలతో నిరసన..



నిర్మల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 17 లోకల్ గైడ్: కేంద్ర సంఘం చైర్మన్ మారం జగదీశ్వర్ మరియు సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు గార్ల ఆదేశానుసారం ఉద్యోగ గజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ , కార్మికుల మరియు పెన్షనర్ల సమస్యల పరిష్కార కార్యాచరణలో భాగంగా ఈరోజు తల పెట్టిన ఉదయం 10:30 కు నల్ల బ్యాడ్జీలు ధరించి కార్యాలయ విధులకు హాజరై మధ్యాహ్న భోజన విరామ సమయంలో అధిక సంఖ్యలో ఉద్యోగ గెజిటెడ్ అధికారులు ఉపాధ్యాయ కార్మిక మరి పెన్షనర్స్ పాల్గొనడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి ముఖ్య వ్యక్తులుగా జిల్లా ఇన్చారి బాధ్యతలు ఎంసీ లింగన్న గారు జుట్టు గజేందర్ గారు హాజరై ఉద్యోగుల సమస్యలపై మాట్లాడడం జరిగింది జిల్లా ు+జుజీూజ చైర్మన్ వెలుమల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్స్ వెంటనే పరిష్కరించాలని మాట్లాడడం జరిగింది జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్ గారికి తమ న్యాయమైన డిమాండ్ల వినతి పత్రం సమర్పించనైనది

**ముఖ్యమైన డిమాండ్స్**

1) 2 వ పిఆర్సి 51% ఫిట్మెంట్తో జూన్ రెండవ తారీకు లోన అమలు2) ఉద్యోగుల ఈ హెచ్ ఎస్ స్కీం సంబంధించి విధివిధానాలు రూపొందించి మే ఒకటవ తేదీ నుండి నగదు రహిత వైద్య సేవలు అందించాలి3) ఉద్యోగులకు మరియు పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ లో ఉన్న 13వేల కోట్ల రూపాయల బిల్లులను ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించి ఉద్యోగులను పెన్షనర్లకు ఆర్థిక భారం నుంచి తప్పించాలి 4) ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ ను వెంటనే పునరుద్ధరించాలి 1-9-2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ఇచ్చి అపాయింట్మెంట్ చేసిన ఉద్యోగులకు వెంటనే ూాూ పునరుద్ధరించాలి వీటితోపాటు ఉద్యోగులకు పెన్షనర్లకు సంబంధించిన మరో 64 డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని కోరడమైనది ఈ కార్యక్రమంలో టి జి జేఏసీ జిల్లా సెక్రటరీ జనరల్ పి .గంగారెడ్డి ,అడిషనల్ సెక్రెటరీ జనరల్ నరేంద్ర బాబు, కో చైర్మన్ జె. లక్ష్మణ్ నాయకులు డి .రమేష్, కుడాల రవికుమార్, రవికాంత్ ,శంకర్ ,విజయ్ కుమార్, దేవేందర్, కృష్ణారావు, హరి ప్రసాద్ మహేంద్ర చారి ,సత్యపాల్ రెడ్డి , గడ్డం శ్రీనివాస్ , వై అశోక్ కుమార్ జవాదు హుస్సేన్ ,బి .రవి మొదలగు వారు పాల్గొన్నారు



## మియాపూర్‌లో స్విమ్మింగ్ పూల్‌లో మునిగి బాలుడు మృతి
### -పూల్ నిర్వహణ నిర్లక్ష్యంపై పోలీసుల దర్యాప్తు ప్రారంభం



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): మియాపూర్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. 2026 ఏప్రిల్ 11న తేజేశ్వర్ నీరజ్ పెరమ్ (13), కిరణ్ కుమార్ కుమారుడు, వెంకటరమణ కాలనీ, గోకుల్ ఎన్‌క్లేవ్‌లోని ఫెదర్ ఎన్ స్ప్లాష్ స్విమ్మింగ్ పూల్‌లో మునిగి మృతి చెందాడు. ఉదయం సుమారు 09:53 గంటలకు బాలుడు నీటిలో మునిగిపోయిన స్థితిలో అతని స్నేహితుడి తండ్రి గుర్తించారు. వెంటనే స్విమ్మింగ్ కోచ్ అత్యవసర సీపీఆర్ అందించగా, అనంతరం బాలుడిని అనుపమ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి రైన్‌బో హాస్పిటల్‌కు మార్చగా, సాయంత్రం సుమారు 20:00 గంటలకు గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ ఘటనపై బాధిత కుటుంబం పూల్ నిర్వహణలో నిర్లక్ష్యం ఉందని ఫిర్యాదు చేయడంతో, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధ్యులపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## తెలంగాణ ఆవిర్భావాన్ని అవమానించిన తేజస్వి సూర్య
### -వ్యాఖ్యలు ఖండనీయము కేటీఆర్, హరీష్ రావు



శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని ఇండియా- పాకిస్తాన్ విభజనతో పోల్చిన కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు కేటీ రామారావు టి.హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని,అమరవీరుల త్యాగాలను అవమానిస్తూ రాష్ట్ర ఏర్పాటును ఇండియా-పాకిస్తాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని పేర్కొన్నారు. ఇలాంటి అహంకారపూరిత, వ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, తేజస్వి సూర్య బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దశాబ్దాల పోరాటం ఫలితమని, వేలాది మంది విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజల త్యాగాలతో సాధించిన మహోన్నత ఉద్యమమని కేటీఆర్ స్పష్టం చేశారు. అలాంటి చారిత్రాత్మక ఉద్యమాన్ని విద్వేషపూరిత విభజనతో పోల్చడం చరిత్రను అవమానించడమే కాకుండా అమరుల త్యాగాలను తక్కువ చేసి చూపించడమేనని అన్నారు. ఇదే అంశంపై హరీష్ రావు మాట్లాడుతూ..పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానిస్తూ చేసిన ఈ వ్యాఖ్యలు అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. వెంటనే తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానించే విధంగా ఎలాంటి వ్యాఖ్యలైనా సహించబోమని, ప్రజల భావోద్వేగాలను గౌరవించాలని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

## చందానగర్‌లో అనుమానాస్పద మృతి
### -గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం
### -డయల్ 100 కాల్‌తో ఘటన వెలుగులోకి

శేరిలింగంపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం అనుమానాస్పద మృతి ఘటన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం, ఉదయం సుమారు 09:00 గంటలకు ఎస్ హెచ్ ఓ ఆదేశాల మేరకు పట్రోల్-2 మొబైల్‌లో కంప్లైనెంట్‌తో పాటు హెడ్ గార్డ్ కే. రాజు (హెచ్ జి-330) పట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అపర్ణ సైబర్ కేఫే సమీపంలో మృతదేహం గుర్తింపు ఉదయం సుమారు 10:30 గంటలకు డయల్ 100 ద్వారా నల్లగండ్ల, శేరిలింగంపల్లి ప్రాంతంలోని అపర్ణ సైబర్ కేఫే వద్ద సమాధుల సమీపంలో ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అక్కడ ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. వివరాలు ఇలా ఉన్నాయి, మృతుడు సుమారు 45 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వ్యక్తిగా కనిపించాడు. అతను నీలం రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి, నలుపు రంగు షాల్‌తో కప్పబడి ఉన్నాడు. అతనికి నల్లటి జుట్టు ఉంది.పోలీసులు పరిసర ప్రాంతాలలో విచారణ చేపట్టి మృతుడి గుర్తింపుకు ప్రయత్నించినప్పటికీ ఎటువంటి సమాచారం లభించలేదు. ఈ ఘటనపై కంప్లైనెంట్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## బండ్లగూడలో రైల్వే ట్రాక్ విస్తరణతో ఇళ్లు కోల్పోతున్న
### -బాధితులకు సహాయం చేయాలి..ఎమ్మెల్సీ అంజి రెడ్డి



పఠాన్ చేరు, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): పఠాన్ చేరు నియోజకవర్గంలోని బండ్లగూడ గ్రామంలో రైల్వే ట్రాక్ పక్కన నివాసముంటున్న పలువురు కుటుంబాలు తమ సమస్యలను తెలియజేస్తూ ఎమ్మెల్సీ అంజి రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. రామచంద్రపురం నుండి పఠాన్ చేరు వరకు జరుగుతున్న రైల్వే ట్రాక్ విస్తరణ పనుల కారణంగా తమ ఇళ్లను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో నివసిస్తూ జీవనోపాధి కొనసాగిస్తున్న తమకు ప్రత్యామ్నాయ నివాసం లేకుండా నిరాశ్రయులుగా మారే పరిస్థితి వచ్చిందని వారు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం లేదా ఇందిరమ్మ ఇళ్ల కింద ఇళ్లను కేటాయించాలని కోరారు. బాధితుల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్సీ అంజి రెడ్డి వెంటనే స్పందిస్తూ, ఈ విషయంపై రైల్వే శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంతో పాటు సంబంధిత శాఖలతో చర్చించి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా, ప్రజలు ఇళ్లను కోల్పోయే పరిస్థితులలో ప్రభుత్వం మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి పునరావాసం కల్పించడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు తగిన న్యాయం జరిగే వరకు తన వంతు సహాయం కొనసాగిస్తానని ఎమ్మెల్సీ అంజి రెడ్డి స్పష్టం చేశారు.

## కార్పొరేషన్ పరిధిలోని
### 4వ, 6వ, 7వ డివిజన్లలో( టేకులపల్లి, ఖానాపురం)



ఖమ్మం:లోకల్ గైడ్ :కార్పొరేషన్ పరిధిలోని 4వ, 6వ, 7వ డివిజన్లలో( టేకులపల్లి, ఖానాపురం) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ శ్రీమతి పునుకొల్లు నీరజ పాల్గొని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడపడుచుల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు దండా జ్యోతి రెడ్డి, నాగండ్ల కోటేశ్వరరావు, డివిజన్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# సింగరేణి మండలం తహసీల్దార్ ఆఫీస్ ముందు
# నిరసన ప్రదర్శన టీ జీ ఇ జే ఏ సీ




ఖమ్మం జిల్లా, కారేపల్లి : లోకల్ గైడ్, ఏప్రిల్ 17 : దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల , ఉపాధ్యాయుల , పెన్షనర్ల , కాంట్రాక్ట్ , ఔట్సోర్సింగ్ , కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర టీ జీ ఇ జే ఏ సీ ఇచ్చిన దశలవారీ పోరాట కార్యక్రమంలో భాగంగా టీ జీ ఇ జే ఏ సీ సింగరేణి ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయం 12:30 నుండి 1 వంటి గంట వరకు కారేపల్లి మండల తహసీల్దార్ ఆఫీసు వద్ద నిరసన ప్రదర్శన జరిగింది . అనంతరం మండల డిప్యూటీ తహసీల్దార్ మెమోరాండం సమర్పించడం జరిగింది.

**ప్రధాన డిమాండ్స్ :-**




1. రెండవ పిఆర్సి కమిషన్ రిపోర్ట్ తెప్పించి వెంటనే అమలు చేయాలి. 2. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి ప్రభుత్వం పెండింగ్ బిల్లులు నెలకు ?700 కోట్లు విడుదల చేసినప్పటికీ , రాష్ట్రంలో నెలకు సగటున 600 మంది ఉద్యోగులు రిటైర్ అవుతుండటంతో బకాయిలు భారీగా పేరుకు పోతున్నాయి. కావున ఏకమొత్తంగా పెండింగ్ లో ఉన్న రూ. 13000 కోట్లను వెంటనే విడుదలచేసి పెన్షనర్స్ కుటుంబాలు ఇబ్బందులు పడకుండా చూడాలి. 3. అందరికీ ఆరోగ్య కార్డులను వెంటనే మంజూరు చేసి అమలు చేయాలి. కొత్త ఇ ఎచ్ ఎస్ స్కీం విధి విధానాలను వెంటనే రూపొందించి, మే 1వ తేది నుండి వైద్య సేవలు అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలి. 4. ఎ) రాష్ట్రంలో కాంట్రిబ్యూషన్ పెన్షన్ (సీపీస్ )ను రద్దుచేసి పాత పెన్షన్ స్కీం (ఒపీస్ ) ను పునరుద్ధరణ చేయాలి. బి) 01/09/2004 కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు వెంటనే పాత పెన్షన్ స్కీం (ఒపీస్ ) ను అమలు చేయాలి. పైన తెలిపిన (4) ప్రధాన డిమాండ్ లతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబందించిన, మిగిలిన దీర్ఘకాలికంగా ఉన్న (64) అంశాలలో పెండింగ్ లో ఉన్న వాటిని సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేసినారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యోగ , ఉపాధ్యాయులు , పెన్షనర్లు విజయవంతం చేయడమైనది. ఈ కార్యక్రమం లో ముఖ్యం గా మండల టీ జీ ఇ జే ఏ సీ సింగరేణి నాయకులు మల్లెల రవీంద్రప్రసాద్ , టీ జీ వో అసోసియేటెడ్ అధ్యక్షులు కేవీ. కృష్ణా రావు , బానోత్ మంగీలాల్, టీ ఎస్ యు టీ యఫ్ , ఎం.హరీష్ , బి. శ్రీనివాసరావు టీపీటీఫ్ , వీ. మంగీలాల్ , ఆ. శంకర్ పీ ఆర్ టీ యు , బి. మంగ్య , డీ . రమేష్ , బి . బాలాజీ , టీ ఎస్ టీ టీ యఫ్ , అజ్మీరా బన్సీలాల్ , అజ్మీరా వీరు నాయక్ , రాంకోటి టీ జీ టీ టీ యఫ్ ,యం .రమేష్ , రాములు ఎస్ టీ యఫ్ , పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్ష/కార్యదర్శి నెహ్రూ , హరి , జీపీవో ల సంఘం అధ్యక్షులు బంపర్ , రెవెన్యూ ఉద్యోగుల సంఘ బాధ్యులు పాషా, పీ ఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ బాధ్యులు రమేష్ , హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ సంఘ బాధ్యులు ప్రకాష్ , ఇంజనీర్ల సంఘ బాధ్యులు నరసింహారావు , చంద్రశేఖర్ , నరేందర్ , హౌసింగ్ ఇంజనీర్ల సంఘ బాధ్యులు నాగేందర్ , ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు అత్యధికంగా పాల్గొన్నారు

## మాదిగల రిజర్వేషన్లను 11 శాతానికి పెంచాలి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. ఏప్రిల్ 17.( లోకల్ గైడ్)ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 15 శాతం రిజర్వేషన్లలో వర్గీకరణ ప్రకారం జనాభా ప్రాతిపదికన 11% రిజర్వేషన్లు మాదిగలకు కేటాయించాలని ఎంఎస్పి నల్లగొండ జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవోస్ భవన్లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూమాదిగల జనాభా 10 నుండి 11% ఉంటుందని మా అధినేత మందకృష్ణ మాదిగ మొదటి నుండి చెబుతున్నారు అది కుల గణన సర్వేతో స్పష్టమైంది. కుల గణన ఇంకా పూర్తిస్థాయిలో శాస్త్రీయంగా జరగలేదు. అలా జరిగితే మా జనాభా ఇంకా రెట్టింపు స్థాయిలో పెరుగుతుందనేది నిజం. కొంతమంది మేధావుల ముసుగులో జాతికి అన్యాయం చేసే విధంగా కేటాయించిన 9 శాతం రిజర్వేషన్లను స్వాగతించారు. వారు జాతికి ద్రోహం చేశారు అనేది రుజువైంది. పాలకుల మెప్పు కోసం జాతికి అన్యాయం చేసే విధంగా వ్యవహరించిన ద్రోహులకు జాతిలో స్థానం ఉండదు. ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చే సందర్భంలోనే మంద కృష్ణ మాదిగ 11% శాతం వాటా మాదిగలకు కేటాయించాలని రేవంత్ రెడ్డి గారిని స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారు. మాదిగలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రస్తుతం రేవంత్ రెడ్డి మీదనే ఉన్నది. మాదిగల్లో ఉన్న పేదరికం తొలగించడానికి అన్ని రకాల నిర్ణయాలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో మాదిగ జాతి మరింత సంఘటితం కావాలి. బలమైన శక్తిగా ఎదగాలి. మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశత జయంతి ఉత్సవాల అత్యున్నత కమిటీలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ కి చోటు కల్పించినందుకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి యావత్తు మాదిగ జాతి తరుపున కృతజ్ఞతలు. ఇది మా జాతికి లభించిన గుర్తింపు, గౌరవమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు బొజ్జ దేవయ్య మాదిగ, మహిళా అధ్యక్షురాలు కురుపాటి కమలమ్మ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి తరి ఏడుకొండలు, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు మాసారం వెంకన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రణదీప్, దుబ్బ సత్యనారాయణ, మరియు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంబోడియా కేంద్రంగా సైబర్ మోసం..
## సైబరాబాద్ పోలీసులకు చిక్కిన నిందితుడు



సైబరాబాద్, (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సైబర్ క్రైమ్ పోలీసులు అంతర్జాతీయ సైబర్ మోసాల గుట్టును బయటపెట్టారు. డిజిటల్ అరెస్ట్ స్కామ్ ద్వారా భారతీయులను మోసం చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు క్రైమ్ నంబర్ 341/2026గా నమోదు చేయబడింది. పోలీసుల వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి, జగిత్యాల జిల్లా మెడిపల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన గజర్ల అవినాష్ (26) డేటా ఎంట్రీ ఉద్యోగం పేరుతో కాంబోడియాకు వెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత అతడిని బలవంతంగా సైబర్ మోసాలకు ఉపయోగించుకున్నారు. అనంతరం అతను స్వచ్ఛందంగా కూడా ఈ మోసాలలో పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు. అతను పోలీస్ అధికారిగా నటిస్తూ బాధితులకు ఫోన్ కాల్స్ చేసి, వారి మీద కేసులు ఉన్నాయని భయపెట్టి డబ్బులు బదిలీ చేయించేవాడు. ఈ విధంగా “డిజిటల్ అరెస్ట్ స్కామ్” ద్వారా మోసాలు జరిపినట్లు వెల్లడైంది. బాధితుల నుంచి వసూలు చేసిన డబ్బులను భారత్‌లోని మ్యూల్ అకౌంట్ల ద్వారా మళ్లించి, నగదుగా తీసుకున్నట్లు గుర్తించారు. జనవరి, ఫిబ్రవరి 2026 నెలలలో సుమారు రూ. 24 లక్షలు మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆ డబ్బును నిందితులు కమిషన్ రూపంలో పంచుకున్నారని వెల్లడించారు. నిందితుడి వద్ద నుంచి ఒక మొబైల్ ఫోన్, భారత పాస్‌పోర్ట్, రూ. 12 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడు తన పాత్రను అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో మరిన్ని బాధితులను గుర్తించడం, డబ్బుల లావాదేవీల మార్గాన్ని అన్వేషించడం, అంతర్జాతీయ ముఠాలో ఉన్న ఇతర సభ్యులను పట్టుకోవడం కోసం దర్యాప్తు కొనసాగుతోంది. ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు. తెలియని లింకులు, కాల్స్, మెసేజ్‌లను నమ్మకుండా, బ్యాంకింగ్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు

## ప్రతి రైతుకు పరిహారం...ఆందోళన వద్దు



నారాయణపేట ఏప్రిల్ 17(లోకల్ గైడ్ ::నారాయణపేటబి కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూమి కోల్పోతున్న ప్రతి రైతుకు ప్రభుత్వం పరిహారం ఇస్తుందని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నారాయణపేట నియోజకవర్గం ఇంఛార్జి మాజీ డిసిసి అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి అన్నారు.దామరగిద్ద మండ లం కానుకుర్తి గ్రామంలో రైతులతో సమావేశమై ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ సగానికి పైగా రైతులకు నష్టం పరిహారం చెల్లించామని, మిగతా రైతులకు కూడా త్వరలో పరిహారం అందిస్తామని రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, పనులు సాఫీగా జరిగేలా సహకరించాలని కోరారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. శివకుమార్ రెడ్డి హామీతో సంతృప్తి చెందిన రైతులు పనులు త్వరగా పూర్తి చేయడానికి సహకరిస్తామని తెలిపారు.

# పి ఆర్ సి నివేదిక తక్షణమే అమలు చేయాలి

### రిటైర్ అయిన ఉద్యోగు లకు పెండింగ్ బిల్లులు అన్ని క్లియర్ చేయాలి
### ఓ పి ఎస్ పునరుద్ధరించాలి
### టి జి ఈ జే ఏ సి డిమాండ్




నారాయణపేట ఏప్రిల్ 17(లోకల్ గైడ్ :ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జే ఏ సి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శు క్రవారం నారాయణ పేటజిల్లా లోని అన్ని మండల కేంద్రాలలో ఎమ్మార్వో ఆఫీస్ ల వద్ద , జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో మొదటి దశ పోరాటంలో భాగంగా భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సమా వేశంలో టి జి ఇ జెఎసి



చైర్మన్ ఎం. నర్సింహారెడ్డి, సెక్రటరీ జనరల్ మొగుళప్ప, అడిషనల్ సెక్రటరీ జనరల్, కోచేర్మన్లు మాట్లాడుతూ ఉద్యోగులు,ఉపాధ్యాయులు, పెన్షనర్లు తెలంగాణ రెండవ పిఆర్సి కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పిఆర్సి గడువును పొడిగించకుండా వెంటనే నివేదిక తెప్పించు కొని సంఘాలతో చర్చించి 51శాతం ఫిట్మెంట్ తో అమలు చేయాలని, పెండింగ్ బిల్లు లు ఒకేసారి చెల్లించాలని,ఈ ఎచ్ ఎస్ అమలు చేయాలనీ,సి పి ఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. 2024 మార్చి నుండి రిటైర్ అయిన 12000 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయు లకు చెల్లించాల్సిన బకాయి లు వెంటనే విడుదల చేయాలని, ఏక మొత్తంగా రూ 10,000 కోట్లు కేటాయించి పెండింగ్ బిల్లులు అన్ని క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు.జి పి ఎఫ్,పి పి ఎస్ఉపాధ్యాయుల డిఏ బకాయిలు విడుదల చేయాలని, బకాయి ఉన్న నాలుగు వాయిదాల డీఏల ను ప్రకటించాలని, హెల్త్ కార్డుల పై నగదురహిత వైద్యం అందించాలని, ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలను రూపొందించి పర్యవేక్షణ అధికారుల పదోన్నతులు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తు న్నదని, ఆర్థిక భారం లేని సమస్యలను కూడా పరిష్క రించే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు.సి పి ఎస్ రద్దుచేసి పాత పెన్షన్ ను పునరుద్ధరించాలని, 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జేఏసీ చైర్మన్ టి ఎం జి ఓ జిల్లా అధ్యక్షులు ఏం. నర సింహారెడ్డి సెక్రటరీ జనరల్ టి జి ఓ జిల్లా అధ్యక్షులు ముగులప్ప అడిషనల్ సెక్రటరీ జనరల్ పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి కో చైర్మన్లు యు టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు శివరాములు, టి పి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప పెన్షనర్ ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి , సంతోష్ కుమార్, ప్రభుత్వ లెక్చరర్ ల సంఘం, నర్సింహా రెడ్డి,రామ్ రెడ్డి, రెవిన్యూ సంఘం మధు, ట్రెసా రామ కృష్ణ , ట్రెసారీ సంఘం తిరుమలేష్,జి టి ఏ భీమయ్య,పంచాయతి కార్యదర్శులు సంఘం బాలరాజు,డి టి ఎఫ్ సూర్య చంద్ర,డి పి ఆర్ ఓ రషీద్,అలివేలమ్మ,తహశీల్దార్ లు అమరేందర్ కృష్ణ రాణి , సురేందర్, బాటు టీఎన్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్ పి ఆర్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, టి పి టి ఎఫ్ అధ్యక్షులుదేవేంద్రప్ప,రఘువీర్, బాలాజీ, బసప్ప, శ్రీనివా స్, ఉదయ భాను,జనార్దన్, మహాదేవ్,శ్రీధర్,రాణి,జయసుధ,ఎం ఎస్ కుమార్, వాణిశ్రీ, శశికళ, పర్వీన్, శ్రీదేవి, శ్రీకాంత్, నర్సింలు, కాలేబ్,అధిక సంఖ్య లో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరము జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్ ప్రతికు జైన్ కు వినతి పత్రంసమర్పించారు .ఈరోజు నారాయణపేట జిల్లాలోని అన్ని తాసిల్దార్ కార్యాలయా ల వద్ద,కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్యోగ ఉపాధ్యాయుల పెన్షనర్ల నిరసనను రాష్ట్ర ప్రభుత్వము దృష్టికి తీసు కుని వెళ్లి వెంటనే సమస్యలు పరిష్కారం విధంగా సహక రించాలని జేఏసీ నాయకులు కలెక్టర్ ను కోరారు.

## తేజస్వీ మాటలపై అనవసర రాద్ధాంతం
## కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ



నారాయణపేట ఏప్రిల్ 17(లోకల్ గైడ్ :: పార్లమెంట్ లో బిజెపి ఎంపీ తేజస్వి సూర్య మాటలను కాంగ్రెస్,బి ఆర్ ఎస్ నాయకులు వక్రీకరించి అనవసర రాద్ధాంతం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.నాడు అటల్ బిహారీ వాజ్ పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో దేశంలో మూడు కొత్త రాష్ట్రాలు ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రూపుదిద్దుకు న్నాయనీ ఈ మూడు రాష్ట్రాల నిర్మాణం ఒక్క రక్తపు చుక్క చిందకుండా, ఎలాంటి అల్లర్లు లేకుండా, అందరి సమ్మతితో, సహకారంతో సాఫీగా జరిగిందనీ గుర్తు చేశారు. ఇది బీజేపీ నాయకత్వం తీసుకున్న బాధ్యతాయుత, సమతుల్య నిర్ణయానికి నిదర్శనం అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న సమయంలో, తెలంగాణ కోసం ప్రజలు పోరాడుతున్న నేపథ్యంలో వారు అనవసరంగా ఆల స్యం చేసి అనేకమంది యువకుల ఆత్మహత్యలకు, వేలాది మంది విద్యార్థులు, యువకులు ప్రాణత్యా గాలకు కాంగ్రెస్ కారణం అయిందని తేజస్వి సూర్య గుర్తు చేశారే తప్ప తెలంగాణాను పాకిస్తాన్ తో పోల్చలేదన్నారు.ఎంపీ మాటలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్,బి ఆర్ ఎస్ కుట్ర చేస్తున్నాయని అన్నారు.కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బిజెపి పాత్రను రాష్ట్ర ప్రజలకు తెలుసని ఆ పార్టీల రాజకీయ కుట్రను ప్రజలే తిప్పి కొడతారని బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ఖమ్మం ఆర్టీఓ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

**మేయర్ పునుకొల్లు నీరజ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి పరిశీలించారు.**



ఖమ్మం :లోకల్ గైడ్ : ఆర్టీవో కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి, అనంతరం ఉచిత కంటి శిబిరాన్ని ప్రారంభించి సందర్శించారు. తర్వాత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం "జీరో ఫాటాలిటీ" లక్ష్యంతో రోడ్డు భద్రతపై విస్తృత ప్రచారం నిర్వహిస్తోందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు వినియోగించాలని కోరారు.మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా డ్రైవింగ్ చేయడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకొని ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లను శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఉప మేయర్ ఫాతిమా జోహార, స్థానిక కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, డీఎంహెచ్‌వో, డీసీహెచ్‌ఎస్, ఆర్ఎం ,ఆర్టీఏ మెంబర్ గజ్జెల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ
## సమస్యల పరిష్కారానికి నల్ల బ్యాడ్జీలతో నిరసన



మిడ్జిల్ ఏప్రిల్ 17(లోకల్ గైడ్ ):దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర టీజీఈజేఏసీ ఇచ్చిన దశలవారీ పోరాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మిడ్జిల్ మండలంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.అపరిష్కృతంగా ఉన్న 64 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగులు,ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని అన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. నర్సిములు, మండల అధ్యక్షుడు సి. వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి కె. రమేష్, పీఆర్‌టీయూ నాయకులు రాజేందర్ గౌడ్, బి. మల్లయ్య, టీజీయూఎస్ జిల్లా అధ్యక్షుడు థారాసింగ్, మండల అధ్యక్షుడు జె. కృష్ణ, టీపీయూఎస్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, శివ ప్రసాద్, బి. రమేష్ గౌడ్, హర్యా, మద్దమ్మ, ప్రభావతి, ఝాన్సీ, శ్రీశైలం, శ్రీనివాస్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## తేజస్వి సూర్య వ్యాఖ్యలపై
## బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గంజి కృష్ణ ఆగ్రహం



మిడ్జిల్ ఏప్రిల్ 17(లోకల్ గైడ్ ):తెలంగాణపై లోక్‌సభలో బీజేపీ నాయకుడు తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యల పై న భారత్ రాష్ట్ర సమితి మండల సీనియర్ నాయకుడు గంజి కృష్ణ శుక్రవారం తీవ్రంగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారత్--పాకిస్థాన్ విభజనతో పోల్చడం ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా ఆయన ఖండించారు.తెలంగాణ రాష్ట్రం ఎవరి భిక్షతో ఏర్పడలేదని, వేలాది మంది యువకుల త్యాగాలు, సుదీర్ఘ ప్రజాస్వామ్య పోరాట ఫలితంగా ఏర్పడిందని గుర్తు చేశారు. ఇటువంటి చారిత్రక పోరాటాన్ని దేశ విభజన వంటి విషాదకర సంఘటనతో పోల్చడం అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.పార్లమెంట్ వేదికగా తెలంగాణను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని, వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని తెలంగాణ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని గంజి కృష్ణ డిమాండ్ చేశారు.ఈ విషయంపై కేంద్ర నాయకత్వం స్పందించి స్పష్టత ఇవ్వాలని, ముఖ్యంగా ప్రధాని జోక్యం చేసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు రాష్ట్ర గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందని, ఇటువంటి సందర్భాల్లో మౌనం పాటించడం సరైంది కాదని అన్నారు.తెలంగాణ త్యాగాల గాథగా, స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొంటూ, రాష్ట్రాన్ని అవమానించే ప్రయత్నాలను సమాజం సహించదని హెచ్చరించారు. రాష్ట్ర హక్కులు, గౌరవం కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తుందని గంజి కృష్ణ స్పష్టం చేశారు.

## అంగన్వాడీ టీచర్లకు
## సెల్ ఫోన్ లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.



రాజేంద్ర నగర్, లోకల్ గైడ్ : అంగన్వాడీ టీచర్లు అంకిత భావంతో పనిచేయాలని రాజేంద్ర నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. శు క్రవారం మైలార్దేవ్ పల్లి లోని తన నివాసంలో ప్రభుత్వం పంపిణీ చేసిన సెల్ ఫోన్ లను ఐ సీ డి ఎస్ శేరిలింగం పల్లి ప్రాజెక్టు అధికారిణి కవిత ఇతర సూపర్ వైజర్ల ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు కొత్త సెల్ ఫోన్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీధి నిర్వహణ లో ఎలాంటి లోటు పాట్లు రాకుండా జాగ్రత్త గా విధులు నిర్వహించాలని సూచించారు. వికలాంగులకు ఎలక్ట్రిక్ మోటార్ సైకిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లో నార్సింగ్ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, అంగన్వాడి సూపర్వైజర్లు టీచర్లు పాల్గొన్నారుఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్టీఓ జె.ఎన్. శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, ఏఎంవిఐలు జి. దినేష్, జి. సుమలత, ఆర్టీఏ మెంబర్ జి. వెంకన్న, కౌన్సిలర్లు, వాహనదారులు, ప్రజలు, సాంస్కృతిక సారథి కళాకారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత... జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

రాహ-వీర్ పథకం క్రింద గోల్డెన్ అవర్‌లో సహాయం

చేసిన వారికి 25 వేలు బహుమతి

ఖమ్మం జిల్లాలో 30 బ్లాక్ స్పాట్లను సరిదిద్దడంతో ప్రమాదాలు తగ్గుదల

రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై ఏఐ ద్వారా కఠిన చర్యలు

హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి... నిర్లక్ష్యం ప్రాణాంతకం

ఆర్టీవో కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి

ప్రణాళిక అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, ఏప్రిల్ -17:లోకల్ గైడ్ :రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా రవాణాధికారి కార్యాలయంలో నిర్వహించిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, లా అండ్ ఆర్డర్ అదనపు డిసిపి ప్రసాదరావు లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఆర్టీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. రాహ-వీర్, పిఎం రాహత్ అనే రెండు కొత్త పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించిన వారికి రాహ-వీర్ పథకం క్రింద 25 వేలు ప్రోత్సాహకంగా అందజేస్తామని తెలిపారు. పీఎం రాహత్ పథకం క్రింద ప్రమాద బాధితులకు లక్షన్నర వరకు నగదు రహిత చికిత్సను పూర్తిగా ఉచితంగా అందిస్తామని వివరించారు.ఈ పథకాలు గోల్డెన్ అవర్‌ను సమర్థవంతంగా వినియోగించేందుకు తీసుకొచ్చినవని తెలిపారు. సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం మన రక్షణ కోసమేనని, వాటిని తప్పించుకోవాలని ప్రయత్నించడం సరికాదని సూచించారు. కారులో ప్రయాణించే సమయంలో డ్రైవర్ మాత్రమే కాకుండా ప్రయాణికులు కూడా తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు.ఖమ్మం జిల్లాలో టాప్ 30 యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్లను గుర్తించి సరిదిద్దినట్లు తెలిపారు. దీని వల్ల ప్రమాదాలు తగ్గి ఈ ఏడాది 15 మంది ప్రాణనష్టం తగ్గిందని అన్నారు. మరిన్ని బ్లాక్ స్పాట్లను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.రాంగ్ సైడ్ డ్రైవింగ్‌ను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని వినియోగించి వాహనాలను గుర్తించి భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. పునరావృతంగా నిబంధనలు ఉల్లంఘించే వారి లైసెన్సులు రద్దు చేసి వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.ఖమ్మం జిల్లా రోడ్డు భద్రతలో అగ్రగామిగా నిలవాలని, ప్రమాదాలు జరగకుండా అందరూ కృషి చేయాలని సూచించారు.నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని తెలిపారు. రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ప్రయాణికుల భద్రత అత్యంత ముఖ్యమని అన్నారు.హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల ఎన్నో ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలను చూస్తున్నప్పటికీ ఇంకా నిర్లక్ష్యం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి తమను తాము రక్షించుకోవాలని, ఒకరి ప్రాణ నష్టం కుటుంబానికి, తమకు ఎంతో పెద్ద నష్టాన్ని కలిగిస్తుందని తెలిపారు.లా అండ్ ఆర్డర్ అదనపు డిసిపి ప్రసాదరావు మాట్లాడుతూ అరైవ్ అలైవ్ అంటే ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రతి ఒక్కరూ సురక్షితంగా తిరిగి ఇంటికి చేరుకోవడం అని భావించాలన్నారు. వాహనదారులు అందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు యూనిఫారం ధరించడం తప్పనిసరి అని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రయాణికులు కూడా హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు.అలాగే కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. అవగాహన కార్యక్రమం అనంతరం కఠినంగా నిబంధనలు అమలు చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు కార్యాలయ ఆవరణలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్, డాక్టర్లచే డ్రైవర్లకు నిర్వహిస్తున్న కంటి పరీక్షలను పరిశీలించారు. డ్రైవర్లు ఆరోగ్యంగా ఉండటం రోడ్డు ప్రమాదాల నివారణలో కీలకమని అన్నారు.అలాగే రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన ఆడియో విజువల్ (ఏవీ) ప్రదర్శనను వీక్షించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్, మేయర్ లు కేఎంసి డిఆర్ఎఫ్ టీమ్ సిబ్బందికి హెల్మెట్లు ప్రధానం, రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు, ఆర్టీసీ ఖమ్మం రీజియన్ లో ఉత్తమ డ్రైవర్ లకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

## అగ్నిప్రమాదం పై తక్షణమే స్పందించిన...
## కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు దంపతులు



ఖమ్మం ఏప్రిల్ 17 వైరా :లోకల్ గైడ్ :20 వ వార్డ్ లో మేరీ ఇమ్మాక్యులేట్ స్కూల్ దగ్గర ఒక చెట్టుకు మంటలు అంటుకొని అటు కరెంటు తీగలకు ఇటు ప్రయాణికులకు ప్రమాదకరంగా మారటంతో విషయం తెలుసుకున్న కౌన్సిలర్ ,వెంటనే కరెంటు డిపార్ట్మెంట్, ఫైర్ స్టేషన్ మున్సిపల్ కమీషనర్ వారిని సమన్వయము చేసుకొని సమస్యనుపరిష్కరించారు .ఈ కార్యక్రమంలో ,లైన్ ఇన్స్పెక్టర్ జార్జ్ , స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఏ. శ్రీనివాసరావు, ఫైర్ ఫైటర్ కె.వీరభద్రం మరియు ఫైర్ సిబ్బంది టి. అప్పారావు, పి. రాంబాబు, ఎన్ ప్రకాశరావు , మున్సిపల్ కమిషనర్ గురులింగం పాల్గొన్నారు. వెంటనే స్పందించిన ఫైర్ డిపార్ట్మెంట్ కరెంటు డిపార్ట్మెంట్ మున్సిపల్ డిపాట్మెంట్ లకు కౌన్సిలర్ ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం
## సాగర్ రహదారిపై ఉద్రిక్త వాతావరణంలిలి
## బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో మాజీ ఎమ్మెల్యే హౌస్ అరెస్ట్



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 17( లోకల్ గైడ్ )ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఫార్మాసిటీ భూముల విషయంలో రైతులకు అన్యాయం చేసి కోట్లు దోసుకున్నారని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పై ఆరోపణలను తిప్పికొడుతూ శుక్రవారం ఫార్మాసిటీ మేడిపల్లి గ్రామానికి బహిరంగ చర్చకు రావాల్సిందిగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి సవాల్ చేయగా శుక్రవారం మంచి రెడ్డి కిషన్ రెడ్డి కార్యకర్తలతో పెద్ద ఎత్తున ఫార్మాసిటీ మేడిపల్లికి చేరుకోవాలని అనుకోగా ఇబ్రహీంపట్నం పోలీసులు బిఆర్ఎస్ పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద మేడిపల్లికి వెళ్లాడానికి సిద్ధంగా ఉన్న సమయంలో ఏసీపీ కేపీవీ రాజు, సీఐలు మద్ది మహేందర్ రెడ్డి, మధు లు మంచిరెడ్డి కిషన్ రెడ్డిని మేడిపల్...

# ప్రతి విద్యార్థి చదివే నైపుణ్యం సాధించాలి...

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఎవ్రీ చైల్డ్ రీడ్స్ ద్వారా పఠనంలో గణనీయమైన పురోగతి

ఉపాధ్యాయుల కృషి ఫలితం 29 వేల మంది విద్యార్థులకు పఠన నైపుణ్యాలు

ఇండిపెండెన్స్ డే నాటికి వంద శాతం లక్ష్యం సాధించాలి

చదవడం, అర్థం చేసుకోవడం, ప్రవాహంగా మాట్లాడడం కీలకం

ముదిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "ఎవ్రీ చైల్డ్ రీడ్స్ సెలబ్రేషన్స్" కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



ముదిగొండ, ఏప్రిల్ -17:లోకల్ గైడ్ :ప్రతి విద్యార్థి చదివే నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.ముదిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "ఎవ్రీ చైల్డ్ రీడ్స్ సెలబ్రేషన్స్" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం పై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ముదిగొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మమేకమై వారి పఠన నైపుణ్యాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు స్కిట్లు ప్రదర్శించడం, కథలు చదవడం, ఆత్మ విశ్వాసంతో పఠనం చేయడం వంటి కార్యక్రమాలు చూసి తాను ఎంతో ఆనందానికి లోనయ్యానని కలెక్టర్ తెలిపారు. "ఎవ్రీ చైల్డ్ రీడ్స్" కార్యక్రమం ప్రారంభించిన ఉద్దేశ్యం నెరవేరుతోందని, సాధించిన పురోగతిపై సంతోషం వ్యక్తం చేశారఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని స్వంతంగా స్వీకరించి విజయవంతం చేయడం అభినందనీయమని, ప్రతి ఉపాధ్యాయునికి తన అభినందనలు తెలియజేశారు. ప్రారంభంలో కేవలం 12-13 శాతం మంది విద్యార్థులు మాత్రమే వాక్యాలు చదవగలిగితే, ప్రస్తుతం అది 84 శాతానికి పెరగడం ఉపాధ్యాయుల కృషి ఫలితమని తెలిపారు. మిగిలిన 16 శాతం మంది విద్యార్థులు కూడా పఠన నైపుణ్యాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు.ప్రతి రోజూ ఒక గంట సమయం కేటాయిస్తూ పఠన నైపుణ్యాల పెంపుకు ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి మరింత ఉత్సాహంతో కార్యక్రమాన్ని కొనసాగించి, ఇండిపెండెన్స్ డే నాటికి 100 శాతం పఠన నైపుణ్యాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు.వాక్యాలు చదవడమే కాకుండా, ప్రవాహంగా చదవడం, అర్థం చేసుకోవడం కూడా సమానంగా ముఖ్యమని అన్నారు. 3వ తరగతికి నిమిషానికి 30 పదాలు, 4వ తరగతికి 40 పదాలు, 5వ తరగతికి 50 పదాలు చదవగలిగే లక్ష్యాలను సాధించాలని సూచించారు. చదివిన విషయాన్ని అర్థం చేసుకునే సామర్థ్యం కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు.బడి బాట కార్యక్రమంలో "ఎవ్రీ చైల్డ్ రీడ్స్" వీడియోలను ప్రదర్శించి, ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమం కలెక్టర్‌గా తనకు అత్యంత సంతృప్తి ఇచ్చిందని, ఒకసారి పిల్లలు చదవడం ప్రారంభిస్తే వారికి ఇక ఎలాంటి అడ్డంకి ఉండదని తెలిపారు.ఆనతరం ప్రతిభ కనబడిన విద్యార్థులకు బహుమతులు, మెమెంటో, ప్రశంస ప్రతాలను కలెక్టర్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నలుగుతున్న కార్యకర్తలు
# దశాబ్ద కాలం ఎదురుచూసిన దక్కని ఫలితం

**పార్టీ ఫిరాయింపులతో అవకాశాలు కోల్పోతున్న సిసలైన కార్యకర్తలు**

**కామారెడ్డిలో అన్ని రాజకీయ పార్టీలో ఇదే తంతు**

**గుర్తింపు లేదంటున్న కార్యకర్తలు**

లోకల్ గైడ్ కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17:కామారెడ్డి జిల్లాలో ఆయా రాజకీయ పార్టీలో నాయకులు కార్యకర్తలు నలిగిపోతున్నారు. దశాబ్ద కాలం పాటు పార్టీ కోసం విశేష కృషి చేసినప్పటికీ తమకు పార్టీలో సముచిత స్థానం దక్కడం లేదని ఆవేదనలో ఉన్నారు. బహిరంగంగా ఈ విషయాన్ని చెప్పలేకపోతున్న లోలోపల మాత్రం కుమిలిపోతున్నారు. కాగా కాంగ్రెస్ అధికార పార్టీలో గత ఎన్నో ఏళ్ల నుంచి కృషిచేసిన తమకు అవకాశాలు లభించలేదని నైలాష్యంలో పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పార్టీగా ఉన్న సమయంలో పార్టీ మారకుండా ఉన్న నాయకులను సైతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తగినంత ప్రాధాన్యత ఇవ్వడం లేదని వాదనలు చర్చలు వినిపిస్తున్నాయి. సీనియర్ నాయకులుగా ఉన్నవారికి సైతం కాకుండా ఈ మధ్యలో పార్టీలోకి వచ్చినవారికి ప్రాధాన్యత దక్కడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు కొందరు పెదవి విరుస్తున్నారు. ఇదిలా ఉంటే గత సర్పంచ్ ఎన్నికలలో సైతం కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన వారు ఓడిపోవడం ఆ స్థానంలో గెలిచినవారు తిరిగి కాంగ్రెస్లో చేరడంతో తమ ప్రాధాన్యత తగ్గినట్లుగా మారిందనే భావనలో ఆయా మండలాల్లోని నాయకులు కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే డిసిసి జిల్లా అధ్యక్ష పదవి కామారెడ్డికి దక్కుతుందని భావించినప్పటికీ దక్కకుండా పోయింది. దీంతో కామారెడ్డిలో ఆ పదవిని ఆశించిన ఎంతోమంది ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ కార్యకర్తలు ఆవేదనకు లోనయ్యారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఆయా కులాలకు సంబల

# తహసీల్దార్‌కు వినతి సమర్పించిన ఉపాధ్యాయులు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) ఏప్రిల్ 17: బెజ్జంకి మండలంలో ఉపాధ్యాయులు మరియు ఉద్యోగ సంఘాల నాయకులు తహసీల్దార్ శ్రీకాంత్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు.తెలంగాణ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌సీ అమలు, పెండింగ్ బిల్లుల చెల్లింపు, హెల్త్ కార్డుల జారీ, ఓపీఎస్ పునరుద్ధరణ వంటి ప్రధాన డిమాండ్లను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని తమ సమస్యలను తహసీల్దార్‌కు వివరించారు.

# మాదిగల రిజర్వేషన్లను 11 శాతానికి పెంచాలి.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. ఏప్రిల్ 17.( లోకల్ గైడ్)ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 15 శాతం రిజర్వేషన్లలో వర్గీకరణ ప్రకారం జనాభా ప్రాతిపదికన 11% రిజర్వేషన్లు మాదిగలకు కేటాయించాలని ఎంఎస్పి నల్లగొండ జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవోస్ భవన్లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూమాదిగల జనాభా 10 నుండి 11% ఉంటుందని మా అధినేత మందకృష్ణ మాదిగ మొదటి నుండి చెబుతున్నారు అది కుల గణన సర్వేతో స్పష్టమైంది. కుల గణన ఇంకా పూర్తిస్థాయిలో శాస్త్రీయంగా జరగలేదు. అలా జరిగితే మా జనాభా ఇంకా రెట్టింపు స్థాయిలో పెరుగుతుందనేది నిజం. కొంతమంది మేధావుల ముసుగులో జాతికి అన్యాయం చేసే విధంగా కేటాయించిన 9 శాతం రిజర్వేషన్లను స్వాగతించారు. వారు జాతికి ద్రోహం చేశారు అనేది రుజువైంది. పాలకుల మెప్పు కోసం జాతికి అన్యాయం చేసే విధంగా వ్యవహరించిన ద్రోహులకు జాతిలో స్థానం ఉండదు. ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చే సందర్భంలోనే మంద కృష్ణ మాదిగ 11% శాతం వాటా మాదిగలకు కేటాయించాలని రేవంత్ రెడ్డి గారిని స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారు. మాదిగలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రస్తుతం రేవంత్ రెడ్డి మీదనే ఉన్నది.మాదిగల్లో ఉన్న పేదరికం తొలగించడానికి అన్ని రకాల నిర్ణయాలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో మాదిగ జాతి మరింత సంఘటితం కావాలి. బలమైన శక్తిగా ఎదగాలి. మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశత జయంతి ఉత్సవాల అత్యున్నత కమిటీలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ కి చోటు కల్పించినందుకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి యావత్తు మాదిగ జాతి తరుపున కృతజ్ఞతలు. ఇది మా జాతికి లభించిన గుర్తింపు, గౌరవమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు బొజ్జ దేవయ్య మాదిగ, మహిళా అధ్యక్షురాలు కురుపాటి కమలమ్మ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి తరి ఏడుకొండలు, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు మాసారం వెంకన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రణదీప్, దుబ్బ సత్యనారాయణ, మరియు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గోల్డెన్ అవర్ ప్రాణాలను కాపాడుతుంది అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం

**ప్రమాదం వెంటనే స్పందించండి.. ప్రాణాలు నిలబెట్టండి: ట్రాఫిక్ ఎస్ఐ విజ్ఞప్తి**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)ఏప్రిల్ 17:సిద్దిపేట పట్టణంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో అరైవ్-అలైవ్ రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ ఎస్ఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్య బృందం, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీనియర్ డాక్టర్ మాధవ్ మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన వెంటనే మొదటి గంటను "గోల్డెన్ అవర్" అని పిలుస్తారని, ఆ సమయంలో క్షతగాత్రునికి తక్షణ చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు.అలాగే ట్రాఫిక్ ఎస్ఐ విజయభాస్కర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "రహ-వీర్ యోజన" పథకం గురించి వివరించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వెంటనే ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం రూ.25,000 నగదు బహుమతి అందజేస్తుందని తెలిపారు. అందువల్ల ప్రజలు బాధ్యతతో స్పందించి ప్రమాద బాధితులను రక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సంగీత, డాక్టర్ జ్యోతి, మాధవి రాణి, పూజిత, హరికృష్ణ, నర్సింగ్ సిబ్బంది, 108 అంబులెన్స్ డ్రైవర్, టెక్నీషియన్లు, ఆటో డ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ తీరుపై ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల గర్జన!

**సమస్యల సుడిగుండంలో రాష్ట్ర యంత్రాంగం!**

**పెండింగ్ బిల్లులు, పీఆర్సీ అమలులో జాప్యంపై భగ్గుమన్న టీజీఈజేఏసీ**

**తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన సంఘ నేతలు!**

అశ్వారావుపేట లోకల్ గైడ్ : రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరిపై నిరసన జ్వాలలు మిన్నంటాయి. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న ఉదాసీనతను నిరసిస్తూ, టీజీఈజేఏసీ పిలుపు మేరకు అశ్వారావుపేట తహసిల్దార్ కార్యాలయం ముందు భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు.ఏళ్ల నాటి ఎదురుచూపులుఅందని అరకొర హామీలుతెలంగాణ రాష్ట్రంలోని 15.25 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్ల ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లుతోందని సంఘం నేతలు మండిపడ్డారు. ముఖ్యంగా నాలుగు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం అనుసరిస్తున్న తాత్సారంపై ధ్వజమెత్తారు.పీఆర్సీ అమలు ఎప్పుడురెండవ పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి, ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో జూన్ 2 లోపు ఉత్తర్వులు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కాలయాపన చేయడం వల్ల ఉద్యోగుల ఆర్థిక పరిస్థితి దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.బకాయిల కొండ పెండింగ్ బిల్లులురాష్ట్రవ్యాప్తంగా సుమారు 13,000 కోట్ల రూపాయల మేర పెండింగ్ బిల్లులు పేరుకుపోయాయని, నెలల



తరబడి జీతాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక ఉద్యోగులు అప్పుల పాలవుతున్నారని విమర్శించారు.హెల్త్ కార్డుల ప్రహసనంఉద్యోగుల ఆరోగ్య కార్డులు (ఈహెచ్ఎస్) కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందక ప్రాణాపాయ స్థితిలో కూడా ఇబ్బందులు పడుతున్నారని వారు వాపోయారు. మే 1వ తేదీ నుండి కొత్త ఈహెచ్ఎస్ విధానాన్ని అమలు చేయాలని అల్టిమేటం జారీ చేశారు.సి.పి.ఎస్ రద్దు - ఓ.పి.ఎస్ పునరుద్ధరణ2004 సెప్టెంబర్ 1కి ముందు నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ఓపిక నశించింది - పోరాటం తప్పదు!**

ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపించే చేతులే ఈరోజు రోడ్డున పడ్డాయి. వినతులు ఇచ్చినా, నిరసనలు తెలిపినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దురదృష్టకరం అని టీజీఈజేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 4 ప్రధాన డిమాండ్లతో పాటు మిగిలిన 64 అంశాలను పరిష్కరించకపోతే, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పాలనను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ప్రతినిధులు, ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్ల సంఘాల నేతలు, టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె. మాధవ రెడ్డి, భావ్‌సింగ్, హీరాలాల్, సోడె శ్రీను.యూటీఎఫ్ నాయకులు హరినాథ్, ఎం. వెంకటేశ్వర్లు. టీఆర్‌టీయూ సంఘం ప్రతినిధి జి. దుర్గారావు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధి ఎస్.కె. పకీర్, రెవెన్యూ విభాగం డిప్యూటీ తహశీల్దార్, ఎం.ఆర్.ఓ కార్యాలయ సిబ్బంది మరియు ఇతర కార్యాలయ ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు మరియు విశ్రాంతి ఉపాధ్యాయులు.వీరితో పాటు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# దుమ్ముగూడెంలో ఉద్యోగుల నిరసన
# సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందించారు



దుమ్ముగూడెం : లోకల్ గైడ్ :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండల కేంద్రంలో శుక్రవారం టీజీఈజేఏసీ చైర్మన్ లచ్చి రెడ్డి పిలుపు మేరకు, అలాగే రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు కలిసి తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ ప్రధాన డిమాండ్లను వెల్లడించారు. వాటిలో వేతన సవరణ (పీఆర్‌సీ) అమలు, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలు (డీఏలు) విడుదల, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు, ఆరోగ్య పథకం కార్డులు అందజేయడం తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం ఉద్యోగులు అందరూ కలిసి నాయబ్ తహసీల్దార్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీ నాయక్, భరణి బాబు, తెలంగాణ గ్రామ పాలన సేవల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కల్లూరు వెంకటేశ్వరరావు, గ్రామ పాలన అధికారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బర్ల నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు కోరం శ్రీనివాసరావు పాల్గొన్నారు. గ్రామ పాలన అధికారులు చంద్రరావు, జగదీష్, రోశయ్య, కొండయ్య తదితరులు పాల్గొని ఉద్యోగుల ఐక్యతను చాటిచెప్పారు. ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రాణం మీ చేతుల్లోనే!
# రహదారి భద్రత బాధ్యత మనందరిదీ!

**దమ్మపేటలో అరైవ్ అలైవ్ సదస్సులో ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, కలెక్టర్ అంకిత్ పిలుపు**



అశ్వారావుపేట, లోకల్ గైడ్ : రహదారి ప్రమాదాల నివారణ అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ఇందులో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకమని ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం దమ్మపేటలో నిర్వహించిన అరైవ్ అలైవ్ రహదారి భద్రత అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.సైబర్ మోసాలు - రహదారి ప్రమాదాలపై అప్రమత్తత అవసరం: ఐజీపీఈ సందర్భంగా ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, మనిషి ఇంట్లో ఉన్నప్పుడు సైబర్ నేరగాళ్ల పట్ల, బయటకు వస్తే రహదారి ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాల్లో డబ్బు పోతే తిరిగి సంపాదించుకోవచ్చు, కానీ ప్రమాదాల్లో ప్రాణం పోతే ఆ కుటుంబం కోలుకోలేని దెబ్బ తింటుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది జిల్లాలో 248 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని, హెల్మెట్ లేకపోవడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి పొరపాట్లే ఇందుకు కారణమని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ రహదారి భద్రతపై గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.అవగాహనతోనే ప్రమాదాలకు చెక్ : కలెక్టర్ అంకిత్జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, అవగాహన ద్వారానే ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. జిల్లాలో భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండే కేటీపీఎస్, బీటీపీఎస్, సింగరేణి ప్రాంతాల్లో ప్రమాదాలను తగ్గించేందుకు ఇప్పటికే 38 బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు గోల్డెన్ అవర్ లో చికిత్స అందేలా అంబులెన్స్ సేవలను బలోపేతం చేస్తున్నామని, సాంకేతికతను జోడించి ట్రాఫిక్ నియంత్రణ చేస్తున్నామని పేర్కొన్నారు.సమిష్టి కృషితోనే సురక్షిత ప్రయాణం : ఎస్పీ రోహిత్ రాజుఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రతిరోజూ 500 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో మరణించడం ఆందోళనకరమన్నారు. పోలీస్, మున్సిపల్, వైద్య, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలు తమ హక్కులతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించే బాధ్యతను కూడా గుర్తించాలని కోరారు. సదస్సు ప్రారంభంలో తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, పలువురికి డ్రైవింగ్ లైసెన్సులు అందజేశారు. పూసుకుంట కొండరెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ప్రమాదాల నివారణ, గుడ్ సమారిటన్ విధానం మరియు పీఎం అర్హత్ పథకంపై ప్రజలకు విజువల్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్, పాల్వంచ డిఎస్పి సతీష్, తహసిల్దార్ రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి మరియు ఇతర అధికారులు, భారీ సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చర్లలో ఉద్యోగుల ర్యాలీ తహశీల్దార్ కి వినతిపత్రం
# పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ పిలుపు



చర్ల : లోకల్ గైడ్ :టీజీఈజేఏసీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం చర్లలో శుక్రవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్ నుండి అందరూ ర్యాలీగా బయలుదేరి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్ శ్రీనివాస్ కి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగుల ఆరోగ్య కార్డులను తక్షణమే జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో టీజీఈజేఏసీ పిలుపుమేరకు వివిధ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. వి. బాలకృష్ణ, కె. రాంబాబు (టీఎస్‌యుటీఎఫ్), టి. వీరభద్రరావు, బి. శ్రీనివాసరావు (పీఆర్‌టీయూ), ఎస్. రామారావు (ఏటీఏ), పెన్షనర్ల సంఘం నాయకులు పి. నర్సింగ్ రావు, దొడ్డి తాతారావు, ముత్యాలరావు, పంచాయతీరాజ్ శాఖకు చెందిన కాసిం తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. అధికారులు తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

# భద్రతా చర్యలపై సీఆర్పీఎఫ్ బృందం ప్రదర్శనలు
# విపత్తు రక్షణపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన



చర్ల : లోకల్ గైడ్ :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఉదయం 10 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 50 నిమిషాల వరకు సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్స్పెక్టర్ జీడీ థీ బిటెన్ సింగ్ ఆధ్వర్యంలోని ఎఫ్/10వ బెటాలియన్‌కు చెందిన బృందం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. మొత్తం 20 మంది సిబ్బందితో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విపత్తుల సన్నద్ధత, భద్రతా చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ఉపన్యాసాలు, ప్రదర్శనలు మరియు ప్రాయోగిక శిక్షణ ఇచ్చారు. ప్రకృతి, మానవ నిర్మిత విపత్తుల సమయంలో పాటించాల్సిన ప్రాథమిక నియమాలు, ప్రథమ చికిత్స, సురక్షిత ప్రాంతాలకు తరలింపు విధానాలపై వివరించారు. అగ్నిప్రమాదాలు, భూకంపాలు, ఉరుములు-మెరుపులు, వడగళ్ల వాన, ఈదురు గాలులు, వరదలు వంటి పరిస్థితుల్లో ఎలా స్పందించాలో స్పష్టంగా తెలియజేశారు. అదనంగా వడగాలుల సమయంలో పాటించాల్సిన నియమాలు, పాటించకూడని పనులపై విద్యార్థులు, స్థానిక ప్రజలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం శ్రీనివాస్, కే ఎంపీడీవో ఈదయ్య, ఆర్ఎస్ఐ సిహెచ్. శ్రీనివాస్, డిప్యూటీ తహశీల్దార్ ఎస్ ముద్దరాజ్, ఎంఆర్ఐ నరసింహారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 22 మంది విద్యార్థులు, 32 మంది పౌరులు, 16 మంది రెవెన్యూ సిబ్బంది, 18 మంది ఇతర సిబ్బంది కలిపి మొత్తం 88 మంది లబ్ధి పొందారు.

# పీఆర్సీ, ఓపీఎస్ వెంటనే అమలు చేయాలి.

- ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలి.
- పెద్దేముల్ తహసిల్దార్ కు వినతిపత్రం అందజేత.




లోకల్ గైడ్/ తాండూర్: పిఆర్సి, ఓపిఎస్ సహా పలుడిమాండ్లను తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలని పిఆర్టియు, టీఎన్జీవోలు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ సిబ్బంది మరియు పెన్షనర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దేముల్ తహసిల్దార్ వెంకటేశ్ ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ... రాష్ట్ర శాఖ పిలుపు మేరకు,టీజీఈజేసి ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లలో పీఆర్సీ ప్రామాణికం అని దానిని జూన్ 2వ తేదీ నాటికి అమలు చేయాలని తెలిపారు.అదేవిధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ ను పునరుద్ధరించాలని అన్నారు.కాగా రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. హెల్త్ కార్డులను సైతం తక్షణమే అమలు చేయాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు చేపట్టాలని, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రతన్ సింగ్ , పిఆర్టియు పెద్దేముల్ మండల శాఖ అధ్యక్షులు పోల నవీన్ కుమార్, కార్యదర్శి బక్క వెంకట్ రెడ్డి, కార్యవర్గము ప్రాథమిక సభ్యులు,ఎంపీడీవో సిబ్బంది గీత, రఘు, ఎంఆర్సి సిబ్బంది కృష్ణ, ఎమ్మారో కార్యాలయ సిబ్బంది మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల వ్యాపారి బండి దగ్ధం.



లోకల్ గైడ్/బంట్వారం మండల పరిధిలోని సుల్తాన్పూర్ గ్రామ శివారులో శుక్రవారం అర్ధరాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అడివమ్మల గోపాల్ కూరగాయల వ్యాపారం చేస్తూ బండిపై వివిధ గ్రామాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే బండిని ఇంటి బయట ఉంచి నిద్రపోయాడు.అయితే అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు అతని బండిని ఎత్తుకెళ్లి గ్రామ శివారులో దగ్ధం చేశారు. ఈ ఘటనలో గోపాల్‌కు భారీ నష్టం వాటిల్లింది.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో గ్రామంలో ఆందోళన నెలకొంది.

# ఈనెల 19న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష.



లోకల్ గైడ్ /బంట్వారం మోడల్ స్కూల్‌లో 202627 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశ పరీక్షను ఈ నెల 19న (ఆదివారం) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బ్యూలా తెలిపారు. 6వ తరగతి అడ్మిషన్ కోసం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది.అలాగే 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ హాల్ టికెట్, ఆధార్ కార్డుతో ఉదయం 9.30 గంటలలోపు పరీక్షా కేంద్రం (మోడల్ స్కూల్, బంట్వారం) కు చేరుకోవాలని సూచించారు.విద్యార్థులు సమయానికి హాజరవ్వాలని ప్రిన్సిపాల్ కోరారు.


## దేశంలోనే గొప్ప అంతర్జాతీయ నగరంగా
# హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు

కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది -రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు & శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు,



రాజేంద్ర నగర్, ( లోకల్ గైడ్ ): దేశంలోనే గొప్ప అంతర్జాతీయ నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం రాజేంద్ర నగర్ జోన్ మైలార్దేవ్ పల్లి లో రూ. 71 కోట్లతో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జిని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. ఫలక్ నూమా బస్ డిపో నుండి మైలార్ దేవ్పల్లి వరకు 490 మీటర్ల 4 లైన్ల రోడ్డును ప్రజలకు అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఓల్డ్ సిటీ అనకుండా ఒరిజినల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. జిహెచ్ఎంసి పరిధిలోని హైదరాబాద్ ను దేశంలోనే గొప్ప అంతర్జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాలతో మహానగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. మార్పుకు చిరునామాగా కోట్లాది నిధులతో స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్ అభివృద్ధి వేగంగా కొనసాగుతుందన్నారు. ముఖ్యంగా పర్యాటక ప్రాంతంగా హైదరాబాద్ మహానగరాన్ని తీర్చిదిద్దుతున్నాంమన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దుతూ ప్రణాళిక బద్దంగా హైదరాబాద్ ను అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. రాజేంద్ర నగర్ నియోజకవర్గం లో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కి కావాల్సిన న్ని నిధులు మంజూరు వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నందుకు సీఎం రేవంత్ రెడ్డి కి స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రహమత్ బేగ్, జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, జాయింట్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్ రత్నాకర్, అధికారులు ఎస్ ఇ మోహన్ రెడ్డి, డీఈఈ సంపనీ, తదితరులు.

# కంకర రాళ్లతో విద్యార్థుల అద్భుత కళాకృతులు.



లోకల్ గైడ్/బంట్వారం మండలం తోర్మామిడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ సృజనాత్మకతతో అందరినీ ఆకట్టుకుంటున్నారు. నిత్యం కనిపించే సాధారణ కంకర రాళ్లను వినియోగించి దేవతల విగ్రహాలు, జంతువుల ఆకారాలు, శారీరక అవయవాలను విభిన్న రూపాల్లో పేర్చి అద్భుత కళాకృతులను సృష్టిస్తున్నారు. స్థానికంగా లభించే రాళ్లతోనే ఈ కళా ప్రదర్శన చేయడం విశేషంగా నిలిచింది. విద్యార్థుల ఆలోచనా విధానం, సృజనాత్మకతపై ఉపాధ్యాయులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ వార్డ్ సభ్యులు ఎం.కె.పి ఖదీర్ పాషా విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, “టాలెంట్ ఎవరి సొత్తు కాదు, ప్రయత్నం చేస్తే ప్రతి ఒక్కరిలోనూ వెలుగుతుంది” అని పేర్కొన్నారు. పిల్లలు ఇలానే ముందుకు సాగాలని కోరుతూ వారికి అభినందనలు తెలిపారు.

# ఆధారాలు చూపిస్తే భూమి వదిలేస్తా!

**- బిఆర్ఎస్ కౌన్సిలర్ల ఆరోపణలు అవాస్తవం.- తమ భూమి ప్రభుత్వానిదే అని రుజువు చేయాలి.- బ్లాక్ మేయిల్ రాజకీయాలు మానుకుంటే మంచిది.- ముస్లిం వెల్ఫేర్ నాయకులు అబ్దుల్ ఆహాద్.**



లోకల్ గైడ్ తాండూర్: మా సొంత భూమిపై కొందరు బిఆర్ఎస్ కౌన్సిలర్లు కావాలనే తప్పుదు ప్రచారాలు చేస్తున్నారని, భూమికి సంబంధించి పూర్తి ఆధారాలు చూపిస్తే తక్షణమే వదిలేస్తామని అబ్దుల్ ఆహాద్ సవాల్ చేశారు. ఒకవేళ ప్రభుత్వానిదే అని రుజువు చేస్తే కచ్చితంగా భూమిని వదిలేస్తామని తాండూరు మైనార్టీ నేత అబ్దుల్ అహద్ అన్నారు. తాండూరు మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న సర్వేనెంబర్ 130లో 36 గుంటల భూమి కాంగ్రెస్ యువ నాయకుడు అమీర్ అబ్దుల్లా ఆక్రమణకు పాల్పడ్డారని, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని గురువారం బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి శుక్రవారం అమీర్ అబ్దుల్లా తండ్రి, ముస్లిం వెల్పేర్ నాయకులు అబ్దుల్ ఆహద్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సర్వేనెంబర్ 130లోని 36 గుంటల భూమి ప్రభుత్వానిది కాదని, పట్టా భూమిని అని చెప్పుకొచ్చారు. అట్టి భూమి 1983లోనే రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని తెలిపారు. అప్పట్లో పన్నులు కూడా వసూలు చేశారని, భూమికి హద్దులు కూడా నిర్ణయించారని ఆధారాలు చూపించారు. అన్ని ఆధారాలను చూసాకే 2023లో తమ ముగ్గురు కుమారులపై రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. వివాదాలపై కోర్టుకు కూడా వెళ్లడం జరిగిందని తెలిపారు. 36 గుంటల భూమిలో చేపడుతున్న నిర్మాణాలకు మున్సిపల్ అనుమతులకు దరఖాస్తులు కూడా చేసుకున్నామని, మున్సిపల్ అనుమతులతోనే నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఒకవేళ తమ భూమిని ప్రభుత్వానిదే అని రుజువు చేస్తే ఉన్నచోటే రూపాయిలేకుండా భూమిని వదిలేస్తామని సవాల్ చేశారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు చేస్తున్న ఆరోపణలు అవాస్తమని కొట్టిపారేశారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ ఈర్షాద్ బ్లాక్ మేయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బ్లాక్ మేయిల్ రాజకీయాలు మానుకోవాలని సూచించారు. లేదంటే వారికి తగిన గుణపాఠం చెప్పే తీరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుమారులతో పాటు పలువురు మైనార్టీ నేతలు తదితరులు ఉన్నారు.

# భద్రాచలంలో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో చలివేంద్రాల ప్రారంభం




భద్రాచలం : లోకల్ గైడ్ :భద్రాద్రి జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని బాటసారులు, ప్రయాణికులు, విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు జమాతే ఇస్లామీ హింద్ భద్రాచలం శాఖ ముందుకు వచ్చింది. శుక్రవారం భద్రాచలం పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియా మరియు చర్ల రోడ్‌లోని మదీనా వుడ్ వర్క్ సమీపంలో రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిందా, జామా మసీదు ప్రధాన కార్యదర్శి సలీం హాజరై రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మతపెద్ద మునాఫ్ మాట్లాడుతూ, ప్రవక్త బోధనల ప్రకారం నీటిని దానం చేయడం ఇస్లాంలో అత్యంత శ్రేష్ఠమైన దానమని పేర్కొన్నారు. దాహంతో ఉన్న వారికి నీరు అందించడం ద్వారా అల్లా పాపాలను క్షమిస్తాడని, నీటి విలువను ప్రతి ఒక్కరూ గుర్తించి వృథా చేయకుండా వినియోగించాలన్నారు. జామీ మసీదు అధ్యక్షులు షఫీ మాట్లాడుతూ, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో ముందుండి పాల్గొంటున్న ముస్లిం యువతను అభినందించారు. త్వరలో కాలేజీ సెంటర్, బ్యాంకు రోడ్డు, జామీ మసీదు ప్రాంతాల్లో మరో మూడు చలివేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో “మానవత్వానికి ముందడుగు సహాయానికి సంసిద్ధం” సంస్థ అధ్యక్షులు వజీర్, కోశాధికారి జావిద్, మీడియా కార్యదర్శి బాబాజీతో పాటు మునాఫ్, అబ్దుల్ రెహమాన్, జానీ, ముజీబ్, మౌలాలి, మదర్ ఇర్షాద్, గౌస్, ఆసిఫ్, రబ్బానా సర్వర్, జలీల్, ఉస్మాన్, అబ్దుల్ కలాం ఫౌండేషన్‌కు చెందిన మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# జనావాసాల్లో పందుల పెంపకం..
# ఆరోగ్య సమస్యలపై స్థానికుల ఫిర్యాదు




సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)ఏప్రిల్ 17:బెజ్జంకి మండల కేంద్రంలో జనావాసాల మధ్య పందుల పెంపకం కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పందుల వల్ల దుర్వాసన, పరిసర కాలుష్యం పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పలు కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం స్థానికులు బెజ్జంకి తహసిల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో ప్రవీణ్, ఎస్ఐ సౌజన్యలకు వినతి పత్రం అందజేశారు. జనావాసాల్లో పందుల సంచారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విధంగా అధికారులు స్పందించాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు

# గడ్డం పెద్ద బకయ్య కు నీవాళ్లు అర్పిస్తున్న సీ పీ ఐ (ఎం )నాయకులు

**-మార్కిస్టు సిద్ధాంతంపై విశ్వాసం కల్గిన గడ్డం బక్కయ్య**

**-ఎర్రజెండాతోనే ప్రజాసమస్యల పరిష్కారం**



ఖమ్మం జిల్లా,కారేపల్లి: లోకల్ గైడ్, ఏప్రిల్ 17 : మార్కిస్టు సిద్దాంతంపై విశ్వాసం ఉన్న నేత గడ్డం పెద్ద బక్కయ్య అన్ని ఖమ్మం జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు అని అన్నారు. సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు గడ్డం బక్కయ్యఅనారోగ్యంతో మఅతి చెందారు. ఆయన మృతదేహాన్ని శుక్రవారం సందర్శించి పార్టీ పతకాన్ని కప్పి నివాళ్లు ఆర్పించారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ బానోత్ బన్సీలాల్ అధ్యక్షత జరిగిన సంతాప సభలో మెరుగు సత్యనారాయణ, కొండెబోయిన నాగేశ్వరరావు లు మాట్లాడుతూ ఉసిరికాయలపల్లి ప్రాంతంలో భూస్వామ్య పెత్తందారి విధానాలకు వ్యతిరేకంగా భూ పోరాటాలతో పాటు తునికాకు, కూలి రేట్లు, పాలేరుల వేతనాలు, సింగరేణి కాలరీస్ భూ నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు, గ్రామ అభివఅద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) చేసిన పోరాటాల్లో గడ్డం పెద్దబక్కయ్య చురుకైన పాత్ర పోషించారన్నారు. బక్కయ్య మఅతి కుటుంబానికే కాక పార్టీ కూడా తీరని లోటన్నారు. ఎర్రజెండాతోనే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సమాజ మార్పు కమ్యూనిస్టులతోనే సాధ్యమన్నారు. సీపీఐ(ఎం) సిద్ధాంతం పై అంచలంచల విశ్వాసంతో తుది వరకు పార్టీ సభ్యుడిగా కొనసాగిన కామ్రేడ్ బక్కయ్యను ఆదర్శంగా తీసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ హామీల అమలుకై ప్రజల్ని సమీకరించి పోరాటం నిర్వాహిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాసరావు. ఎసఏ నబి, ఆలేటి కిరణ్, మండల నాయకులు దాసరి మల్లయ్య, తేజావత్ చందర్, దాసరి సైదులు, పచ్చిపాల నరసింహారావు, పచ్చిపాల యాకేశ్వరరావు, స్థానిక సర్పంచ్ గూగులోత్ వరలక్ష్మిరాజు, మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు పచ్చిపాల సోమయ్య, రెడ్డెబోయిన జగ్గయ్య, గడ్డం విశ్వనాథం, బోడ రవి, కొమ్ము వెంకన్న, గుంపెనపల్లి నాగేశ్వరరావు, మోరపాక శ్రీను, ఎల్లబోయిన రామారావు, వెంకట్, శ్రీను, సెట్‌రాం, కొమరయ్య, యశోదమ్మ, సరమ్మ, ధనమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల గోసపై వెంటనే చర్యలు.. మార్క్‌ఫెడ్ అధికారులతో హరీష్‌రావు చర్చలు


**అధికారంలో లేకపోయినా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతుంది: హరీష్‌రావు**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి(లోకల్ గైడ్) ఏప్రిల్ 17: బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామ రైతులు మక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తమ సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో గ్రామ మాజీ సర్పంచ్ నలువాల స్వామి ఆధ్వర్యంలో సుమారు 100 మంది రైతులు నాలుగు రోజుల క్రితం మాజీ మంత్రి టి హరీశ్ రావ్ ను కలిసి వినతి పత్రము సమర్పించారు. రైతుల సమస్యను ఆలకించిన హరీష్‌రావు వెంటనే మార్క్‌ఫెడ్ అధికారులు మరియు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల ఇబ్బందులను తొందరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, తమ సమస్యపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని అధికారులతో చర్చించిన మాజీ మంత్రి హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం కొనసాగుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు.

# గిరిజనులపై సింగరేణి సంస్థ , ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం ఆపాలి

-గుమ్మడి సందీప్ టేకులగూడెం గ్రామ సర్పంచ్



ఖమ్మం జిల్లా, కారేపల్లి : లోకల్ గైడ్, ఏప్రిల్ 17 : ఏళ్ల తరబడి తమ భూములను సాగు చేసుకుంటూ రెవిన్యూ నుండి పట్టాలు పొందినా ఆ భూములపై మీకు హక్కు లేదంటూ సింగరేణి సంస్థ భూములను ఆక్రమించేందుకు గిరిజనులపై పోలీసు బలగాలని ఉసిగొల్పి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని గ్రామ సర్పంచ్ గుమ్మడి సందీప్ అన్నారు. శుక్రవారం టెకులగూడెం గిరిజన రైతులు సింగరేణి సంస్థ ఆక్రమించే భూముల వద్ద నిరసన తెలియజేశారు. టేకులగూడెం గ్రామానికి చెందిన 30 మంది గిరిజనుల భూమి సుమారు 20 ఎకరాల భూమిని ఆక్రమించేందుకు సింగరేణి సంస్థ,ఫారెస్ట్ అధికారులు కుమ్మక్కై రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో రైతుల భూముల చుట్టూ కందకాలు తవ్వి బొందల గడ్డగా మార్చి రైతులను తీవ్రంగా నష్టం చేసి 2002లో ఓసి పనులను నిలిపివేసి వెళ్లిపోయిన సింగరైన సంస్థ 30 సంవత్సరాల తర్వాత రైతులు సాగు చేసుకునే భూములను గుంజుకోవడానికి ప్రయత్నం చేయడం సిగ్గుచేటని ఆయన అన్నారు. తమ ఆధీనంలో ఉన్న భూములకు రెవెన్యూ శాఖ సర్వేలు నిర్వహించి పట్టాలు ఇచ్చినప్పటికీ సింగరేణి సంస్థ భూములను గుంజు కోవడానికి దూకుడుగా ముందుకు వస్తుందని అన్నారు. గిరిజనుల హక్కుల ప్రకారం 1/70 యాక్ట్ లో మూడు సంవత్సరాలు గిరిజనుల ఆధీనంలో భూమి ఉంటే ఆ భూమి గిరిజనులకే సొంతమని ఉన్నప్పటికీ చట్టాలను లెక్కచేయకుండా సింగరేణి సంస్థ,ఫారెస్ట్ అధికారులు రైతుల భూమిని గుంజుకుంటున్నారని వారికి ఈ హక్కు ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ భూముల మధ్యలో ఉన్న రహదారికి రెండు సంవత్సరాల క్రితం కాంగ్రెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెండు కోట్ల రూపాయల వ్యయం తో శంకుస్థాపన చేశారని ఆ రహదారిని సైతం బ్లాక్ చేయడానికి సింగరేణి అధికారులు పూనుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రహదారిని మూసివేస్తే అనేక గ్రామాలకు ప్రయాణం చేసే ప్రజలు, వాహనాలు ప్రయాణం చేయడానికి ఆటంకం ఏర్పడుతుందని అన్నారు. గిరిజన చట్టాలకు తూట్లు పొడిచి గిరిజన ప్రజలను నష్టం చేయాలని చూస్తే ఊరుకోమని ఆయన హెచ్చరించారు. ఈ భూములపై గ్రామసభ తీర్మానం ఆమోదం లేకుండా సింగరేణి సంస్థ అధికారులు భూములను ఆక్రమించడానికి కవ్వింపు చర్యలకు పాల్పడితే జరిగే పరిణామాలకు వారే బాధ్యత వహించాలని అన్నారు. ఆ భూములపై ప్రజలకు ఉన్న హక్కులతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి చట్టబద్ధంగా తగిన బుద్ధి వారికి చెబుతామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి భూముల జోలికి రాకుండా సింగరేణి సంస్థను ఆపు చేసి అనేక గ్రామాలకు ప్రయాణించే రహదారి ఏర్పాట్ల పనులను పూర్తిచేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో టేకులగూడెం ఉపసర్పంచ్ బిక్కసాని భాస్కరరావు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ గ్రామ కార్యదర్శి గుగ్గిల రాము గుమ్మడి ఎర్రయ్య మూర్తి ప్రకాష్ పాయం రవి భూక్య రాంజీ గొగ్గల రామారావు మూడు శంకర్ మూడు కృష్ణమూర్తి అలాగే రాగబోయిన గూడెం ఆటో యూనియన్ నాయకులు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడమే పోలీసుల ప్రథమ లక్ష్యం

.....ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి

**అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ తనిఖీ, కేసుల పురోగతి, శాంతిభద్రతలపై సమీక్ష**




అశ్వారావుపేట, లోకల్ గైడ్ : పోలీస్ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని పెంచేలా ప్రతి అధికారి నిబద్ధతతో పనిచేయాలని మల్టీ జోన్-1 ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి ఐపీఎస్ సూచించారు. శుక్రవారం ఆయన అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, స్టేషన్ పనితీరును కూలంకషంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల సౌమ్యంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం చేయాలని ఐజీ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించి, విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేరాల నియంత్రణలో టెక్నాలజీ కీలకమని, సీసీటీవీ కెమెరాల నిఘాను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అశ్వారావుపేట పరిధిలో జరుగుతున్న రహదారి ప్రమాదాలపై ఐజీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి, అక్కడ హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొంటున్న ఒత్తిడి, సమస్యలను ఐజీ అడిగి తెలుసుకున్నారు. పని ఒత్తిడిని అధిగమించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ, క్రమశిక్షణతో కూడిన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. నిబద్ధతతో పనిచేసే సిబ్బందికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం, స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట సీఐ నాగరాజు, ఎస్సైలు యాయాతి రాజు, అఖిల, దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేసుల బెదిరింపులుడ వీడియో కాల్ విచారణ నాటకం

‘డిజిటల్ అరెస్ట్’ పేరుతో వృద్ధుడి వద్ద నుంచి రూ.42 లక్షల దోపిడి ( కంబోడియా నెట్‌వర్క్‌లో చేరిన నిందితుడు అవినాష్ అరెస్ట్ రూ.12 లక్షలు స్వాధీనం




సైబరాబాద్, ఏప్రిల్ 17 (లోకల్ గైడ్): కేసుల బెదిరింపులు, వీడియో కాల్ విచారణ నాటకంతో వృద్ధుడిని మోసం చేసి రూ.42 లక్షలు దోచుకున్న సైబర్ మోసం కేసులో ప్రధాన నిందితుడిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్ వెల్లడించారు. గజర్ల అవినాష్ అనే నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.12 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బాలానగర్ ప్రాంతానికి చెందిన సదానందం అనే వృద్ధుడిని లక్ష్యంగా చేసుకుని ఈ మోసం జరిపినట్లు వివరించారు.లి వీడియో కాల్ విచారణ పేరుతో భయభ్రాంతులుఫిబ్రవరిలో వృద్ధుడికి ఫోన్ చేసిన నిందితుడు, అతని మొబైల్ నెంబర్‌పై 17 కేసులు ఉన్నాయని చెప్పి భయపెట్టాడు. ఇంట్లోనే విచారణ జరుగుతుందని హెచ్చరించి వీడియో కాల్‌లో మరో వ్యక్తిని ప్రవేశపెట్టి విచారణ పేరుతో మానసిక ఒత్తిడి తీసుకొచ్చాడు. ఇలా ‘డిజిటల్ అరెస్ట్’ పేరుతో నిరంతరం పర్యవేక్షణలో ఉన్నట్టుగా భావింపజేసి వృద్ధుడిని భయభ్రాంతులకు గురిచేశాడు.లి 15 రోజుల పాటు మానసిక నిర్బంధందాదాపు 15 రోజుల పాటు నిరంతర కాల్స్, వీడియో కాల్స్ ద్వారా వృద్ధుడిని మానసికంగా వేధిస్తూ బయటకు వెళ్లకుండా, ఇతరులతో మాట్లాడకుండా ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ క్రమంలో వృద్ధుడు పూర్తిగా నిందితుల మాటలను నమ్మే పరిస్థితికి చేరుకున్నాడు.లి విడతలవారీగా రూ.42 లక్షల మళ్లింపునిందితుల సూచనల మేరకు బాధితుడు విడతల వారీగా రూ.42 లక్షలను నాలుగు మ్యూల్ అకౌంట్లలో జమ చేశాడు. ఈ డబ్బును తర్వాత వివిధ ఖాతాల ద్వారా మళ్లించి నిందితులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.లి కంబోడియా నుంచి నడిచిన మోసాల వలయండేటా ఎంట్రీ ఉద్యోగం పేరుతో కంబోడియా వెళ్లిన అవినాష్ అక్కడ భారతీయులను లక్ష్యంగా చేసుకున్న సైబర్ మోసాల గ్యాంగ్‌లో చేరాడు. మొదట కమిషన్ ఆధారంగా పనిచేసి, తర్వాత స్వయంగా మోసాలు చేయడం ప్రారంభించాడు. విదేశాల నుంచి కాల్స్ చేసి, డబ్బును భారత్‌లోని మ్యూల్ ఖాతాలకు మళ్లించే విధానాన్ని అనుసరించినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా దర్యాప్తుడ కీలక లింక్ బట్టబయలుఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు వైజాగ్, ముంబయి ప్రాంతాలకు వెళ్లి విచారణ చేపట్టారు. ఇదే కేసులో ముందుగా అరెస్ట్ చేసిన నలుగురిని విచారించగా అవినాష్ పాత్ర వెలుగులోకి వచ్చింది. మార్చిలో భారత్‌కు వస్తున్నాడన్న సమాచారంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు.లి రూ.12 లక్షల రికవరీడ మరిన్ని కేసులపై అనుమానంఅరెస్ట్ సమయంలో కమిషన్ రూపంలో పొందిన రూ.12 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై మరికొన్ని కేసులు ఉన్నట్లు అనుమానిస్తున్నామని, వాటిపై విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ‘డిజిటల్ అరెస్ట్’ అనే మోసండ అప్రమత్తత అవసరండిజిటల్ అరెస్ట్ అనే వ్యవస్థ ఎక్కడా లేదని, ఇలాంటి కాల్స్ పూర్తిగా మోసపూరితమని డీసీపీ సాయి మనోహర్ స్పష్టం చేశారు. ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ ద్వారా బెదిరించి డబ్బులు అడిగితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తరహా కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి డబ్బును సీజ్ చేయడం ఇదే మొదటిసారి కావడం విశేషంగా నిలిచింది.

# ప్రభుత్వఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించండి -ఉద్యోగ జే ఏ సీ నాయకుల వినతి .



( లోకల్ గైడ్ కొందుర్గ్ )తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపుతో పాటు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల జే ఏ సీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఉద్యోగ జే ఏ సీ నాయకులు శుక్రవారం కొందుర్గు మండలం తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రధానంగా ఉద్యోగుల పెండింగ్ డిఎ, ఇతర బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా జూన్ రెండు లోపు కొత్త పిఆర్సి అమలు చేయడంతో పాటు ఎంప్లాయి హెల్త్ స్కీం మే 1 నుంచి అమలు చేయాలని కోరారు. పెండింగ్ బిల్లుల కోసం ఎన్నాళ్ళు ఎదురు చూడాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమం లో కొందర్గు మండల పిఆర్టియు అధ్యక్షులు నాజర్ అలీ, ప్రధాన కార్యదర్శి వంశీధర్ రెడ్డి ,రాష్ట్ర నాయకులు బాలరాజ్, వెంకట్రావు, మహిళా నాయకురాళ్లు అఖిల, సురేఖ, అనురాధ యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## అక్రమ తవ్వకాల నియంత్రణలో మధ్యప్రదేశ్ వైఫల్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ : రక్షిత జాతీయ అభయారణ్యం చంబల్ లో అక్రమంగా జరుగుతున్న ఇసుకతవ్వకాలను అడ్డుకోవడంలో విఫలమైన మధ్య్రపదేశ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. నిందితులపై విచారణ చేపట్టడంలో విఫలం కావడంతో, పారామిలటరీ బలగాలను మోహరించనున్నట్లు కోర్టుకు వెల్లడించడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల ఘోర వైఫల్యం కారణంగానే పర్యావరణ పరంగా సున్నితమైన ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని మండిపడింది. చంబల్ ఘరియల్ అభయారణ్యం ఈ మూడు రాష్ట్రాల పరిధిలోకి వస్తుంది. ఈ కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించిన సంగతి తెలిసిందే. ఆ ప్రాంతంలో ఇసుక తవ్వకాలపై తరుచుగా వినియోగించే మార్గాల వెంబడి వాహనాలక కదలికలను పర్యవేక్షించేందుకు జిపిఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అలాగే పైలెట్ ప్రాజెక్టుగా అభయారణ్యంలోని కీలక ప్రాంతాల్లో సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ ఫుటేజీలను నేరుగా జిల్లా మెజిస్ట్రేట్, పోలీస్ స్టేషన్లకు వెళ్లేలా చూడాలని తెలిపింది. ఏవిధమైన ఉల్లంఘన జరిగినా ఇసుక తరలింపు వాహనాలను జప్తు చేస్తామని, తిరిగి సుప్రీంకోర్టు అనుమతితోనే వాటిని విడుదల చేయడం సాధ్యమవుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కేసు తదుపరి విచారణను మే 11కి వాయిదా వేసింది. ఏప్రిల్ 13న, జరిగిన పరిణామాల తీరు, గనుల తవ్వకం దారులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, నేరపూరిత కార్యకలాపాల్లో మధ్యప్రదేశ్ ప్రభుత్వ వైఫల్యాన్ని, సహకారాన్ని వెల్లడిస్తుందని పేర్కొంది.

## సమాఖ్య వ్యవస్థపై అతిపెద్ద దాడి : కనిమొళి



న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ ముసుగులో ప్రవేశపెట్టిన మూడు కీలక బిల్లులు సమాఖ్య వ్యవస్థపై జరుగుతున్న అతిపెద్ద దాడిగా డిఎంకె ఎంపి కనిమొళి విమర్శించారు. ఈ బిల్లుపై నిరసన వ్యక్తం చేస్తూ ప్రతిపక్షాలు శుక్రవారం నల్లరంగు దుస్తులును ధరించి లోక్ సభకు హాజరయ్యారు. పార్లమెంటులో మహిళా రిజర్వేజన్ బిల్లుపై చర్చ సందర్భంగా కనిమొళి మాట్లాడారు. నారీ శక్తి వందన అధినియమ్, 2023ని గురువారం రాత్రి గెజిట్ లో నోటిఫై చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విమర్శించారు. తాను కేవలం డిఎంకె ప్రతినిధిగానే కాకుండా, ఎన్నికల్లో తమ ఓట్లకు విలువ ఉండదని, పార్లమెంటులో తమ గొంతు నొక్కబడుతుందని వెల్లడించిన ఎనిమిది కోట్ల మంది ప్రజల ప్రతినిధిగా నిలబడతానని అన్నారు. కేంద్రం చర్య దిగ్భ్రాంతికరమని, పార్లమెంటులో ఈ బిల్లుపై చర్చ చేపడుతుండగా, నిన్న దీనిపై నోటిఫై చేయాల్సిన అవసరం ఏమిటని అన్నారు. ఈ సభ పట్ల కేంద్రానికి గౌరవం లేదా అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ ముసుగులో ప్రవేశపెట్టిన మూడు కీలక బిల్లులు సమాఖ్య వ్యవస్థపై జరుగుతున్న అతిపెద్ద దాడి అని మండిపడ్డారు. జనాభా ఆధారిత నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడులో సంతానోత్పత్తి రేటు 1.6కి తగ్గిందని, తమ రాష్ట్రం జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలకు ఇచ్చిన వాగ్దానమని అన్నారు. బిజెపి దాడిని ఎదిరించి, అభివృద్ధిలో ఈ ఐదు రాష్ట్రాలు ఆదర్శంగా నిలిచాయని అన్నారు. జనాభాను నియంత్రించాలన్న కేంద్ర ప్రభుత్వ పిలుపుకు కట్టుబడి ఉన్నామని అన్నారు. సంతానోత్పత్తి రేటు తగ్గిందని అన్నారు. 2001లో దక్షిణాది రాష్ట్రాల ప్రజల గొంతు విన్న ప్రభుత్వం అధికారంలో ఉందని, అన్యాయాన్ని పరిష్కరించాల్సిన అవసరం ఉందని అప్పటి పార్లమెంటు గ్రహించినందువలన మరో 24 ఏళ్ల గడువు ఇచ్చిందని అన్నారు. ఇప్పుడు సీట్లను 850కి ఎందుకు పెంచాలని ప్రశ్నించారు. జనాభా స్వరూపం మారిందని, పునర్విభజనకు 15 ఏళ్ల నాటి 2011 జనాభా లెక్కల డేటాను ఎందుకు వినియోగిస్తున్నారు. మాటలకు, చేతలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

## తల్లి, చెల్లిని గుర్తుచేసుకుని ఓటేయండి : మోడీ



న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ చట్ట సవరణలపై కీలకమైన ఓటింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రధాని మోడీ శుక్రవారం లోక్‌సభ ఎంపీలందరికీ ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దయచేసి మీ కుటుంబాల్లోని మహిళలను గుర్తుచేసుకుంటూ.. మీ మనస్సాక్షిగా ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయండి. శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్ కల్పించే ఈ చట్టం, మన దేశంలోని మహిళలకు న్యాయం చేయడానికి లభించిన ఒక గొప్ప అవకాశం. దయచేసి మన నారీశక్తికి కొత్త అవకాశాలను దూరం చేయవద్దు. ఈ సవరణ ఏకగ్రీవంగా ఆమోదం పొందితే, అది మన దేశ మహిళలకు మరింత సాధికారతను కల్పించి, మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది అని మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. చరిత్ర సృష్టించడానికి ఈ రోజు మనమందరం ఏకమవుదాం. దేశ జనాభాలో సగంగా ఉన్న భారతదేశ మహిళలు తమకు దక్కాల్సిన న్యాయమైన హక్కులను పొందేలా చూద్దాం. ఇంట్లో ఉన్న మీ తల్లి, సోదరి, కుమార్తె, లేదా భార్యను దృష్టిలో ఉంచుకుని మీ మనస్సాక్షి చెప్పిన మాట విని మహిళా కోటా బిల్లుకు ఓటు వేయండి అని మోడీ ఎక్స్ పోస్టులు లోక్‌సభ ఎంపీలకు విజ్ఞప్తి చేశారు.

## సొంత పార్టీ నేతలపై రాఘవ్ చద్దా సెటైర్లు




ఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌పై చర్చ కొనసాగుతోంది.అయితే, ఈ కీలక బిల్లలుపై చర్చ జరిగే సమయంలో సొంత పార్టీ నేతల గైర్హాజరుపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా సెటైర్లు వేశారు. రాజ్యసభ ఉపనాయకుడి పదవి నుంచి నన్ను తొలగించారు. అయినా సరే మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌పై చర్చ జరుగుతుంటే సభకు నేను హాజరయ్యాను. మరి వాళ్లద్దరేరి అంటూ ఆప్ పార్టీ ప్రతినిధి, పార్టీ నూతన రాజ్య సభ ఉపనాయకుడిని ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. నా పార్టీకి చెందిన నాయకుడు, నా స్థానంలో కొత్త నియమితులైన ఉప నాయకుడు కూడా సభలో లేరు. ఆప్ ఇటీవల తొలగించబడిన ఉప నాయకుడిని నేను. నేను సభలోనే ఉన్నాను. నాకు మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు' అని అన్నారు. రాజ్యసభలో ఆప్ ఉప నాయకుడి పదవి నుంచి చద్దాను ఇటీవల తొలగించడంతో పాటు, సభలో ఆయన మాట్లాడే సమయాన్ని కూడా పార్టీ తగ్గించిందని ఆరోపణలు వచ్చాయి. ఈ నిర్ణయంపై పార్టీలో విభేదాలు ఉన్నాయన్న ఊహాగానాలకు ఈ పరిణామం ఆజ్యం పోసింది.

# రుతుపవనాల దగా?




ఒక్కోసారి కష్టాలు కూడబలుక్కుని వస్తాయంటారు. అసలే అమెరికా, ఇజ్రాయెల్ దురాక్రమణ యుద్ధాలతో ఏటికి ఎదురీదుతున్న ప్రపంచంపై ఈసారి ప్రకృతి కూడా పగబట్టినట్టు కనబడుతోంది. రాగల కాలంలో వాతావరణ పరిస్థితుల గురించి భారత వాతావరణ విభాగం(ఐఎండీ), ప్రపంచ వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటించిన అంచనాలు భయపెడుతున్నాయి. భూమధ్యరేఖ వద్ద పసిఫిక్ మహాసముద్ర జలాల్లో అత్యంత తీవ్రమైన ఎల్ నినో ఏర్పడే అవకాశం ఉన్నందువల్ల ఉష్ణోగ్రతలు భారీగా పెరగటంతోపాటు అనూహ్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయని ప్రపంచ వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించగా, మన దేశంలో రుతుపవనాలు బలహీనపడి సాధారణంకన్నా తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ ప్రకటించింది. ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ సైతం ఇదేవిధంగా చెబుతోంది. వైద్య పరిభాష మాదిరే వాతావరణానికి సంబంధించిన పరిభాష కూడా సామాన్యులకు కొరుకుడు పడదు. 'సాధారణంకన్నా తక్కువ' వర్షపాతం ఉంటుందంటే-- తీవ్ర కరవు పరిస్థితులు ఏర్పడతాయని. మన దేశంలో 60 శాతంమంది రైతులు ఖరీఫ్ సీజన్‌లో పూర్తిగా రుతుపవనాల వర్షాలపైనే ఆధారపడతారు. శాస్త్రవేత్తల అంచనా నిజమైతే ఇప్పటికే అనేకచోట్ల వడగళ్లుపడి, వర్షాలు కురిసి నష్టపోయిన రైతులకు ఇది సహజంగానే గోరుచుట్టుపై రోకటి పోటువంటి దవుతుంది. ఒకప్పుడు 'వాన రాకడ... ప్రాణం పోకడ' ఎవరికీ తెలియదనేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. కనీసం మూడురోజులముందే వాన ఎక్కడెక్కడ పడే అవకాశం ఉన్నదో, దాని తీవ్రత ఎలావుంటుందో అంచనా వేస్తున్నారు. తుపాన్లు, ఉప్పెనలు, సునామీలు వంటివి ముందస్తుగా పసిగట్టి వాటివల్ల కలిగే నష్టాన్ని కనిష్ఠ స్థాయికి ఉంచగలుగుతున్నారు. అలాగని అన్నీ కచ్చితంగా చెప్పటం ఇంకా సాధ్యపడటం లేదు. ప్రకృతిని అంచనా వేయటం జూదంలాంటిది. అది అర్థమైనట్టే కనబడుతుంది. తీరా కొన్ని సందర్భాల్లో అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తుంది. అలాగని ఏమరుపాటుతో ఉంటే ముంచేస్తుంది. అందుకే సమస్యలొస్తాయన్న అంచనాలతో ముందస్తు చర్యలు ఎప్పుడూ తప్పనిసరవుతాయి. అయితే ప్రస్తుత అంచనాలు ప్రాథమికమైనవి. వచ్చే నెలాఖరు నాటికి మరికొంత స్పష్టత వస్తుంది. ఎల్ నినో ఏర్పడటానికీ, రుతుపవనాలు బలహీనపడటానికీ మధ్య బలమైన సంబంధం ఉంది. గత 70 ఏళ్లలో 17 సార్లు ఎల్ నినో ఏర్పడితే అయిదుసార్లు సాధారణం లేదా అంతకన్నా ఎక్కువ వర్షాలు కురిశాయి. మిగిలిన సంవత్సరాల్లో తక్కువ వర్షపాతమే నమోదైంది. గ్రామీణ భారతంలో మెజారిటీ ప్రజానీకం వ్యవసా యంపై ఆధారపడతారు. అందువల్లే వర్షాలుపడక కరువుకాటకాలు ఏర్పడితే దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌వంటి ఒకటి రెండు రాష్ట్రాల్లో వానలు లేకపోవడం లేదా అకాల వర్షాలు పడటం కారణంగా పంటలు దెబ్బతిన్నాయిగానీ... దేశవ్యాప్తంగా గత రెండేళ్లుగా వర్షపాతం బాగానే ఉంది. సాగు దిగుబడి పెరిగింది. ఆహార ధరలు అదుపులో ఉన్నాయి. అందువల్లే రిజర్వ్‌బ్యాంకు వడ్డీరేట్లు తగ్గించింది. కానీ ఇదంతా తారుమారైతే ఆహార ద్రవ్యోల్బణం పెరిగి, వడ్డీరేట్లు మళ్లీ పైపైకి పోతాయి. నిజానికి ఇరాన్ యుద్ధంవల్ల ఇప్పటికే ఆ పరిస్థితి ఉంది. మన దేశానికి సంబంధించి కేవలం ఎల్ నినో ఒక్కటే నిర్ణాయక శక్తి కాదు. హిందూమహాసముద్రంలో పశ్చిమ(ఆఫ్రికా వైపు), తూర్పు(ఇండొనేసియా వైపు) ప్రాంతాలమధ్య ఉండే ఉష్ణోగ్రతల వ్యత్యాసం వల్ల అనుకూల, ప్రతికూల, తటస్థ ద్విధ్రువ (డైపోల్) స్థితులు ఏర్పడవచ్చు. అనుకూల స్థితి ఎల్ నినోవల్ల ముందుకు కదల్లేని రుతుపవనాలకు బలం చేకూర్చి భారత్ వైపు వచ్చేలా చేస్తుంది. మిగిలిన రెండూ అందుకు భిన్నమైన ఫలితాలనిస్తాయి. దానికితోడు యురేసియా ప్రాంతంలో ఈసారి మంచుకవచం తక్కువుందంటున్నారు. దాన్ని పరిగణనలోకి తీసుకుంటే రుతుపవనాలు మెరుగ్గానే ఉంటాయనుకోవచ్చు. ఏదేమైనా ఈసారి రుతుపవనాలపై ఏ ప్రభావాలు బలంగా పనిచేస్తాయో, వాటి ఫలితాలెలా ఉంటాయో పెద్ద సస్పెన్స్. అంతా సవ్యంగా ఉండాలని కోరుకోవటం మినహా ఎవరైనా చేయగలిగిందేమీ లేదు.

# డీ-లిమిటేషన్.. హైబ్రిడ్ పరిష్కారం!

దేశ రాజకీయ దిశను, రాష్ట్రాల మధ్య అధికార సమతుల్యతను శాసించే పెనుమార్పు కానున్నది. జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించాలనే రాజ్యాంగ సూత్రానికి, అభివృద్ధి చెందిన రాష్ట్రాల రాజకీయ ఉనికికి మధ్య జరుగుతున్న ఈ పోరాటంలో 'మధ్యేమార్గం' వెతకాల్సిన బాధ్యత నేటి నాయకత్వంపై ఉంది. కేంద్రం లెక్కల ప్రకారం ఇప్పుడున్న పార్లమెంట్ సీట్లు 543ను 50 శాతం పెంచుతూ 850కి తేబోతున్నది. అందులో కేంద్రపాలిత ప్రాంతాలకు 35 సీట్లు కేటాయించింది. ఇక రాష్ట్రాలకు 815 సీట్లు దక్కనున్నాయి. అయితే, ఏ ప్రాతిపదికన ఈ సీట్లను పెంచుతున్నారనే విషయం స్పష్టంగా చెప్పడం లేదు. ఒక పక్క ఎంపీ సీట్లను 1971లో జరిగిన జనాభా లెక్కన ప్రకారం డీలిమిటేషన్ చేశారు. ఆ తర్వాత ఎలాంటి మార్పులు చేయలేదు. 2011లో జనాభా లెక్కలు జరిగినా.. ఆ తర్వాత జనాభా ఎన్యూమరేషన్ జరగనేలేదు. 2026లో జనాభా లెక్కించే ప్రక్రియ మొదలుకానున్న సమయంలోనే ఈ డీలిమిటేషన్ తీసుకురావడమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అందులోనే మహిళా బిల్లును తెస్తా మనడం వల్ల గందరగోళంగా మారింది. కేంద్రం నియోజక వర్గాల సంఖ్య పెంచాలన్న ఉద్దేశం సరైనదే.. కానీ, అవలంబిస్తున్న విధానంపైనే దక్షిణాది రాష్ట్రాల్లో వ్యతిరేకత వస్తున్నది.

### డీలిమిటేషన్ అవసరమే.. కానీ,

1950లో ఒక ఎంపీ దాదాపు 5 లక్షల నుంచి 7.5 లక్షల మందికి ప్రాతినిధ్యం వహించేవారు. ఇప్పుడు అది ఏకంగా కొన్ని నియోజకవర్గాల్లో 30 లక్షలకు మించి పోయింది. దీనివల్ల ఓటరు ప్రయోజనాలకు గండిపడుతున్నది. ఒకవేళ జనాభా ప్రాతిపదికను మాత్రమే కొలమానంగా తీసుకుంటే అభివృద్ధి చెందుతున్న లేదా జీడీపీ ఎక్కువగా ఉన్న రాష్ట్రాల ప్రయోజనాలకు ఇప్పుడు కాకున్నా.. భవిష్యత్తులో నష్టం వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. అందుకే దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక సీఎంలు ఫెడరల్ స్ఫూర్తికి పూర్తిగా విఘాతమని ప్రకటించారు. కానీ, విధానంలో మార్పులను సూచించలేదు. ఏపీ సీఎం చంద్రబాబు దక్షిణాదిలో వృద్ధుల జనాభా పెరుగుతున్నదని.. డివిడెండ్‌లా కేంద్రం గ్రాంట్ ఇవ్వాలని మాత్రం సూచించా రు. అయితే, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం




హైబ్రిడ్ విధానాన్ని ప్రో-రేటా పద్ధతిలో విభజన చేయవచ్చని విశ్లేషించారు.. కేంద్రం డీలిమిటేషన్ ప్రకారం ఉదాహరణకు 100సీట్లు పెంచాలని అనుకుంటే అందులో 50 శాతం 50 సీట్లు జనాభా ఆధారంగా పెంచాలి. మిగతా 50సీట్లు ఆదాయం వస్తున్న రాష్ట్రాలకు మాత్రమే పెంచాలి. దీనివల్ల ఆదాయం వస్తున్న రాష్ట్రాలకు చట్టసభల్లో తగిన గౌరవం కల్పించినట్టు అవుతుంది. లేదంటే ఉత్తరాదిలోని నాలుగైదు రాష్ట్రాల మద్దతు ఉంటే చాలు.. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు అనే పరిస్థితి వస్తే, దక్షిణాది రాష్ట్రాల గొంతు పార్లమెంట్‌లో అరణ్య రోదనగానే మిగిలే ప్రమాదం ఉన్నది.

### ఫెడరల్ స్ఫూర్తికి 'విప్' విఘాతం

కేంద్రం చేస్తున్న వాదన ప్రకారం.. ఉత్తరాది అయినా, దక్షిణాది అయినా ఆయా రాష్ట్రాల్లో ఉన్న సంఖ్యలో 50 శాతం పెరుగుతుంది.. దానివల్ల నష్టమేంటన్న ప్రశ్నలు వస్తున్నాయి. కానీ, చట్టసభల్లో ప్రాతినిధ్యం ఒక్కటే కాదు.. నియోజకవర్గాల నిధులు సహా ఎన్నో విషయాల్లో భారీ మార్పులు జరుగుతాయి. అందులో దక్షిణాదికి తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉన్నది. ముఖ్యంగా ఏదైనా బిల్లు విషయంలో అధికార పార్టీ చెప్పిందే ఎంపీలు చేయాల్సి వస్తుంది. సభ్యులు ఎక్కువ ఉన్న ఉత్తరాదికే ఏ పార్టీ అయినా ప్రాధాన్యం ఇవ్వక తప్పదు.. అది అధికారంలో ఉన్నదైనా, ప్రతిపక్షంలో ఉన్నదైనా 'ఓట్ పోలరైజేషన్' రాజకీయాలకే మక్కువ చూపిస్తారు. దానివల్ల అనివార్యంగా దక్షిణాది ప్రయోజనాలకు తూట్లు పడక తప్పదు. రాష్ట్ర ప్రయోజనాలకు మరో ముఖ్యమైన అడ్డంకి 'విప్'.. మనదేశంలో దక్షిణాది ప్రజల సంశయాలు పోగొట్టాలంటే ప్రతి బిల్లుకు విప్ జారీ చేసే సంస్కృతిని కేంద్ర ప్రభుత్వమే పక్కనబెట్టాలి. ముఖ్యమైన బిల్లులకు మాత్రమే విప్ జారీ చేయాలి. ఫలితంగా ప్రాంతీయ అసమానతలకు కారణమయ్యే బిల్లుల విషయంలో ఎంపీలు స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటారు. వాళ్లు దొంగ ఓటు వేయాల్సిన అవసరం లేదు.. ప్రాంతీయ ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకుంటున్నామని బహిరంగంగా ఓటు వేయాలి. దీనివల్ల దక్షిణాది ప్రయోజనాలకు భవిష్యత్తులోనూ నష్టం జరగకుండా ఉంటుంది.

### 'హైబ్రిడ్' ఫార్ములా.. 50:25:25

ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి కేవలం జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా శాస్త్రీయమైన వెయిటేజీ విధానం అమలు చేయాలి.. అంటే జనాభా ప్రాతిపదికన పెంచే సీట్లను 50 శాతానికి పరిమితం చేయాలి. దేశాభి వృద్ధికి నిధులు సమకూరుస్తున్న రాష్ట్రాలను ప్రోత్సహించడానికి 25 శాతం సీట్లు కేటాయించాలి. సామాజిక అభివృద్ధిని కూడా దృష్టిలో పెట్టుకుని విద్య, ఆరోగ్యం, జనాభా నియంత్రణలో రాణించిన రాష్ట్రాలకు గుర్తింపుగా మిగిలిన 25 శాతం సీట్లు కేటాయించాలి. ఈ పద్ధతి వల్ల ఉత్తర-దక్షిణ రాష్ట్రాల మధ్య సీట్ల పంపిణీలో సమతుల్యత ఏర్పడుతుంది. అంతే కాకుండా మిగితా రాష్ట్రాలు కూడా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను స్ఫూర్తిగా తీసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. డీ-లిమిటేషన్ అనేది ఉత్తర-దక్షిణ విద్వేషాలకు దారితీయకుండా, అందరినీ కలుపుకుపోయే 'టీమ్ ఇండియా' స్ఫూర్తితో జరగాలి. అంకెలు పెరగడం ముఖ్యం కాదు, ఆ అంకెల వెనుక ఉన్న ప్రజల ఆశయాలకు న్యాయం జరగడం అన్నింటికంటే ముఖ్యమని నాయకులు గుర్తించాలి. రాజకీయ ప్రయోజనాల కంటే దేశ సమగ్రతే మిన్న అని భావించినప్పుడే ఈ క్లిష్టమైన సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

# ఎంపీ సీట్ల మధ్య అసమతుల్యత.. దేశ ఐక్యతకు భంగం!

కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ అనుసరిస్తున్న పలు విధానాల వలన దేశ ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య దూరం రోజురోజుకూ పెరిగిపోతున్నది. ప్రధానంగా వస్తువులపై పన్ను సేకరణ మొత్తాలను ఒకే గొడుగుకిందికి తీసుకొచ్చిన జీఎస్టీ విధానం 101 రాజ్యాంగ సవరణ ద్వారా 2016 సంవత్సరం నుండి అమలులోకి వచ్చినది. ఇప్పటికే ఈ పన్ను సేకరణ మొత్తాలను వివిధ రాష్ట్రాలకు చేస్తున్న పంపిణీలో వ్యత్యాసాలు ఉన్నాయి.. దీంతో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన అసంతృప్తికి గురి అవుతున్నాయి. మరోవైపు నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజనను 2011 జనాభా ప్రాతిపదికగా చేయడంతో పుండు మీద కారం చల్లినట్టు దేశ ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అగాథం ఏర్పడ డానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు అయింది.

### తాజా డీలిమిటేషన్ మూలం..

రాజ్యాంగంలోని 82 (170) ఆర్టికల్ చట్టం ద్వారా దేశంలో నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియ మొదటిసారి 1951 జనాభా గణాంకాల ఆధారంగా చేపట్టారు.. 1952లో 489 లోకసభ స్థానాలను ప్రకటించారు. రెండోసారి 1963లో 489 నుండి 522కు పెంచుతూ విభజన జరిగింది. ఇక మూడవ పర్యాయం 1973లో 522 నుండి 545 పార్లమెంటు సభ్యుల స్థానాలుగా పెరిగాయి. అధిక జనాభా కలిగిన రాష్ట్రాలు అధిక ప్రయోజనం పొందనున్నాయని, అలా పొందకుండా నిరోధించడానికి చట్ట సవరణ ద్వారా డీలిమి టేషన్ ప్రక్రియను నిలిపివేశారు.. తిరిగి 1986 ఆర్టికల్ 84 సవరణ ద్వారా నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజన ప్రక్రియను 2026 వరకు వాయిదా వేశారు. కాబట్టి ఈ సంవత్సరం జనాభాను అనుసరించి నియోజకవర్గాల డీలి మిటేషన్ జరగబోతున్నది.

### రాజుకోనున్న అసంతృప్తి..

ఈ నేపథ్యంలో దేశ ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య జనాభా ఉత్పత్తి వృద్ధి రేటులో గణనీయంగా హెచ్చు తగ్గులు చోటు చేసుకున్నాయి. ఈ కారణంగా ఏ క్షణంలోనైనా అసంతృప్తి భగ్గున మండడానికి సిద్ధంగా వుంది. 2026లో వివిధ రాష్ట్రాల జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే అగ్నికి ఆజ్యం పోసినట్టు అవుతుంది. ఈ వెలుగులో ప్రధాన కార్యకారణాలను పరిశీలించాల్సి ఉంది. అందులో ప్రధానమైనది రాష్ట్రాల మధ్య ఒఖీ=




(ఒశ్ఖుశ్రీ టవతీఅశ్రీఠీఎ =ఛ్వ) సంతాన ఉత్పత్తి వృద్ధి నిష్పత్తి క్రమాన్ని అవగతం చేసుకోవాలి.

### దక్షిణాది రాష్ట్రాలకు శాపం

అక్షరాస్యత ఉన్నత చదువులు, కుటుంబ సంక్షేమం అభివృద్ధి తద్వారా సమాజ వృద్ధి పెంపొందడం వలన దక్ష ణాదిలో జనాభా తగ్గిపోయినది. ప్రజలు వస్తు సేవలను వినియోగించుకోవడం ద్వారా అధిక వస్తు సేవల పన్నులు చెల్లిస్తున్నారు. ఇదే కాలంలో అటు ఉత్తర భారత రాష్ట్రాలలో నిర క్షరాస్యత, వెనుకబాటు మూలంగా అధిక జనాభా ఉంది. జనాభా నిష్పత్తి ఆధారంగా జీఎస్టీ సంపద పంపిణీలో అధిక నిధులను దేశ ఉత్తర రాష్ట్రాలు పొందుతున్నవి. జనాభా తక్కువ ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ నిధుల పంపిణీ జరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం నిధుల పంపిణీలోనూ, నియోజకవర్గాల పునర్విభజనలోనూ వివక్ష కొనసాగడం తద్వారా రానున్న కాలంలో దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా పరిణమించనున్నది. దక్షిణాదికి చెందిన ఆయా రాష్ట్రాలలోని అధికార, విపక్ష పార్టీలన్నీ తాత్కాలిక ప్రయోజనాలను పక్కనపెట్టి ఏకం కావలసిన తరుణం ఆసన్నమైనది.

### దక్షిణాది పిల్లిమెడలో గంట..

ఉత్తర భారతంలో విస్తరించిన బీజేపీ, దక్షిణాదిలో ఎలాగైనే సరే.. జండా ఎగరవేయాలని తహతహలాడుతున్నది. అందులో భాగంగానే ఎన్నికల సంఘం ద్వారా రాష్ట్రాలలో "సర్" అమలు పరుస్తున్నది. దీని ద్వారా ఎన్నికల సంఘం దేశంలో ముందు ఎప్పుడూ లేనంత తీవ్ర విమర్శలను వివిధ రాజకీయ పార్టీల నుంచి ఎదుర్కొంటున్నది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాల పిల్లి మెడలో గంట ఎవరు కడతారో..? ఎదిరి చూడవలసి ఉన్నది.

### దూరం పెరిగితే ఐక్యతకు ప్రమాదం!

ఇప్పటికే ఆయా రాష్ట్రాల లోకసభ స్థానాలు మొత్తం 850 వరకు పెరగనున్నాయని తెలుస్తున్నది. అంటే రాష్ట్రాలలో గణనీయంగా లోకసభ స్థానాలు పెరగనున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలో కొద్దో గొప్పో పెరుగనున్నాయి.. ఈ పరిస్థితులను రాజకీయ పార్టీలు రానున్న ఎన్నికలలో తమ ప్రధాన అస్త్రంగా ఉపయోగించుకోవడానికి, ఇప్పటినుండే కారాలు, మిరియాలు నూరుతున్నాయి. ఒకవైపు 2011 జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన లోకసభ సమావేశాలలో ప్రవేశ పెట్టే బిల్లును లోకసభ సభ్యులకు చేర వేశారు. మరోవైపు 2026 జనాభా ఆధారంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పిస్తామని సదరు బిల్లులో చేర్చారు. రానున్న కాలంలో దేశంలో ఉత్తర దక్షిణాది రాష్ట్రాల మధ్య దూరం పెరగడమే కాకుండా, దేశ ఐక్యతకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉన్నది.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

.....జిల్లా కలెక్టర్ అంకిత్

చిల్లగుంపులో ఇళ్ల నిర్మాణాల పరిశీలన అధికారులకు కీలక ఆదేశాలు



అశ్వారావుపేట, లోకల్ గైడ్ :పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం దమ్మపేట మండలం, పాల్కలగండి గ్రామ పంచాయతీ పరిధిలోని చిల్లగుంపు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఒక్కో ఇంటిని సందర్శించిన కలెక్టర్, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఇసుక, సిమెంట్ వంటి సామగ్రి సరఫరాలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని, పనులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.ఆ ఒక్క ఇంటిపై ఆరాగ్రామంలో మొత్తం 15 ఇండ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 14 ఇళ్ల గ్రౌండింగ్ పనులు పూర్తయ్యాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మిగిలిన ఒక ఇంటి గ్రౌండింగ్ ప్రక్రియ ఇంకా ఎందుకు ప్రారంభం కాలేదని అధికారులను ప్రశ్నించారు. ఆ ఇంటికి సంబంధించిన సాంకేతిక లేదా ఇతర సమస్యలేవైనా ఉంటే తక్షణమే పరిష్కరించి, వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులను కఠినంగా ఆదేశించారు.నాణ్యతలో రాజీ పడొద్దుఇళ్ల నిర్మాణం కేవలం వేగంగానే కాకుండా, అత్యంత నాణ్యతతో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తూ, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించాలని సూచించారు. నిరుపేదల సొంతింటి కలను నిజం చేసే ఈ కార్యక్రమంలో ఎలాంటి జాప్యం జరగకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుశీల, దమ్మపేట తహశీల్దార్ రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి మరియు ఇతర మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నారం లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం


### సర్పంచ్ లావణ్య రామకృష్ణ ఆధ్వర్యంలో



( లోకల్ గైడ్ షాద్ నగర్)ఫరూక్నగర్ మండలం అన్నారం గ్రామంలో సర్పంచ్ లావణ్య రామ కృష్ణ ఆధ్వర్యంలో ఎన్ ఆర్ ఎస్ సి మరియు సిఐఎస్ఎఫ్ ఫైర్ పోలీసుల ఆధ్వర్యంలో ఫైర్ అవేర్నెస్ ప్రోగ్రాంను ఏర్పాటు చేయడం జరిగింది. అగ్ని ప్రమాదాన్ని సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటించవలసిన నియమాలను గ్రామ ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ ఫైర్ పోలీస్ సిబ్బందితోపాటు వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ కూటమికి మహిళలే బుద్ధి చెబుతారు

### బిజెపి రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ



నారాయణపేట ఏప్రిల్ 17 లోకల్ గైడ్ తెలంగాణ::కేంద్ర ప్రభుత్వం దశాబ్దాల కాలంగా మహిళలు ఎదురుచూస్తున్న మహిళా బిల్లును పార్లమెంట్ లో ప్రవేశ పెడితే ఆబిల్లు ను క్రూరంగా కాంగ్రెస్ కూటమి వ్యతిరేకించి మహిళల వ్యతిరేకిగా నిలిచాయని బిజెపి రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.మహిళా సాధికారత కోసం ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తుంటే కాంగ్రెస్ కూటమి వ్యతిరేకిస్తూ దశాబ్దాలుగా తన నిచ్చబుధిని నేడు మళ్ళీ చాటుకున్నారు.చట్ట సభల్లో మహిళలు ఉండడం కాంగ్రెస్ కు అసలు ఇష్టం లేదన్నారు.అందుకే మహిళా బిల్లును కాంగ్రెస్ కూటమి పార్టీలు అడ్డుకున్నాయని అన్నారు.బిల్లును అడ్డుకున్న కాంగ్రెవ్,దాని కూటమి పార్టీలకు మహిళలే బుద్ధి చెప్పాలని కోరారు.

## ఎండాకాలం జాగ్రత్తలు తెలియజేయాలి

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### సిరిసిల్ల అంబేద్కర్ నగర్ అర్బన్ ఆరోగ్య వైద్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:ఎండాకాలం నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే జాగ్రత్తలు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ఆరోగ్య వైద్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, వ్యాక్సిన్లు, ఓపీ రిజిస్టర్ పరిశీలించి.. సూచనలు చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్, టీకాలు, మందుల పంపిణీపై ఆరాతీశారు. పలువురు పేషెంట్లతో మాట్లాడి .. వారి అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు. .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పరిశీలనలో వైద్యురాలు రేణుక, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యం

రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు ఐపీఎస్

ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా సిరిసిల్లలో అరైవ్..

అలైవ్ కార్యక్రమం

హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే

డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం, సీపీఆర్ ప్రథమ చికిత్స పై శిక్షణ, అవగాహన



రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు ఐపీఎస్ పేర్కొన్నారు.ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ,రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి 18వ తేదీ నుంచి వారోత్సవాల సందర్భంగా అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్ లో జిల్లాలోని ఆర్టీసీ, విద్యాసంస్థలు, ఆటో, మున్సిపల్, ఇతర వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం, సీపీఆర్ ప్రథమ చికిత్సపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్యఅతిథిగా రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు ఐపీఎస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ఈసందర్భంగా రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు ఐపీఎస్ మాట్లాడుతూ..ప్రమాదాలు జరిగినప్పుడు ముందుగా స్పందించి ప్రాణాలు కాపాడేది వాహనాల డ్రైవర్లేనని తెలిపారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనల మేరకు మాత్రమే ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని,అలాగే విద్యార్థుల రవాణాలో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. 'రహవీర్' పథకం కింద ప్రమాదం జరిగిన గంటలోపు బాధితులను సమీప ప్రధాన రహదారుల వెండి ఉన్న ఆసుపత్రులకు తరలిస్తే, వారికి వారం రోజులపాటు ఉచిత చికిత్స అందిస్తూ.. రూ.1,50,000 వరకు కేంద్ర ప్రభుత్వం సహాయం అందిస్తుందని వివరించారు.ప్రమాద సమయంలో భయపడకుండా బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి 'రహవీర్' పథకం కింద రూ.25,000 ప్రోత్సాహకం ఇస్తామని తెలిపారు.నిర్లక్ష్యంగా వాహనాలు నడపవద్దని, ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. తెలంగాణలో రోజుకు సుమారు 70 రోడ్డు ప్రమాదాలు నమోదవుతున్నాయని అందులో 20 వరకు మరణాలు జరుగుతున్నాయని వెల్లడించారు.ఓవర్ స్పీడ్, తప్పుగా ఓవర్ టేకింగ్ చేయడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. వాహనాలు 80 కిమీ వేగ పరిమితి లోపలే నడపాలని, ముఖ్యంగా ప్రధాన రహదారులపై ఉన్న స్పీడ్ సైన్ బోర్డులను పాటించాలని సూచించారు. సీట్ బెల్ట్ ధరించకపోవడం, హెల్మెట్ పెట్టుకోకపోవడం వలన ప్రమాదాల తీవ్రత పెరుగుతోందని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. దేశంలో గత ఏడాది 4,70,000 ప్రమాదాలు జరిగాయని,దానిలో 1,70,000 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. యుద్ధాలు, వ్యాధుల ఇతర కారణాలతో ఎక్కువ మరణాలు జరగడం లేదని, రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది మృతి చెందుతున్నారని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు వీధిన పడుతున్నాయని పేర్కొన్నారు. తమ కుటుంబ, పిల్లల బాధ్యతను గుర్తు పెట్టుకొని జాగ్రతగా వెళ్లాలని పేర్కొన్నారు. ప్రతి నెలా రోడ్డు సేఫ్టీ కమిటి మీటింగ్ ఆర్అండ్ బీ,పీఆర్,పోలీస్,రవాణా శాఖా,ఆర్టీసీ అధికారులతో సమావేశం పెడుతున్నామని,బ్లాక్ స్పాట్స్ గుర్తింపు, నివారణ చర్యలు,సైన్ బోర్డ్స్ ఏర్పాటు తదితర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. స్కూల్ ఆటోలు, బస్సులలో పరిమితికి మించి విద్యార్థులను తరలించవద్దని స్పష్టం చేశారు. డ్రైవర్లకు కంటి పరీక్షలతో ఎంతో మేలని, వైద్యుల సూచన మేరకు కంటి అద్దాలు వాడాలని సూచించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ...ఎక్కువ ప్రమాదాలు డ్రంక్ అండ్ డ్రైవ్ తోనే అవుతున్నాయని తెలిపారు. జనవరి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అలాగే జిల్లాలో రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లాలో రోడ్ సేఫ్టీ కమిటి ఆధ్వర్యంలో జిల్లాలో 08 బ్లాక్ స్పాట్స్ గుర్తించడం జరిగింది. కొదురుపాక బ్రిడ్జ్ చౌరస్తా, నందికమాన్ చౌరస్తా, వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ చౌరస్తా,సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా, పెద్దూర్,ఎల్లారెడ్డిపేట హెచ్‌పి పెట్రోల్ బాంక్ వద్ద, తంగళ్ళపల్లి పద్మనగర్,, సారంపల్లి లుగా గుర్తించడం జరిగిందని ఆయా ప్రాంతాల్లో జాగ్రత్త చర్యలు చేపట్టడం జరిగిందని వాహనాదాహరులు జాగ్రత్తగా వెళ్లాలన్నారు. జిల్లాలో వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు ఇతర కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించారు.మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్ వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, సైకిల్ నడిపే పిల్లలు దానికి వాడే హెల్మెట్ వినియోగించాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపవద్దని ఒకవేళ నడిపి పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవ్ చేయవద్దని సూచించారు. ప్రతి వాహనదారుడు సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని, మేజర్లకే జాగ్రత్తలు చెపుతూ వాహనాలు ఇవ్వాలని స్పష్టం చేశారు.అనంతరం వాహనాల డ్రైవర్లతో కలసి రహదారి భద్రత పై ప్రతిజ్ఞ చేయించారు.ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, జిల్లా వైద్యాధికారి రజిత, తహసీల్దార్ మహేష్ కుమార్, సీ.ఐ లు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్,మధుకర్,ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, సురేష్,ఎస్.ఐ లు, పోలీస్, రవాణా శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులకు కొత్త సర్వీసుల మంజూరు కొరకు సరళమైన సర్వీస్ లైన్ ఛార్జీల విధానం :

### ఎస్ ఈ వెల్లడి



రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి జారీ చేసిన రెగ్యులేషన్ నం. 1 ఆఫ్ 2026 ప్రకారం, విద్యుత్ వినియోగదారులకు మరింత సులభతరం, పారదర్శకత కలిగించే విధంగా కొత్త సర్వీసుల కొరకు సర్వీస్ లైన్ ఛార్జీల (రాజ) విధానాన్ని అమలులోకి తీసుకువచ్చామని రాజన్న సిరిసిల్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ టీ వేణుమాధవ్ తెలిపారు.కొత్త ౹ా కనెక్షన్లు మరియు అదనపు లోడ్ కోసం సర్వీస్ లైన్ ఛార్జీలను సరళంగా, ఏకరీతిగా నిర్ణయించడం జరిగిందని ఆయన తెలిపారు. లోడ్ ఆధారంగా మాత్రమే ఛార్జీలు విధించడం జరుగుతుందని, క్షేత్ర స్థాయిలో స్థల పరిశీలన అవసరం లేకుండా త్వరితగతిన కొత్త సర్వీసులు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కొత్త విధానం ద్వారా వినియోగదారులు విద్యుత్ కనెక్షన్‌ను వేగంగా పొందగలరని, ముందుగా ఎంత ఛార్జీ చెల్లించాలో స్పష్టత ఉంటుందని చెప్పారు. అనవసర ఆలస్యం పూర్తిగా తగ్గుతుందని వివరించారు.9 కొత్త ఛార్జీల ముఖ్యాంశాలు20 కిలోవాట్ వరకు: డెవలప్‌మెంట్ ఛార్జీలు + సర్వీస్ లైన్ ఛార్జీలు వర్తించును .20 కిలోవాట్ పైగా: కేవలం సర్వీస్ లైన్ ఛార్జీలు మాత్రమే (డెవలప్‌మెంట్ ఛార్జీలు లేవు)9 కేటగిరీ వారీగా ఛార్జీలులిగృహ వినియోగదారులు 1 కిలోవాట్ వరకు:0015 కిలోవాట్: 500 + ప్రతి కిలోవాట్‌కు 600520 కిలోవాట్: 2900 + ప్రతి కిలోవాట్‌కు 150020 కిలోవాట్ పైగా: ప్రతి కిలోవాట్‌కు 10,000కమర్షియల్ కేటగిరీ:-1 కిలోవాట్ వరకు: 100015 కిలోవాట్: 1000 + ప్రతి కిలోవాట్‌కు 1200520 కిలోవాట్: ₹800 + ప్రతి కిలోవాట్‌కు200020 కిలోవాట్ పైగా: ప్రతి కిలోవాట్‌కు 10,000ఇండస్ట్రీలకు 20కిలోవాట్ల వరకు 4000 ప్రతి కిలోవాట్ 20 కిలోవాట్ పైగా: ప్రతి కిలోవాట్‌కు 10,000ఇతర కేటగిరీలకు కూడా లోడ్ ఆధారంగా ఛార్జీల పెరుగుదల ఉంటుందని తెలిపారు.9 రైతులకు లాభంరైతులకు ఈ విధానం మరింత ప్రయోజనకరంగా ఉండి, 1 కిలోవాట్‌కు కేవలం ₹1000 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ( ఓఆర్సి వసూలు చెయ్యరు )9 ప్రత్యేక అంశాలుఅపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, మల్టీ స్టోరీ భవనాలకు మొత్తం కాంట్రాక్ట్ లోడ్ ఆధారంగా ఛార్జీలు విధింపుట్రాన్స్‌ఫార్మర్ ఖర్చు వినియోగదారుడిపై భారం ఉండదుట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు బాధ్యత విద్యుత్ సంస్థదే ఎల్టి క్యాటగిరి లో క్యాటగిరి నుండి ఎ వరకు మరియు క్యాటగిరి ×౹ కి వర్తిస్తుందని , 1 కిలో మీటర్ లోపు ఉన్న ఎలెక్ట్రిఫీడ్ నెట్వర్క్ నుండి, కేవలం ఓవర్ హెడ్ హెడ్ లైన్లకు మాత్రమే వర్తించును . 1 కిలో మీటర్ కి మించిన లైన్ ఎక్స్ టెన్షన్ , క్యాటగిరి ఎ (తాత్కాలిక సరఫరా ) , లే అవుట్ ఎలెక్ట్రిఫికేషన్ , అండర్ గ్రౌండ్ కేబుల్స్ కు మినహాయించారు . ఈ కొత్త విధానం ద్వారా విద్యుత్ కనెక్షన్ పొందడం మరింత సులభం, వేగవంతం మరియు పారదర్శకంగా మారిందని, వినియోగదారుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఈ నిర్ణయం రైతులకు పెద్ద ఎత్తున ఉపయోగపడుతుందని ఎస్ఈ వివరించారు.


## తాండూర్ వీరశైవ సమాజం ఎన్నికల ప్రచారంలో వేగం.

- తంబాకు చంద్రశేఖర్ ప్యానల్‌కు సమాజ పెద్దల పూర్తి మద్దతు.
- 15 మంది సభ్యులతో సమతుల్య ప్యానల్ ఏర్పాటు ప్రశంసనీయం.
- భారీ మెజార్టీతో గెలిపించాలని సమాజ సభ్యులకు పిలుపు.



లోకల్ గైడ్/తాండూర్: వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో వీరశైవ సమాజం 202628 ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో 15 మంది సభ్యులతో పూర్తి స్థాయి ప్యానల్‌ను ఏర్పాటు చేసిన తంబాకు చంద్రశేఖర్ ప్యానల్‌కు సమాజ గౌరవ పెద్దలు మరియు భజన మండలి సభ్యులు తమ పూర్తి మద్దతును ప్రకటించారు.శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా తంబాకు చంద్రశేఖర్ ప్యానల్ సభ్యులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ పెద్దలు, భజన మండలి సభ్యులు మాట్లాడుతూ...15 మంది సభ్యులతో సమతుల్యంగా ప్యానల్‌ను రూపొందించడం సంతోషకరమని తెలిపారు. ఈ ప్యానల్ సమాజ అభివృద్ధి కోసం కృషి చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.అలాగే సమాజ సభ్యులందరూ ఐక్యంగా నిలిచి, ఈ ప్యానల్‌లో ఉన్న అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం పెద్దలు శంభు లింగం, గాజుల వీరన్న, మాద్రిక శేఖర్, మల్కాపురం నాగభూషణం, కోటం వీరకాంతు, మేడి విజయ్ కుమార్, ఎన్కెపల్లి పర్వతప్ప తదితరులు పాల్గొన్నారు.

## కాల్పుల విరమణ ఉల్లంఘిస్తే ఇజ్రాయెల్‌పై దాడి చేసేందుకు సిద్ధం..



హెజ్బొల్లా సంస్థ హెచ్చరిక ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య పది రోజులపాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా తీవ్రవాద సంస్థ ఇజ్రాయెల్‌కు హెచ్చరిక జారీ చేసింది. : ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య పది రోజులపాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా తీవ్రవాద సంస్థ ఇజ్రాయెల్‌కు హెచ్చరిక జారీ చేసింది. ఈ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తే, తిరిగి దాడులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. తమ వేళ్లు ఇంకా ట్రిగ్గర్ మీదే ఉన్నాయని చెప్పింది. ఇరాన్-అమెరికా మధ్య రెండు వారాల కాల్పుల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తాజాగా, ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కూడా కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.పది రోజులపాటు కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి. ఇప్పటికే ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఈ విషయాన్ని కూడా అమెరికా వెల్లడించింది. ఇజ్రాయెల్-లెబనాన్ దేశాల నేతల మధ్య దశాబ్దాల తర్వాత తొలి సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించాడు. లెబనాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ హెజ్బొల్లా కూడా కాల్పుల విరమణ పాటిస్తూ, ఈ పది రోజులు ప్రశాంతంగా ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పాడు. దీనివల్ల ఎలాంటి చంపుకోవడాలు, దాడులు ఉండవని, శాంతి ఏర్పడుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో హెజ్బొల్లా తీవ్రవాద సంస్థ స్పందిస్తూ.. ఇజ్రాయెల్ కాల్పుల విరమణ పాటించకపోతే, తాము కూడా తిరిగి దాడులు చేస్తామని హెచ్చరించింది. ఈ ఒప్పందం నేపథ్యంలో లెబనాన్‌లోని ప్రజలు తమ సొంత ప్రాంతాలకు తిరిగి వెళ్తున్నారు. ఇంతకాలం యుద్ధం నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల ప్రజలు తమ ప్రాంతాల్ని ఖాళీ చేసి వెళ్లిపోయారు.అయితే, ఇప్పుడు శాంతి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో తిరిగి తమ సొంతూళ్లకు పయనమయ్యారు. ముఖ్యంగా బీరుట్ దక్షిణ ప్రాంతాల్లోని ప్రజలు తిరిగి వెళ్లారు. అయితే, ఈ అంశంపై లెబనాన్ ఆర్మీ హెచ్చరికలు జారీ చేసింది. ఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్లకూడదని హెచ్చరించింది. ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని చైనా స్వాగతించింది. మరోవైపు ఇరాన్‌లో కిండర్‌గార్టెన్ స్కూల్స్ మూసివేయాలని ఆ దేశం నిర్ణయించింది. చిన్నారుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

## థార్‌తో ఐదుగురిని ఢీకొట్టిన ఎమ్మెల్యే కొడుకు..

హారన్ మోగిస్తున్నా ఎందుకు తప్పుకోలేదంటూ వాదన దీభీ మీూా'ం ంశీఅ ఋఎం ఎష్ట్రుతీ। బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు థార్ వాహనం నడిపిపాడు. బైక్‌తోపాటు, రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న మహిళలపైకి దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. అయితే తాను హారన్ మోగించినప్పటికీ ఎందుకు తప్పుకోలేదంటూ వారిపైనే ఆగ్రహం వ్యక్తం చేశాడు. వెళ్తున్న మహిళలపైకి దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. అయితే తాను హారన్ మోగించినప్పటికీ ఎందుకు తప్పుకోలేదంటూ వారిపైనే ఆగ్రహం వ్యక్తం చేశాడు.పిచోర్ ఎమ్మెల్యే ప్రీతమ్ లోధి కుమారుడైన దినేష్ లోధి గురువారం సాయంత్రం 7.30 గంటల సమయంలో థార్ వాహనం నడిపాడు. కరేరా ప్రాంతంలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురితోపాటు నడుస్తున్న ఇద్దరు మహిళలపైకి థార్‌ను దూకించాడు. వెనుక నుంచి వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కరేరా పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.కాగా, బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు దినేష్ లోధి వింత వాదనకు దిగాడు. తాను హారన్ మోగిస్తున్నప్పటికీ రోడ్డు పక్కకు ఎందుకు తప్పుకోలేదని గాయపడిన వారిని ప్రశ్నించాడు. ఈ ప్రమాదానికి వారే కారణమన్నట్లు మాట్లాడాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు తన అధికార దర్పాన్ని ప్రదర్శించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడుతుండగా మైక్ కట్




ఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడుతున్న మహిళా ఎంపీ మై?క్ కట్ చేయడంపై వైఎస్సార్‌సీపీ ఎంపీలు తనూజ రాణి, గురుమూర్తి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మైక్ కట్ చేసిన సభాస్థానంలో టీడీపీ ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ ఉన్నారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ జరిగింది. వైఎస్సార్‌సీపీ తరపున చర్చలో ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజారాణి పాల్గొన్నారు. టీడీపీ హయాంలో మహిళలపై కొనసాగుతున్న హింసను ఆమె ప్రస్తావించారు. ఏపీలో మహిళను తొలిసారిగా ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రిని చేసిన ఘనత వైఎస్ జగన్‌ది. నామినేటెడ్ పోస్టుల్లో, కాంట్రాక్టుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌ది. అమ్మ ఒడి, మహిళల పేరుపైనే ఇళ్ల పట్టాలు ఇచ్చారు. 2019-24 వైఎస్ జగన్ పరిపాలనా కాలం మహిళలకు స్వర్ణయుగం లాంటిది. ఏపీలో మహిళలపై హింస జరుగుతుంది. నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో జరిగిన ఘటన తీవ్ర ఆందోళనకరం. అధికార పార్టీలోని ప్రజాప్రతినిధులు మహిళలను వేధిస్తున్నారు. బాధితులు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు" అని తనూజారాణి మండిపడ్డారు.

## ఈ బిల్లు అందుకే.. ఎట్టిపరిస్థితుల్లో అడ్డుకుంటాం



ఢిల్లీ: నారిశక్తి వందన్ అధినియం పేరుతో కేంద్రం తీసుకవచ్చిన బిల్లు వాస్తవానికి మహిళల రిజర్వేషన్‌కు సంబంధించిన బిల్లు కానేకాదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహిళా బిల్లు చర్చపై ఆయన శుక్రవారం పార్లమెంటులో మాట్లాడారు. 2023 లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని ఇది మహిళలను అడ్డుగా పెట్టి తీసుకొచ్చిన షేమ్ ఫుల్ యాక్ట్ అన్నారు. మా నానమ్మ ఇందిర వల్లే నాలో ఆత్మ విశ్వాసం పెరిగిందని నిన్న సభలో తన సోదరి ప్రియాంక గాంధీ చేసిన ప్రసంగం తనకు ఎంతో గర్వంగా అనిపించిందన్నారు.మన జీవితంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని తల్లులు చెల్లెలు , భార్య బిడ్డల రూపంలో వారు ఎంతో కీలక పాత్ర పోషిస్తారన్నారు. కాగా ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో కేంద్రం ఎంతో కుట్ర చేస్తోందన్నారు. ఇది రాజకీయ ముఖ చిత్రాన్నే మార్చాలనుకుంటున్న బిల్లు అని రాజ్యాంగాన్ని బైపాస్ చేసి నియోజకవర్గాలని పెంచాలనుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ బిల్లు వెనుక ఉన్న అసలు ఉద్దేశం కులగణన లెక్కలు లేకుండా నియోజకవర్గాల పునర్విభజన చేయాలన్నదే అన్నారు. ఓబీసీలకు 15 ఏళ్ల పాటు రిజర్వేషన్లు లేకుండా చేసే కుట్ర ఇదన్నారు. బీజేపీ సభ్యులు రాజ్యాంగం కంటే మనువాదానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉన్నతస్థాయి అధికారుల్లో , న్యాయవ్యవస్థలో ఓబీసీలు గిరిజనులు లేరని, ప్రేవేటు రంగంలో కూడా రంగంలో కూడా ఓబీసీ ఎస్సీ ఎస్టీల ప్రాధాన్యత లేదన్నారు. హిందుత్వం పేరుతో బీజేపీ పార్టీ బీసీ, ఎస్సీ,ఎస్టీలకు చేసిందేమీ లేదన్నారు. కులగణనను బైపాస్ చేసేందుకే కేంద్ర యత్నిస్తోందని అస్సోం, జమ్మూలో చేసినట్లు డీలిమిటేషన్ చేయాలనుకంటున్నారని ఆరోపించారు. ఈ బిల్లు దేశవ్యతిరేఖ బిల్లని ఇది ఎట్టిపరిస్థితుల్లో ఆమోదం పొందేలా చేయడానికి బీజేపీ అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. దేశ ఆత్మని చంపే బిల్లుని ఎట్టిపరిస్థితుల్లో అడ్డుకొని తీరాతమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తేల్చి చెప్పారు. కాగా రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పార్లమెంటులో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి.

## ఆ బిల్లులకు వైఎస్సార్‌సీపీ మద్దతు



ఢిల్లీ: మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లులకు వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించింది. నియోజకవర్గాల పెంపుపై ప్రభుత్వం చెబుతున్న విషయాలు లిఖితపూర్వకంగా బిల్లులో పెట్టాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి డిమాండ్ చేశారు. నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్ బిల్లుపై లోక్‌సభలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రాంతీయ వ్యత్యాసాలు లేకుండా చూడాలని.. అన్ని పార్టీలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని కోరారు. డీలిమిటేషన్ ప్రక్రియ విపక్షాలను అణచివేసేదిగా ఉండకూడదన్నారు. మహిళా రిజర్వేషన్‌కు సంపూర్ణ మద్దతిస్తున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌ది. సంక్షేమ పథకాలన్నీటిని మహిళలకు భాగస్వామ్యం కల్పించారు. ఇళ్ల పట్టాలు మహిళల పేర్లతోనే ఇచ్చారు. నలుగురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు మహిళలను వేధిస్తూ పట్టుబడ్డారు. అసభ్యకరమైన వీడియోలు బయటపడ్డాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేలపైన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫిర్యాదు చేసిన మహిళపైనే కేసులు పెడుతున్నారు. మహిళలను వేధిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి. సూత్రప్రాయంగా ఈ బిల్లులను అంగీకరిస్తున్నాము. కానీ, మేము లేవనెత్తిన అన్ని అంశాలను ప్రభుత్వం నివృత్తి చేయాలి" అని మిథున్‌రెడ్డి పేర్కొన్నారు.ు

## ఆ ఘనత వైఎస్ జగన్‌దే: విడదల రజిని




తాడేపల్లి: ఇవాళ దేశ చరిత్రలో గొప్పరోజుగా మిగిలిపోతుందని.. దశాబ్దాల తర్వాత మహిళా రిజర్వేషన్ కల నెరవేరబోతుందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి విడదల రజిని అన్నారు. శుక్రవారం ఆమె తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లుకు వైఎస్సార్‌సీపీ ఇప్పటికే మద్దతు ప్రకటించిందన్నారు. "మహిళా రిజర్వేషన్ బిల్లుతో దేశ భవిష్యత్తు మారబోతుంది. మహిళా శక్తితో మన దేశాన్ని ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా చేద్దాం. మహిళల అభివృద్ధి గురించి ఆలోచించిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 90 శాతం పథకాలు మహిళల గౌరవం పెంచే పథకాలే. అమ్మ ఒడి దగ్గర నుంచి ప్రతి పథకం మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేదే. మహిళలకు వైఎస్ జగన్ ఎన్నో అవకాశాలు కల్పించారు. మహిళలను హోం మినిస్టర్లగా, డిప్యూటీ సీఎంలుగా చేసిన ఘనత జగనన్నదే. మహిళల పట్ల వైఎస్ జగన్ సామాజిక సంఘ సంస్కర్తగా ఆలోచన చేశారు. కూటమి పాలనలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగాయి. ఏపీలో లా అండ్ ఆర్డర్ పని చేయడం లేదు. చంద్రబాబు అజెండా రెడ్‌బుక్ పాలనే" అని విడదల రజిని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతకు అనేక కార్యక్రమాలు చేపట్టింది వైఎస్ జగనే. రాజకీయంగా, ఆర్థికంగా ఎంతో చేయూత అందించారు. చంద్రబాబు వచ్చాక మహిళలకు రక్షణ లేదు. వేధింపులు, అఘాయిత్యాలు, ఆత్మహత్యలు పెరిగాయి. పోలీసు వ్యవస్థ రాష్ట్రంలో పూర్తిగా దిగజారిందనేదానికి నిదర్శనం. మహిళల కోసమే జగన్ దిశ యాప్, మహిళా పోలీస్ స్టేషన్లు, జీరో ఎఫ్ఐఆర్ లు తెచ్చారు. కానీ చంద్రబాబు మహిళల కోసం ఏం చేశారు?. 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని మా హయాంలో ఆరోపణలు చేశారు. మరి నిజంగానే అదృశ్యమైతే వారిని చంద్రబాబు, పవన్ వెనక్కి తెచ్చారా?. మహిళల మీద లైంగికదాడి చేసిన కూటమి ఎమ్మెల్యేలు, నేతలపై ఎందుకు చర్యలు తీసుకోలేదు?" అంటూ విడదల రజని నిలదీశారు.

# హంగేరిలో కొత్త గాలి



పశ్చిమాసియా మొదలుకొని ప్రపంచం నలుమూలల నుంచీ దుర్వార్తలే వింటున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఇది మరో పిడుగుపాటు. పదహారేళ్లుగా హంగేరిని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుతున్న కన్సర్వేటివ్ జాతీయవాది, ప్రధాని విక్టర్ ఒర్బాన్ ఘోరంగా ఓటమిపాలయ్యారు. 199 స్థానాలున్న పార్లమెంటుకు ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఆయన పార్టీ ఫిడెస్‌కి కేవలం 55 స్థానాలు మాత్రమే రాగా, ఆయన్నుంచి విడిపోయి, మధ్యేవాద మితవాద పక్షం టీసా పార్టీని స్థాపించిన పీటర్ మాజార్‌కు అనూహ్యంగా 138 స్థానాలు లభించాయి. తీవ్ర మితవాద పక్షం అవర్ హోంల్యాండ్‌కు 6 దక్కాయి. తుది ఫలితాలు అధికారికంగా ప్రకటించాల్సివుంది. ఎన్నికల సంఘం మొదలుకొని న్యాయవ్యవస్థ, మీడియా వరకూ అన్నిటినీ అధీనంలోకి తెచ్చుకుని తిరుగులేని అధికారం చలాయిస్తున్న ఒర్బాన్ ఓటమిని ఎవరూ ఊహించలేదు. ఆయనపై ప్రజానీకంలో తీవ్ర వ్యతిరేకత ఉన్నదని స్వతంత్ర సర్వే సంస్థలు చెప్పినా ఎవరూ నమ్మలేదు. టీసా పార్టీ దాదాపు 6 శాతం పాయింట్ల ఆధిక్యత తెచ్చుకుంటేనే కనీసం సాధారణ మెజారిటీ కూడా అసాధ్యమని కొన్ని మీడియా సంస్థలు చెప్పగా... అధికార పార్టీకన్నా టీసా పది పాయింట్లు వెనకబడివుందని ప్రభుత్వ అనుకూల మీడియా ఢంకా బజాయించింది. ఈ ఎన్నికల సందర్భంగా హంగేరి ఏమాత్రం పొంతనలేని రెండు భిన్న ప్రపంచాలు చూసింది. అధికారపక్షం వైపు మొగ్గే ప్రపంచం ఒర్బాన్ మరో నాలుగేళ్లు ఏలబోతున్నారంటూ మోత మోగించింది. అందులో మీడియా సంస్థలూ, సామాజిక మాధ్యమాలూ, 'సాధారణ పౌరులూ' ఉన్నారు. అటు పీటర్ మజార్‌ను సమర్థించే ప్రపంచం అందుకు భిన్నమైన విశ్లేషణలు చేసింది. ఈ రెండింటిలో ఏదో ఒకటి మాత్రమే 'నిజమైన ప్రపంచం' అయివుంటుందని అందరికీ తెలుసు. సోమవారం ఓట్ల లెక్కింపు తర్వాత 'నకిలీ ప్రపంచం' బట్టబయలైంది. ఒర్బాన్ హంగేరికి మాత్రమే పరిమితమైన సాధారణ నాయకుడు కాదు. ఆయన్ను అధికార పీఠం ఎక్కించిన ఫార్ములా దేశదేశాల నాయకులకూ శిరోధార్యంగా మారింది. సంప్రదాయవాదాన్నీ, జాతీయవాదాన్నీ నెత్తికెత్తుకుని ప్రజల భావోద్వేగాలను ఉచ్ఛస్థితికి తీసుకెళ్లటం ఎలాగో ఒర్బాన్ నేర్పారు. అమెరికాకు మాత్రమే కాదు... ప్రపంచానికంతకూ పెను సమస్యగా మారిన ట్రంప్ ఆయన స్ఫూర్తితోనే మాగా (మళ్లీ అమెరికాను మహోన్నతం చేద్దాం) ఉద్యమానికి అంకురార్పణ చేశారు. ఒర్బాన్‌కు ట్రంప్, పుతిన్ సన్నిహితులు. వారిద్దరి మాదిరే ఈయూతో వైరం. ఒర్బాన్ మార్కు ఏలుబడికి ఇంటా బయటా శత్రువులు అవసరం. వారు-- ఈయూ, కమ్యూనిస్టులు, వలసదారులు, శతకోటీశ్వరుడు, దాత జార్జి సోరోస్-- ఎవరైనా కావొచ్చు. అభద్రతా భావన కూ. విదేశీ బెడదకూ, సమాజంలోని నైతిక పతనానికీ, ఇతరత్రా ప్రమాదాలకూ సర్వరోగ నివారిణి తాను మాత్రమేనని ఒర్బాన్ పదహారేళ్లపాటు నమ్మించగలిగారు. 'సూపర్ మెజారిటీ' వచ్చినా పాలనపై పూర్తిస్థాయి పట్టు సంపాదించటం టీసా పార్టీకి అంత సులభం కాదు. ఎందుకంటే సకల అధికార వ్యవస్థలూ ఒర్బాన్ అనుకూలురతో నిండివున్నాయి. ఆర్థిక సంస్థలూ, అధికార యంత్రాంగం, ఎన్నికల సంఘం, అవినీతి నిరోధక విభాగం వగైరాలన్నీ ఆయన మనుషుల చెప్పుచేతల్లో నడుస్తున్నాయి. ఈయూ నుంచి బయటికొస్తేనే సకల సమస్యలూ పరిష్కారమవుతాయని ఆయన చెప్పిన మాటలు విశ్వసించబట్టే ఆర్థికంగా అధోగతిలోవున్నా జనం నమ్మారు. ఒర్బాన్ అనుకూల వ్యాపార సంస్థలు మాత్రమే లాభార్జనతో కళకళలాడాయి. నిరుద్యోగం పదేళ్ల రికార్డును అధిగమించింది. నిరుడు ఆర్థిక వృద్ధి 0.4 శాతం. కొన్నేళ్లుగా కష్టాల్లోవున్న పోలెండ్ సైతం 3.6 వృద్ధి రేటు సాధించగా... బల్గేరియా, రుమేనియా సైతం మెరుగ్గా ఉన్నాయి. ఇక అవినీతిలో హంగేరిది అగ్రస్థానం. ఇరాన్ శాంతి చర్చలకన్నా ముందు, ఒర్బాన్ గెలుపుకోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హంగేరి వెళ్లి ప్రచారం చేశారు. కానీ ఇరాన్ శాంతి చర్చల మాదిరే, ఒర్బాన్ కూడా కుప్పకూలారు. ఆయన ఓటమితో ఈయూ దేశాలు పండగ చేసుకుంటున్నాయి. హంగేరి ప్రజలు తమతోనే ఉన్నారని సంబరపడుతున్నాయి. కానీ అధోగతిలోవున్న హంగేరికి అందరూ ఆపన్న హస్తం అందించటం అత్యవసరం.

# మళ్లీ యుద్ధ మేఘాలు!



చరిత్రాత్మకం అన్నారు. ఉన్నతస్థాయి చర్చలన్నారు. దౌత్యం పూర్తి స్థాయిలో పనిచేస్తోందన్నారు. శాంతికి పశ్చిమాసియా చేరువలో ఉందన్నారు. పాకిస్తాన్ రాజధాని ఇస్లామా బాద్‌లో 21 గంటలపాటు కొనసాగిన అమెరికా--ఇరాన్ ప్రతినిధి బృందాల చర్చలపై ఎప్పటికప్పుడు మీడియాలో వచ్చిన సమాచారం సారాంశమిది. తీరా బయటికొచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చర్చలు విఫలమయ్యాయని ప్రకటించి నిష్క్రమించారు. ఆ వెంటనే ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరింపు భాష మొదలైంది. అమెరికా ఏకపక్ష వైఖరివల్ల 47 సంవత్సరాల తర్వాత ఆ రెండు దేశాలమధ్యా నేరుగా సాగిన చర్చలు చివరికిలా నీరుగారాయి. వచ్చేవారం మరోసారి చర్చలుంటాయని చెబుతున్నారు. కానీ అమెరికా వైఖరి మారకపోతే ప్రయోజనం శూన్యం. ట్రంప్ వచ్చాక చర్చల అర్థమే మారిపోయింది. చర్చలంటే ఆయన శాసిస్తే ఎదుటిపక్షం శిరోధార్యంగా స్వీకరించటం తప్ప మరేంకాదు. అసలు ఈ యుద్ధంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న వాన్స్ నాయకత్వాన ప్రతినిధి బృందాన్ని పంపటంలోనే ఆయన నిజాయితీలేమి వెల్లడైంది. ఏ అధికారమూ లేని, సొంతంగా ఎలాంటి చొరవా తీసుకోలేని ఆ అశక్త బృందం చివరకు ఉత్త డొల్లగా మిగిలిపోయింది. ట్రంప్ తీరు 90వ దశకం మొదట్లో సోవియెట్ యూనియన్ కుప్పకూలిననాటి పరి స్థితుల్ని తలపిస్తోంది. అంతవరకూ సోవియెట్ భాగస్వామ్య రాష్ట్రాలుగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కడికక్కడ సమావేశాలు జరగటం, దేశంనుంచి విడిపోతున్నట్టు ప్రకటించటం రివాజై పోయింది. నిజంగా అలా ప్రకటించేవారి బలాబలాలేమిటో, ఆ తీర్మానాలు అమలయ్యే అవకాశం ఉందో లేదో తెలియని స్థితి. ఇలాంటి అనిశ్చితే ఇప్పుడు అమె రికాను ఆవరించింది. నరమేథాన్ని సాగిస్తూ ఘనవిజయాలుగా ప్రకటించుకోవటం, ఇరాన్ నాగరికత ఈ రాత్రితో అంతం కాబోతున్నదని ప్రకటించటం, అంతలోనే చర్చలకు రావాలంటూ బెదిరించటం ట్రంప్ అలవాటు చేసుకున్నారు. ఇజ్రాయెల్‌తోపాటు ఈ యుద్ధానికి లోపాయికారీగా మద్దతిచ్చిన దేశాలన్నీ ఇరాన్‌నుంచి శరపరంపరగా వచ్చి పడుతున్న క్షిపణుల ధాటికి బెంబేలెత్తినా, అక్కడ పెనువిధ్వంసం చోటుచేసుకుంటున్నా ట్రంప్ బడాయి మాటలు ఆగలేదు. ఆయన ప్రకటనలకు భిన్నమైన స్థితిగతులున్నాయని సైనికా ధికారులే మీడియాకు రహస్యంగా చెప్పటం అమెరికాలో కుప్పకూలుతున్న వ్యవస్థలకు ఆనవాలు. సోవియెట్ కనుమరుగయ్యే ముందు కూడా ఇలాంటి ధోరణులే కనబడ్డాయి. ఇతర దేశాల సహకారంతో హోర్ముజ్ జలసంధిని దిగ్బంధిస్తామని ట్రంప్ చెప్పిన కొన్ని గంటలకే, అందుకు తాము అంగీకరించబోమని నాటో భాగస్వామ్య దేశాలు బ్రిటన్, ఫ్రాన్స్‌లు ప్రకటించి గాలి తీశాయి. 'హోర్ముజ్ దిగ్బంధం' అంటూ చేసిన ప్రకటనకు అర్థం ఇరాన్ నౌకాశ్రయాల దిగ్బంధమని అమెరికా సైన్యం ఆ వెంటనే తెలిపింది. సోమవారం నుంచి అమల్లోకి వచ్చిందని కూడా ప్రకటించారు. కానీ గల్ఫ్ దేశాలే దీన్ని నిరసిస్తున్నాయి. ట్రంప్ చర్య ఈ ప్రాంతం మొత్తాన్ని శాశ్వతంగా యుద్ధ ఊబిలోకి దించేస్తుందని సౌదీ అరేబియాతోసహా చాలా దేశాలు ఆందోళనపడుతున్నాయి. సౌదీ చమురు ఎగుమతులు యుద్ధానికి ముందు మాదిరే రోజుకు 70 లక్షల బ్యారెల్లకు చేరు కున్నాయి. అవి ఎర్ర సముద్రం గుండా వెళ్తున్నాయి. కానీ అమెరికా దుందుడుకు చర్యకు దిగితే యెమెన్‌లోని హౌతీలు ఆ ఎగుమతుల్ని దెబ్బతీస్తారు. తన నాయకత్వాన ఇన్ని దశాబ్దాలుగా సాగిన ఏకధ్రువ ప్రపంచం కళ్లముందు కుప్పకూలుతున్న వైనాన్ని అమెరికా గ్రహించకపోతే పోయిందిగానీ... చైనా నాయకత్వంలో కొత్త అమరిక మొగ్గతొడుగుతోందన్న సంగతైనా అది తెలుసుకోవాలి. ఈ యుద్ధం తనకూ, ఇరాన్‌కూ మధ్య పంచాయతీ కాదు. అది పశ్చిమాసియాకు పరిమిత మైంది అంతకన్నా కాదు. ప్రపంచంలో తన ఆధిపత్యాన్ని క్రమేపీ బలహీనపరుస్తున్న ఒక నిరర్థక యుద్ధం. అది చైనా నాయకత్వాన కొత్త కూటమికి పురుడు పోస్తున్న ప్రమాదకర యుద్ధం. ఆర్థికంగా, సైనికంగా ప్రపంచంలోనే తాము సర్వశక్తిమంతులమని ఇరాన్‌తో చర్చలకు చాన్నాళ్లముందు జేడీ వాన్స్ అన్నారు. ట్రంప్ ప్రభావం ఆయనపై ఎక్కువే ఉన్నట్టుంది. ఆ దృశ్యం మారుతున్న సంగతిని అమెరికా నాయకత్వం ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

# బిహార్‌కు బీజేపీ సారథ్యం!



మండల్ రాజకీయాలకు పుట్టిల్లుగా మారి, రెండున్నర దశాబ్దాలుగా జాతీయ రాజకీయ పక్షాలకు నిలువనీడ లేకుండా పోయిన బిహార్‌లో బుధవారం తొలిసారి బీజేపీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడింది. ఆ పార్టీ నాయకుడు సమ్రాట్ చౌధరి నేతృత్వంలో ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయడం కొన్నేళ్ల క్రితం ఊహించని పరిణామం. అయితే కింగ్‌మేకర్‌గా లేదా జూనియర్ భాగస్వామిగా జేడీ(యూ) అధినేత నితీశ్‌కుమార్ నాయకత్వంలోని ప్రభుత్వాల్లో కొనసాగుతూ వచ్చిన బీజేపీ... ఎంతో సహనంతో, ఓపికతో సుదీర్ఘకాలం ఈ రోజు కోసం వేచిచూసింది. ఆఖరికి 2020లోనూ, నిరుడు జరి గిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రధాన భాగస్వామ్య పక్షం జేడీ(యూ)కు మించి స్థానాలొ చ్చినా సీఎం పదవి కోసం పట్టుబట్టకుండా ఉండిపోయింది. దఎలా ఒప్పించిందో, ఏం చేసిందో... ఆర్నెల్లు కాకుండానే ఆయన్ను రాజ్యసభకు పంపి, ఆ పదవి కైవసం చేసుకుంది. అసలు నిరుడు నవంబర్‌లో జరిగిన బిహార్ ఎన్నికల సందర్భంలోనే ఈసారి నితీశ్‌ను సీఎం పదవినుంచి తప్పించి, బీజేపీయే పగ్గాలు చేపడుతుందన్న ప్రచారం జరిగింది. కానీ అది విజయావకాశాలను దెబ్బతీయొచ్చన్న ఉద్దేశంతో రెండు పార్టీలూ కొట్టిపారేశాయి. బహుశా తనను తప్పిస్తారని నితీశ్ కూడా ఊహించివుండరు. ఎందుకంటే కుమారుడికి రాజ్యసభ సీటు ఇవ్వాలంటూ ఆయన ఫిబ్రవరిలో బీజేపీ అగ్రనేతలను కలిసి పట్టుబట్టారు. చివరికి తానే ఆ సీటు తీసుకుని, సీఎం పదవి బీజేపీకి అప్పగించాలని నితీశ్ నిర్ణయించటంతో కుమారుడితోపాటు పార్టీ అగ్ర నేతలంతా ఒక్కసారిగా దిగ్భ్రాంతిలో మునిగారు. పదకొండేళ్లనాడు అప్పటి పార్టీ నేత జితన్‌రాం మాంఝీని తొమ్మిది నెలలపాటు సీఎం పదవిలో కూర్చోబెట్టడం మినహా దాదాపు 21 ఏళ్లపాటు బిహార్ ఏలికగా నితీశ్ కొనసాగారు. మధ్యలో కూటములు మార్చినా, జనం మాత్రం ఆయన వెనకే దృఢంగా నిలబడ్డారు. మునుపటితో పోలిస్తే పార్టీ అధినేతగా నితీశ్ అంత ఆత్మవిశ్వాసంతో లేరని స్థానిక మీడియా చెబుతూవచ్చింది. ఇది వయసు పైబడటంవల్లనా, పార్టీలోని అంతఃకలహాలా అన్న విషయంలో ఎవరి విశ్లేషణలు వారివి. మండల్ రాజకీయాలు బలంగా వేళ్లూను కున్న రాష్ట్రాన్ని జాతీయపక్షం చేతుల్లో పెట్టడంపైనా నితీశ్‌పై విమర్శలొచ్చాయి. కానీ బీజేపీ ఆ రాజకీయాలకు భంగం వాటిల్లకుండా చాలా చాకచక్యంగా వ్యవహరించింది. ఉత్తరప్రదేశ్ తరహాలో బిహార్‌లో కూడా ఆదినుంచీ సంఘ్ పరివార్‌ను నమ్ముకున్నవారికే పగ్గాలు అప్పగించాలని ఒత్తిళ్లు వచ్చినా అధిష్ఠానం వాటిని అంగీకరించలేదు. మొదటి నుంచీ పార్టీలో కొనసాగినవారిని కాదని, ఎనిమిదేళ్లనాడు వచ్చిన సమ్రాట్‌వైపే మొగ్గు చూపటానికి కారణం ఆయన బాగా వెనకబడిన కుష్వాహా సామాజిక వర్గానికి చెందిన వారు కావటమే. బిహార్ ప్రత్యేక పరిస్థితులరీత్యా ఇది తప్పదని అధిష్ఠానం భావించింది. లాలూ సతీమణి రబ్రీదేవి ప్రభుత్వంలో ఉంటూ 26 యేళ్ల క్రితం బీజేపీ కారణంగానే మంత్రి పదవి పోగొట్టుకున్న సమ్రాట్... 2018లో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్లమెంటరీ రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు... కేవలం శాశ్వత ప్రయోజనాలే ఉంటాయంటారు. కానీ ప్రయోజనాలు మాత్రమే చూసుకున్నా ఎదగటం కష్టమే. తనేంటో నిరూపించుకోవాలి. పార్టీ నాయకత్వానికి నమ్మకం కలిగించాలి. ఆ పని సమ్రాట్ సమర్థవంతంగా చేయబట్టే ఇవాళ సీఎం పదవి అందుకో గలిగారు. యాదవేతర కులాల్లో పట్టు సంపాదించుకోవాలన్న బీజేపీ వ్యూహానికి ఆయన సమర్థత, కులం తోడ్పడ్డాయి. అయితే బిహార్‌కు సమస్యలు తక్కువేం లేవు. ఇప్పటికీ అది దేశంలోని నిరుపేద రాష్ట్రాల్లో ఒకటి. బ్రహ్మాండమైన అభివృద్ధి జరిగిపోయిందంటూ ఎంత గొప్పలుపోయినా బిహార్‌లో రోడ్లు, ఆరోగ్యరంగం, విద్యారంగం సక్రమంగా లేవు. లాలూ హయాంతో పోలిస్తే మెరుగ్గానే ఉండొచ్చుగానీ... శాంతిభద్రతలు ఇంకా పూర్తిస్థాయిలో చక్కబడలేదంటారు. మౌలిక సదుపాయాల మెరుగుదల, పారదర్శకత, జవాబుదారీతనం తన ప్రాముఖ్యతలని ప్రమాణస్వీకారం చేశాక ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో సమ్రాట్ ప్రకటించటం గమనిస్తే ఎక్కడెక్కడ మరమ్మతు అవసరమో ఆయన సక్రమంగానే గుర్తించారని అర్థమవుతుంది. మొత్తానికి బీజేపీ నేతృత్వంలో బిహార్ పయనం ఎలా ఉంటుందో ముందు తెలుస్తుంది.

# వీధి కుక్కలు ప్రభుత్వ స్కూల్ లోకి రాకుండా చర్యలు తీసుకోవాలి

---గ్రామ సెక్రటరీ అలివేలుకు అభిమన్యు యూత్ ఆధ్వర్యంలో వినతి

ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 17( లోకల్ గైడ్ ) వీధి కుక్కలు ప్రభుత్వ పాఠశాలలోకి రాకుండా చర్యలు చేపట్టాలని రాయపోల్ పంచాయతీ కార్యదర్శి అలివేలుకు అభిమన్యు యూత్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అభిమన్యు యూత్ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో విచ్చలవిడిగా వీధికుక్కలు వీరవిహారం చేస్తున్నాయి. అలాగే గ్రామంలో పౌల్ట్రీ ఫామ్స్ , మాంసహర షాపులు ఎక్కువగా ఉండటం వలన వాటి వ్యర్థాలను, చనిపోయిన కోళ్లను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వెయ్యడం వలన వీధికుక్కలు వాటిని తిని, గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతూ.. వీరవిహారం చేస్తూ పిల్లలపై దాడులకు పాల్పడుతూ అతి కిరాతకంగా విచక్షణ రహితంగా కాట్లు వేస్తూ తీవ్రంగా గాయపరుస్తునాయని అన్నారు. గతంలో కుక్కల దాడిలో గ్రామంలో చిన్నారులు ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఇప్పటికైనా వీధికుక్కలను స్కూల్ లోకి రాకుండా గేట్ కు కింద ర్యాంప్ గాని, ఇనుప రాడ్లతో జాలి గాని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గ్రామంలో వీధి కుక్కలను అరికట్టాలని పేర్కొన్నారు. అభిమన్యు యూత్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, పాషా, చేగురి లింగం, ప్రవీణ్ కుమార్, దోర్నాల శేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

# టీజీజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గాంధర్ ఉన్నత పాఠశాలలో పి ఆర్ సి వెంటనే అమలు.

పెండింగ్ డి ఏ చెల్లించాలని కామారెడ్డి జిల్లా కేంద్రం లో

గాంధారి మండలం లో టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు జ్ఞానేశ్వర్ అన్నారు




లోకల్ గైడ్ కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 17 :కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని టీజీజేఏసీ , రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గాంధారి ఉన్నత పాఠశాల లో పి ఆర్ సి వెంటనే అమలు, పెండింగ్ డిఏ బిల్లులు వెంటనే చెల్లించాలని మరియు ఉద్యోగులు సమస్యలు అన్నింటినీ పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపినారు .. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు టీపీటీఫ్ మండల అధ్యక్షులు జ్ఞానేశ్వర్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

# త్రాగునీటి సమస్య నిర్మూలన కొరకు పద్మారంలో బోర్ ప్రారంభం

సొంత నిధులతో రెండు బోర్లు మంజూరు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



( లోకల్ గైడ్ షాద్ నగర్) జిల్లేడు చౌదరి గూడ మండలం లోని..పద్మరం గ్రామంలో గ్రామ సర్పంచ్ మోహనచారి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి సొంత నిధుల తొ బోర్ పనులు స్థానిక సర్పంచ్ మోహన చారి బోర్ పనులను మొదలు పెట్టడం జరిగింది... ఈ కార్యక్రమం లో కొందుర్గు మాజీ జడ్పీటీసీ సభ్యులు తనయుడు రామకృష్ణ, మాజీ మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు మీది గడ్డ బాబురావు,సర్పంచ్ లు రవినాయక్, కన్న జంగయ్య, నందు,జ్యోతి శ్రీనివాస్ రెడ్డి,ఉప సర్పంచ్ లు కాసుల బాద్ ఉప సర్పంచ్ దిమా గణేష్,తుమ్మలపల్లి,ఉప సర్పంచ్ శేఖర్,చెరుకు పల్లి గ్రామ ఉప సర్పంచ్ ప్రేమ్ కుమార్, టేకులపల్లి గ్రామ ఉప సర్పంచ్ హలీం, మాజీ సర్పంచ్ హరి నాయక్, గోపాల్ నాయక్, ప్రేమ్ కుమార్,కృష్ణ ,వార్డు సభ్యులు గౌతమి వంశీ, మమత నరేష్ గౌడ్, సవాద రమేష్, బొమ్మగల్ల రవి,నర్సమ్మ,ఏదిరా నర్సింలు, గణేష్, ఖాబీర్ దాస్, మన్య నాయక్,మాదారం నర్సింలు,భాస్కర్ గ్రామ కమిటీ అధ్యక్షులు నరేష్ గౌడ్,ఎల్కు గూడ బి ఆర్ ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు వీరన్న,మాజీ టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోనేరు నర్సింరావు,మాజీ ఎంపీటీసీ లు రాములు, మానయ్య, సింగల్ విండో డైరెక్టర్ నారాయణ గౌడ్, టిఆర్ఎస్ నాయకులు రమేష్ యాదవ్,నర్సింలు, నవీన్ పటేల్,గాలిగూడ జగదీశ్,చింటూ,నరేష్,శ్రీ రాములు యాదవ్,రెడ్యానాయక్,తిరుపతి యాదవ్,సురేష్,రఘు నందన్,రాజు,రాంచంద్రచారి, గుఙ్టం పల్లి లింగని నర్సిములు, వీరచారీ, మనోహర్, సావాద యాదయ్య,పండరయ్య,బోయశ్రీనివాస్,రామస్వామి,రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,మహమ్మద్ లతీఫ్,హరిశ్వర్ రెడ్డి,శేఖర్,వెంకట్ రెడ్డి,గోవు మొగులయ్య, దర్శన్ గౌడ్,పద్మరం గ్రామ పెద్దలు, తదితరులు, పాల్గొన్నారు...

# ఖర్గేపై వ్యాఖ్యల వివాదం.. హిమాంత్‌పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు




సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ తెలంగాణ) ఏప్రిల్16:అక్బర్‌పేట్ భూంపల్లి మండలం లో మల్లికార్జును ఖర్గే గారిపై దాడి చేసి చంపేస్తామని చేసిన ఆరోపణల నేపథ్యంలో,హిమాంత్ బీస్వా శర్మ వ్యాఖ్యలు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని మాల మహానాడు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ మేరకు అస్సాం ముఖ్యమంత్రి హిమాంత్ బీస్వా శర్మపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ అక్బర్‌పేట్ భూంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓ నాగేశ్వరరావుకు ఫిర్యాదు అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, సోషల్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాల్వ నరేష్, రాష్ట్ర నాయకులు మండల యాదగిరి, దుబాసి సంజీవ్, బక్కయ్య, రమేష్, ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు నర్మెట ఏసు రెడ్డి, మల్లన్న గుట్ట డైరెక్టర్ బాసం మధు తదితరులు పాల్గొన్నారు.నాయకులు మాట్లాడుతూ, ఇటువంటి వ్యాఖ్యలు సమాజంలో ఉద్రిక్తతలకు దారితీసే అవకాశముందని, సంబంధిత అధికార యంత్రాంగం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



నిర్మల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 17 లోకల్ గైడ్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు, రోజువారీగా ఆసుపత్రుల్లో సగటున నమోదవుతున్న ఓపి లు, తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లోకి వైద్యం కోసం వచ్చే రోగులకు సేవా దృక్పథంతో వైద్యం అందించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్నారులు, వృద్ధులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆసుపత్రులలో అవసరమైన మందులు అవసరాన్ని బట్టి ఇండెంట్ పెట్టి సమకూర్చుకోవాలన్నారు. అన్ని రకాల రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు. ఆసుపత్రులకు వచ్చే జనాలకు వివిధ విభాగాల సమాచారం తెలిసేలా బోర్డులు ఖచ్చితంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల మెరుగుదల కొరకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, అధికారులు సౌమ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఐడీఓసీలో నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల భారీ నిరసన

- పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి --

టీజీఈజేఏసీ డిమాండ్

- ఉద్యోగుల ఐక్యతకు ఖమ్మం వేదిక...

ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం ఉధృతం




ఖమ్మం :లోకల్ గైడ్ :ఖమ్మం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) ఆవరణలో ఈ రోజు మధ్యాహ్న భోజన విరామ సమయంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సంయుక్త వేదిక టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందజేసిన నేపథ్యంలో, ప్రభుత్వ దృష్టికి ఉద్యోగుల ఆవేదనను తెలియజేసేందుకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా టీజీఈజేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ,




ఉద్యోగుల సమస్యలపై పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు సరైన స్పందన రాకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలోని సుమారు 15.25 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వ పరిపాలన సమర్థవంతంగా సాగాలంటే ఉద్యోగుల సంక్షేమం అత్యంత కీలకమని, ఉద్యోగులు ప్రభుత్వ అభివృద్ధికి ప్రధాన భాగస్వాములని పేర్కొన్నారు. ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి సరైంది కాదని, సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**ప్రధాన డిమాండ్లు ఇవే:**

పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ వెంటనే ప్రకటించి అమలు చేయాలి.పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు విడుదల చేయాలి.సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి.ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్యం అందేలా ఈహెచ్ఎస్ / ఆరోగ్య కార్డుల సమస్యలు పరిష్కరించాలి.ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కన్వీనర్ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని, అలాంటి ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ముందుకు రావాలని, న్యాయమైన హక్కుల సాధన వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ రోజు ఖమ్మంలో జరిగిన నిరసన కార్యక్రమానికి ఉద్యోగుల నుంచి వచ్చిన విశేష స్పందన రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి సందేశమని నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల ఐక్యతే తమ బలం అని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.ఈ సందర్భంగా ప్రధాన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీజ గారికి టీజీఈజేఏసీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు భారీ సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈరోజు జరిగిన నిరసన కార్యక్రమం ఖమ్మం కలెక్టర్ కార్యాలయం తో పాటు ఖమ్మం ఆర్ డి ఓ ఆఫీస్ సత్తుపల్లి కల్లూరు ఆర్డిఓ ఆఫీస్ ముందు మరియు అన్ని మండల కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఉద్యోగులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఉద్యోగుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు తుంబూరు సునీల్ రెడ్డి, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాజేష్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి, అధ్యక్షులు పారుపల్లి నాగేశ్వరరావు, ఎస్.కె రంజాన్, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్, టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంగళరావు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి తాళ్లూరి వేణు పి.ఆర్.టి.యు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు, ఎస్టీపిఏటి అధ్యక్షులు పరిస పుల్లయ్య, వెంకటపతి రాజు టిఎస్జీవోస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్, టీజీఓ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, ట్రెజరర్ సూరంపల్లి రాంబాబు, ౦అస్త్రశీం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్.ఎస్. జైపాల్, టీజీఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషు ప్రసాద్, నాయకులు తాళ్లూరి శ్రీకాంత్, టీజీవో హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ విజయ్ కుమార్, టీజీవో కార్యవర్గ సభ్యులు తాజుద్దీన్, డాక్టర్ బూరుగు శ్రీనివాస్, డాక్టర్ కిరణ్ కుమార్, ఇనపనూరి కిరణ్ కుమార్, డాకూరి బంగారి, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ బట్టు ఎంకన్న, డాక్టర్ దడిగల శ్రీనివాస్, డాక్టర్ కరీం, డాక్టర్ సర్వేశ్వరరావు, డాక్టర్ కార్తీక్ , మల్లెల మొగ్గల రాంబాబు, కృష్ణార్జున రావు, దేవేందర్, అగ్రికల్చర్ అసోసియేషన్ గెజిటెడ్ అధికారులు అరుణ కుమారి, అరుణ జ్యోతి, బాలాజీ, కిషోర్ బాబు, తార, కొమరగిరి దుర్గాప్రసాద్, వల్లపు వెంకన్న , అస్లాం ఖాన్, పెద్దినేని రాధాకృష్ణ ఏలూరి హరికృష్ణ కొణార్ ,బిక్కు, వెంకటరమణ, కోడి లింగయ్య, రాజు, రమణ యాదవ్, ఎర్ర రమేష్, లలిత కుమారి, విజయ, మృదుల, రాధికా రెడ్డి,కోటపాటి రుక్మారావు, దిలీప్ కుమార్, శంకర్, విక్కిరాల శ్రీనివాస్, పవన్, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ గెలుచుట అధికారులు స్థానిక ఆర్డిఓ ఆఫీస్ లో పాల్గొని వినతిపత్రం సమర్పించారు, తదితరులు పాల్గొన్నారు.

# మూడు వందల మంది సభ్యులున్న కమిటీకే శ్రీరామ ఇసుక ర్యాంపు ఇవ్వాలి

డీసీవో పై చర్యలు తీసుకోవాలి.. సభ్యుల డిమాండ్



చర్ల : లోకల్ గైడ్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలో ఉన్న కలివేరుకి చెందిన శ్రీరామ ఇసుక సొసైటీకి సంబంధించిన ఇసుక ర్యాంపు కేటాయింపుపై వివాదం నెలకొంది. సొసైటీకి చెందిన సుమారు 300 మంది సభ్యులు గత కలెక్టర్ మేరకు ర్యాంపు తమకే కేటాయిస్తారని హామీ ఇవ్వటంతో ఆశాభావంతో ఉన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పాయం శ్రీదేవి, శరియం రమాదేవి మాట్లాడుతూ ఆ సమయంలో కలెక్టర్ కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరిగి తమ సమస్యను తెలియజేసినట్లు తెలిపారని, అప్పట్లో డీసీవో కూడా ఈ కమిటీకి ర్యాంపు ఇవ్వడానికి అంగీకరించినట్లు సభ్యులు పేర్కొన్నారు. అయితే ఇటీవల కొత్త కలెక్టర్ బాధ్యతలు చేపట్టిన తరువాత పరిస్థితి మారిపోయిందని సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కేవలం 17 మంది సభ్యులతో ఉన్న మరో కమిటీకి ర్యాంపు కేటాయించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, తమ కమిటీకి చెందిన కొంతమంది సభ్యులను డబ్బు ఆశ చూపించి ప్రత్యర్థి కమిటీ వైపు ఆకర్షిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో పారదర్శకత లేకపోవడం పట్ల సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో ఉన్న తమ కమిటీని పక్కన పెట్టి చిన్న కమిటీకి ప్రాధాన్యత ఇవ్వడం అన్యాయమని అన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, శ్రీరామ ఇసుక సొసైటీకి అధికారికంగా ర్యాంపు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఈ మొత్తం వ్యవహారంలో డీసీవో పాత్రపై విచారణ జరిపి, అవసరమైతే తగిన చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తమకు నష్టం జరుగుతోందని, న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. అనంతరం సర్పంచ్, మాజీ సర్పంచ్ మాట్లాడుతూ వేరు వేరు మూడు కమిటీ లు ఉండగా ఒక్క కమిటీ గా ఏర్పడి ర్యాంపు తెచ్చుకుంటే కొందరు గిట్టని వారు కమిటీ సభ్యుల మధ్య వివాదానికి గురి చేస్తున్నారని, అధికారు స్పందించి వీరికే ఇసుక ర్యాంపు ఇవ్వాలని అధికారులను కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పూనెం నాగమణి, పసుపులేటి గౌతమి, శ్యామల హైమావతి, ఇర్పా రుక్మిణి, సోడి రమణలతో పాటు కమిటీ సభ్యుల అంతా పాల్గొన్నారు.

# జూన్ 2 లోపు పి ఆర్ సి ని ప్రకటించాలి రంగారెడ్డి జిల్లా జేఏసీ కన్వీనర్ డాక్టర్ కే. రామారావు

రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలపై రంగారెడ్డి జిల్లా ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ సమరశంఖం పూరించింది. జిల్లాలోని అన్ని మండల, డివిజన్, జిల్లా కేంద్రాలలో శుక్రవారంనాడు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ , కార్మిక పెన్షనర్లు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. 2వ పి.ఆర్.సి కమిటీ వేసి 30 నెలలు గడుస్తున్నా నివేదిక రాకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తూ, వెంటనే నివేదికను తెప్పించి 51% ఫిట్‌మెంట్‌తో జూన్ 2వ తేదీలోపు 2వ పి.ఆర్.సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 13,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కొత్త ఈ ఎచ్ ఎస్ విధానాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం నగదు రహిత చికిత్సను తక్షణమే అందుబాటులోకి తేవాలన్నారు. ప్రస్తుతం ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ సి పి ఎస్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ఓ పి ఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా 01/09/2004 కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా నియామకమైన వారికి వెంటనే పాత పెన్షన్ వర్తింపజేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15.25 లక్షల ఉద్యోగుల, పెన్షనర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ 4 ప్రధాన డిమాండ్లతో పాటు ఇతర 64 పెండింగ్ అంశాలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా ఉద్యోగుల జే ఏ సి విజ్ఞప్తి చేసింది. లేని పక్షంలో తదుపరి కార్యాచరణ ప్రకటించబడుతుందని తెలియజేశారు. తదనంతరం టి జీ ఏ జే ఏ సి నాయకులు జిల్లా కలెక్టర్ ను కలిసి మెమోరాండం సమర్పించి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డా కే రామారావు,శ్రీనేష్ కుమార్ నోరి, మహేందర్ రెడ్డి,ప్రవీణ్, గోపాల్ నాయక్, పూర్ణచందర్, శాంతి శ్రీ, సైదమ్మ, రాకేష్,యశ్వంత్,అనిత, అలివేలు, రమేష్, వెంకటస్వామి, రంగయ్య, మసూద్ అలీ, నరసింహ, విశ్వనాథం, సుధాకర్, నరసయ్య, గాలయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్, జీవన్, కృష్ణారెడ్డి,, జగన్మోహన్, రాఘవేందర్, శేఖర్ రెడ్డి, పాండు, యాదగిరి, రాములు, రాజు, బాలకృష్ణ, గోవర్ధనాచారి, చంద్రయ్య, లక్ష్మయ్య, డేవిడ్, మునీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్య అధికారి మంది మడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన



లోకల్ గైడ్ తెలంగాణ జిల్లా ప్రతినిధి : మహబూబాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి బి రవి రాథోడ్ టీబీ మందిమడుగు కేద్ర ముక్త్ భారత్ 100 రోజుల ప్రోగ్రాం లో భాగంగా దంతాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముంగిమడుగు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో 69 హై రిస్క్ గ్రామాలలో డిజిటల్ మొబైల్ ఎక్స్రే క్యాంపు లను ఏర్పాటు చేయడం జరిగిందని, గ్రామాలలోనే, రెండు వారాలకు మించి దగ్గు ఉన్న వారికి తెమడ పరీక్షతోపాటు, ఎక్స్ రే తీసి, టీబీ వ్యాధిని గుర్తించి సత్వరమే చికిత్స అందించడం జరుగుతుందని అన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు, ఆరు నెలలు మందులు వాడినచో నయమవునని తెలిపారు. దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ నీలిమ శ్వేత, అశోక్, ఆరోగ్య కార్యకర్తలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జేఏసీ హెచ్చరిక 22 నుంచి ఆర్టీసీ బస్ డిపో వద్ద నిరసనలు జేఏసీ నిర్ణయం




సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ తెలంగాణ) ఏప్రిల్ 16:ఆర్టీసీని వెంటనే ప్రైవేటీకరణ నుంచి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికుల జేఏసీ హెచ్చరించింది. ఈ నెల 22వ తేదీ నుంచి సిద్దిపేట బస్ డిపో వద్ద సమ్మెతో పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు.సుమారు 50 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో తమ పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన



హామీలను విస్మరించిందని ఆరోపించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత విస _రించి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న.రాష్ట్ర జేఏసీ కన్వీనర్ ఎండి మౌలానా.కో కన్వీనర్ యాదగిరి జెసి కోశాధికారి డి యాదయ్య, సిద్దిపేట జేఏసీ చైర్మన్ మల్లేశం, రవీందర్, బిఎస్ గౌడ్, ఎం ఎల్లయ్య, బిఎంఎస్ రాజయ్య, ఏ రాజేందర్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

Edited, Printed, Published & Owned by CH.RAM REDDY Published from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499\\\